ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 06.10.2025 | సంపుటి : 12 సంచిక : 77 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# బీహార్‌లో నూతన తేజస్వం




- తేజస్వీ యాదవ్‌వైపు యువతరం చూపు
- సర్వేల్లో క్రమంగా పెరుగుతున్న మద్దతు





దేశ రాజకీయాలను ప్రభావితం చేసే కేంద్రబిందువుగా బీహార్ నిలవనుందా..? పాతతరం నాయకత్వానికి పాతరేసే కార్యాచరణ సిద్ధమైందా..? అంటే అవుననే సమాధానమే ఇస్తున్నారు విశ్లేషకులు. దశాబ్దాల మూసధోరణికి ఇంకో నెలరోజుల్లోనే ముగింపు పలకనుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. వలసలు,ఉపాధి, ఆర్థిక స్వావలంబన విషయంలో అసహనంతో ఉన్న బీహార్ ప్రజలు.. ఈసారి యువరక్తాన్ని ప్రోత్సహించనున్నట్టు తెలుస్తోంది. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా యువత తన బలాన్ని నిరూపించుకోనుంది. ఈ నేపథ్యంలో ఉధృత ప్రచారం, బలమైన ఎజెండా తో ముందుకు సాగుతున్న రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) నేత తేజస్వీ యాదవ్‌వైపు యువతరం మొగ్గుచూపుతున్నట్టు పలు సర్వేల్లో వెల్లడవు తోంది. తేజస్వీ సహా కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ కూటమికి సైతం క్రమక్రమంగా మద్దతు బలపడుతున్నట్టు సర్వేల్లో స్పష్టమవుతోంది.

## కాలంచెల్లిన నేతగా నితీశ్ కుమార్ పట్ల విముఖత

- రిజర్వేషన్లు, ఉపాధి, వలసల విషయంలో అధికార పార్టీపై ఆగ్రహావేశాలు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బలంగా కనిపిస్తున్న మహాఘట్‌బంధన్
- అనేక నియోజకవర్గాల్లో కీలకం కానున్న ముస్లింల ఓటు బ్యాంకు
- కేంద్రాన్ని, జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే ఎన్నికగా అంచనాలు

**పాట్నా,అక్టోబర్ 05(జనంసాక్షి) :** కలం బంటో (పెన్నులు పంచండి) అనే నినాదంతో యువతను విద్య, ప్రగతివైపు మళ్లించే ప్రయత్నంలో తేజస్వీ యాదవ్ సఫలీకృతుడయ్యాడు. లాఠీల కు బదులు కలంతో అభివృద్ధి రాయాలని పిలుపునిచ్చిన ఆయన.. సుదీర్ఘ అనుభవమున్న నేతగా, యువత అభిలాషలకు అనుగుణంగా.. 20 ఏళ్లలో చేయని పనులు 20 నెలల్లో చేస్తానని ప్రకటిస్తున్నాడు. యువతకు ఉద్యోగాలు, విద్య, ఆర్థిక స్వావలంబన వాగ్దానాలు చేస్తున్నాడు. ప్రస్తుత సీఎం నితీశ్ కుమార్ సర్కారును ఇరవై ఏండ్ల పాత కారుగా విమర్శిస్తూ.. యువతకు అవకాశాలివ్వాలనే నినాదాన్ని ఎత్తుకున్నాడు. అందుకే సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ యువ నేత తేజస్వీ యాదవ్‌కే మద్దతు ఉన్నట్టు సీ ఓటర్ సర్వేలో వెల్లడైంది. ఈ సర్వేలో 40.6శాతం మంది తేజస్వీని బలపరిచారు. ఆయన చేపట్టిన బీహార్ అధికార్ యాత్ర కూడా ఆర్జేడీ కార్యకర్తలను ఉత్తేజపరిచింది. యాదవుల్లోనూ సింహభాగం తేజస్వి నాయకత్వాన్ని విశ్వసిస్తున్నారు.

### కీలకంగా ముస్లిములు

ఎన్డీయే, మహాఘట్‌బంధన్ మధ్య తీవ్ర పోటీ నెలకొన్న దరిమిలా యువతతో పాటు బీహార్ రాష్ట్రంలో ముస్లింల ఓట్లు కూడా కీలకంగా మారనున్నాయి. వివిధ సంస్థలు చేపట్టిన సర్వేల్లోనూ ఇరు కూటములు నువ్వా నేనా అన్నట్టు తలపడుతున్నప్పటికీ.. అంతిమంగా మహాఘట్‌బంధన్‌వైపై అత్యధికులు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే ఓట్ల చోరీ, నిరుద్యోగం, వలసలు, విద్య అంశాలపై ఉద్యమాలతో ఎన్నికలకు ముందు మహాఘట్‌బంధన్ బలం

మిగతా 2లో..

# జూబ్లీహిల్స్ రేసులో నలుగురు

- ఉపఎన్నిక అభ్యర్థుల జాబితా ఖరారు చేసిన కాంగ్రెస్
- కసరత్తు పూర్తి చేసిన పార్టీ రాష్ట్ర నాయకత్వం




**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం కసరత్తు పూర్తి చేసింది. నలుగురి పేర్లతో జాబితాను ఖరారు చేసినట్లు సమాచారం. షార్ట్ లిస్టులో నవీన్‌యాదవ్, సీఎన్ రెడ్డి, బొంతు రామ్మోహన్, అంజన్‌కుమార్ యాదవ్ పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. నలుగురి పేర్లతో కూడిన జాబితాను అధిష్ఠానానికి పంపనుంది. ఈ జాబితాను పరిశీలించి.. జూబ్లీహిల్స్ అభ్యర్థిని ఏఐసీసీ ప్రకటించనుంది. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఈ సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. ఆయనతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం వెళ్లనున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై సుప్రీం కోర్టులో కేసు దృష్ట్యా ఈ నేతల ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఢిల్లీలోని సీనియర్ న్యాయవాదులను కలిసి.. బలమైన వాదనలు వినిపించేలా వారితో చర్చించనున్నట్లు సమాచారం.

మిగతా 2లో..

# ఈవీఎంలో ఇక అభ్యర్థుల కలర్ ఫొటోలు

## ప్రకటించిన ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** బిహార్‌లో నవంబర్ 22 లోగా అసెంబ్లీ ఎన్నికలను పూర్తి చేస్తామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. తొలిసారిగా ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల

మిగతా 2లో..

# కొండచరియలు విరిగిపడి..

- 17 మంది దుర్మరణం
- శిథిలాల కింద మరికొందరు
- పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో విషాదం



**డార్జిలింగ్(జనంసాక్షి):**పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో కొండ చరియలు విరిగిపడి 17 మంది ప్రాణాలు కోల్పోయారు. శిథిలాల కింద చాలామంది చిక్కుకున్నారు.ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మిరిక్- కుర్సియాంగ్ పర్యాటక ప్రదేశాలను కలిపే దుడియా ఐరన్ వంతెన కూలిపోయింది. కుర్సియాంగ్ సమీపంలోని జాతీయ రహదారి 110 వెంబడి కొండచరియలు విరిగిపడ్డాయి.ఉత్తర బెంగాల్ అంతటా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం కూచ్ బెహార్, జల్పైగురి, అలీపుర్దువార్ జిల్లాలలో ఆదివారం అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేయడంతో ఈ ప్రాంతంలో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఉత్తర బెంగాల్‌లోని పొరుగు జిల్లా అలీపుర్దువార్‌లో సోమవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురుస్తాయని

మిగతా 2లో..

# నేపాల్‌లో వరద బీభత్సం..

28 మంది మృతి

# భూటాన్‌ను ముంచెత్తిన వరదలు..


సహాయచర్యల్లో భారత సైన్యం



2లో..

# శాంతి ఒప్పందానికి త్వరగా అంగీకరించండి

## లేదంటే మరింత విధ్వంసం • హమాస్‌కు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు పాలస్తీనా గ్రూప్ హమాస్‌ను హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో శాంతి ఒప్పందానికి త్వరపడి, అంగీకరించాలని లేదంటే గాజాలో మరింత విధ్వంసం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.యుద్ధ విరమణ విషయంలో హమాస్ త్వరగా నిర్ణయం తీసుకోవాలి..లేకుంటే దానికి ఇచ్చిన అన్ని అవకాశాలు నిలిచిపోతాయి. గాజాలో మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తితే సహించేదిలేదంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ పేజీలోని ఒక పోస్టులో పేర్కొన్నారు.బందీల విడుదల, శాం తి ఒప్పందానికి అనుగుణంగా ఇజ్రాయెల్ తా త్కాలికంగా బాంబు దాడులను ఆపివేసిందని ట్రంప్ పేర్కొన్నారు. తమ దేశ సీనియర్ రా యబారి ఒకరు బందీల విడుదల వివరాలను ఖరారు చేయడానికి ఈజిప్టుకు వెళుతున్నారని, ఇకపై ఇజ్రాయెల్‌తో పాటు శాంతి ప్రణాళికను అమలు చేయడంలో హమాస్ జాప్యం చేస్తే సహించబోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. బందీల విడుదలపై వివరాలను ఖరారు చేసేందుకు, ఇజ్రాయెల్, హమాస్ మధ్య వివాదాన్ని ముగించేందుకు అమెరికా

మిగతా 2లో..


# త్వరలో ఇజ్రాయెల్ విజయం సాధిస్తుంది

హమాస్ ఆయుధాలను వదిలేస్తుంది : నెతన్యాహు

2లో..

# భారత్‌ను ఇబ్బంది పెట్టే చర్యలు చేపట్టబోం

## పాక్‌కు సహకారంపై వార్తలను కొట్టిపారేసిన రష్యా



**మాస్కో(జనంసాక్షి):**పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం రష్యా ఇంజిన్లను సరఫరా చేస్తున్నట్లు వస్తున్న వార్తలను మాస్కో కొట్టిపారేసింది. ఆ దేశంతో అటువంటి ఒప్పందం తాము చేసుకోలేదని రష్యా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌తో పెద్ద ఎత్తున వాణిజ్య సంబంధాలను కొనసాగిస్తున్న నేపథ్యంలో.. పాక్‌కు మద్దతుగా తాము చర్యలు తీసుకుంటున్నట్లు ప్రచారాలు చేయడం సరికాదన్నాయి. భారత్‌కు ఇబ్బందికరంగా మారే చర్యలు తాము చేపట్టబోమని స్పష్టం చేశాయి. అయితే.. ఈ విషయంపై అక్కడి ప్రభుత్వం అధికారికంగా ప్రకటన చేయలేదు. పాక్‌లో ఉన్న చైనా తయారీ ఫైటర్ జెట్లలో వాడే ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందని పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. అంతర్జాతీయ మీడియా నివేదికలను ఉటంకిస్తూ.. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ భాజపాపై తీవ్ర విమర్శలు చేసింది. ప్రధాని మోదీ రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపార భాగస్వామిగా చెబుతారని.. కానీ ఆ దేశం మన శత్రుదేశమైన పాక్‌కు మద్దతునిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఇతర దేశాలతో సంబంధాల విషయంలో ప్రధాని మోదీ వైఫల్యాన్ని సూచిస్తుందన్నారు. ఆయన జాతీయ ప్రయోజనాలకంటే తనకు పేరు వచ్చే విషయాలకే ప్రాధాన్యత నిస్తారని దుయ్యబట్టారు. రష్యా ఎందుకు పాక్‌కు సహకారాన్ని అందిస్తుందో మోదీ ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు.

# బడుగు జీవుల పెన్నిధి కాకా

## బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాటం చేసిన వెంకటస్వామి : డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్(జనంసాక్షి):** చిన్ననాటి నుంచి మొదలుకొని సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం తపిస్తూ జీవితాంతం పోరాటం చేసిన మహనీయుడు జి. వెంకటస్వామి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గడ్డం వెంకటస్వామి 96వ జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు.వెంకటస్వామి 96వ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆయనకు ఘన నివాళులు అర్పిస్తున్నాం అన్నారు. వెంకటస్వామి కేంద్ర మంత్రిగా ,రాష్ట్ర మంత్రిగా, ఉమ్మడి రాష్ట్రంలో

మిగతా 2లో..

# జీఎస్టీపై ఏంటీ డ్రామా?

- పెంచిది మీరే.. తగ్గించింది మీరే..
- వసూళ్లు చేసింది వెనక్కి ఇస్తారా! : హరీశ్



**హైదరాబాద్(జనంసాక్షి):**మోసగించడం, దోచుకోవడంలో కాంగ్రెస్, భాజపా దొందూ దొందేనని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఒక పార్టీది మోస చరిత్ర, మరో పార్టీది ద్రోహ చరిత్ర అన్నారు. చోటా భాయ్, బడే భాయ్ ఇద్దరిదీ ఒకే తీరు అని విమర్శించారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల భాజపా నేతలు హరీశ్‌రావు సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో సంగారెడ్డి జడ్పీ స్థానం తమ పార్టీదే అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో గులాబీ జెండా ఎగురుతుందని చెప్పారు. భాజపా, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణకు శత్రువులే అని పేర్కొన్నారు. "8 మంది ఎంపీలను గెలిపించారన్న కృతజ్ఞత కూడా భాజపాకు లేదు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలే కేంద్రానికి ప్రాధాన్యం. జీఎస్టీ పెంచింది మీరే.. తగ్గించిన ట్లు డ్రామాలు ఆడుతున్నది మీరే. తెలంగాణకు కేసీఆర్, భారత రాష్ట్ర సమితినే శ్రీరామరక్ష. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు బుద్ధి చెప్పాలి" అని హరీశ్‌రావు అన్నారుసీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

మిగతా 2లో..

# బడుగుజీవులపై భారం మోపుతారా?

## బస్సు ఛార్జీల పెంపుపై కేటీఆర్ ఆగ్రహం




**హైదరాబాద్(జనంసాక్షి):**జంట నగరాల్లో బస్సు ఛార్జీల పెంపు నిర్ణయం దుర్మార్గమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. సిటీ బస్సు ఛార్జీలను ఏకంగా రూ.10 పెంచారని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రయాణికుల జేబులను కొల్లగొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారన్నారు. ఛార్జీల పెంపుతో ప్రతి ప్రయాణికుడిపై నెలకు రూ.500 అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. బడుగు జీవులు ఎలా బతకాలో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ఇప్పటికే విద్యార్థుల బస్సు పాసులు, టీ-24 టికెట్ ఛార్జీలను పెంచారు. కనీస ఛార్జీలపై 50 శాతం ధర పెంచడం అసమర్థ విధానాలకు నిదర్శనం. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ ప్రజలపై కక్ష పెంచుకున్నారు. ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీ దివాలా తీసింది. సంస్థను గట్టెక్కించాల్సిందిపోయి సామాన్యుల నడ్డి విరుస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు. కాగా సామాన్య ప్రజలంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకంత కోపమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. బస్సు ఛార్జీల పెంపుపై

మిగతా 2లో..

# ఎట్టకేలకు దిగొచ్చిన పాక్ సర్కార్

పీవోకేతో ఒప్పందానికి అంగీకారం 2లో..

# 8న భారత్‌కు కీర్ స్టార్మర్

8, 9వ తేదీల్లో పర్యటించనున్న బ్రిటిష్ ప్రధాని 9లో..

# నిరసనల్లో హత్యలపై స్వతంత్ర విచారణ జరగాలి

లేదంటే జైల్లోనే ఉంటా :వాంగ్‌చుక్



**ఇస్లామాబాద్(జనంసాక్షి):**గత వారం రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చెలరేగుతున్న నిరసనోద్యమాన్ని చల్లార్చేందుకు పాకిస్తాన్ ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది.

మిగతా 2లో..

# ఈవీఎంలో ఇక అభ్యర్థుల కలర్ ఫొటోలు

కలర్ ఫొటోలను ఉంచనున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రెండు రోజుల పాటు పర్యటించి, సమీక్షించిన ఎన్నికల సంఘం.. వీటికి సంబంధించిన వివరాలను పట్నాలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించింది. ఈ సందర్భంగా పుట్టిన తేదీ, పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ కాదని మరోసారి స్పష్టం చేసింది. చట్టానికి లోబడే ఆధార్‌ను ఉపయోగిస్తున్నామని ఈసీ తెలిపింది."అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశాం. గరిష్ఠంగా 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండనుంది. ఇప్పటికే బూత్ స్థాయి అధికారులకు శిక్షణ పూర్తిచేశాం. ఎన్ని దశల్లో పోలింగ్ నిర్వహించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ఈవీఎంలలో పొందుపరిచే బ్యాలెట్ పేపర్లలో అభ్యర్థుల కలర్ ఫొటోలను ఉంచనున్నాం. తద్వారా అభ్యర్థులను ఓటర్లు తేలికగా గుర్తుపట్టేందుకు వీలుంటుంది. సీరియల్ నంబర్ కూడా పెద్దగా కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నాం" అని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఎస్ఐఆర్ ద్వారా అనర్హులను జాబితా నుంచి తొలగించామని, దీన్ని బిహార్ ఓటర్లు కూడా స్వాగతించారని చెప్పారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు తెలిపేందుకు రాజకీయ పార్టీలకు ఇంకా అవకాశం ఉందన్నారు.243 స్థానాలు కలిగిన బిహార్ అసెంబ్లీకి గడువు 2025 నవంబర్ 22తో ముగియనుంది. ఆ గడువులోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించిన ఈసీ.. గడువులోగా పూర్తి చేస్తామని చెప్పింది. అయితే, ఒకటి, రెండు దశల్లోనే వీటిని పూర్తి చేయాలనే అభ్యర్థనలు వచ్చాయని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. 2020లో మూడు విడతల్లో పోలింగ్ జరగ్గా.. అంతకుముందు (2015లో) ఐదు విడతల్లో పోలింగ్ జరిగింది. ఇదిలాఉంటే, రాష్ట్రంలో 7.42 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఈసీ ఇటీవల వెల్లడించింది.

# ఆ హత్యలపై స్వతంత్ర విచారణ జరగాలి..

**- లేదంటే జైల్లోనే ఉంటా: వాంగ్‌చుక్**

**కాశ్మీర్(జనంసాక్షి):**లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా డిమాండ్ చేస్తూ ఇటీవల లేహ్ ప్రాంతంలో అల్లర్లు జరిగిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి లద్దాఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా ఆయన జైలు నుంచి ఓ సందేశాన్ని పంపారు. ఘర్షణల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోవడంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని, లేదంటే తాను జైలులోనే ఉండిపోయేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వాంగ్‌చుక్ ప్రస్తుతం జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. సోదరుడు కాత్సేతాన్ డోర్జే లేతో పాటు న్యాయవాది ముస్తఫా హాజీలు ఆయన్ను కలిసిన సందర్భంగా ఈ సందేశాన్ని పంపారు. 'నేను శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నాను. నా కోసం ప్రార్థిస్తున్న వారికి ధన్యవాదాలు. ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి. నలుగురు వ్యక్తుల హత్యలకు సంబంధించి స్వతంత్ర న్యాయ విచారణ జరగాలి. లేదంటే నేను జైలులోనే ఉండేందుకు సిద్ధంగా ఉన్నాను. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కోసం ప్రజలు, లేహ్ అపెక్స్ బాడీ(ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఏడీఏ) చేస్తున్న డిమాండ్‌లకు మద్దతిస్తున్నా' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్నారు. అహింసా మార్గంలోనే మన పోరాటాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ప్రజలకు సూచించారు. లేహ్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక అల్లర్లలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. 90 మందికి పైగా గాయపడ్డారు. ఉద్యమకారులు సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే ఈ ఆందోళనలు జరిగాయని కేంద్రం వెల్లడించింది. అనంతరం పోలీసులు ఆయనను జాతీయ భద్రత చట్టం కింద అరెస్టు చేశారు. ఇలా అరెస్టయిన వ్యక్తిని విచారణ చేయకుండా 12 నెలల పాటు నిర్బంధించేందుకు చట్టం అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే తన భర్తను విడుదల చేయాలంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జే ఆంగ్మో సుప్రీం కోర్టు ను ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరగనుంది.

# బస్తర్ ప్రజలకు 10వేల రేడియో సెట్‌లు

**బస్తర్(జనంసాక్షి):**మావోయిస్టు రహిత దేశంగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రభావిత ప్రాంతాల్లో అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో మావోల ప్రభావం ఎక్కువగా ఉండే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రజల్లో మావోయిస్టు భావజాలాన్ని తొలగించి.. వారికి చేరువయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వారిలో జాతీయ భావనను పెంచేందుకు గాను భద్రతా దళాలు రేడియో సెట్‌లను అందించే కార్యక్రమాన్ని చేపట్టాయి. ఇందులో భాగంగా నాలుగు నెలల్లో దాదాపు 10వేలకు పైగా రేడియో సెట్‌లను అక్కడి స్థానికులకు పంపిణీ చేశాయి. మావోయిస్టుల నిర్మూలనకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర హోంశాఖ.. బస్తర్ ప్రాంతంలోని ఏడు జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా అనేక ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ సాయంతో వందలాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. తాజాగా రేడియో సెట్‌లను పంపిణీ చేసి.. ప్రధాని మోదీ ప్రతినెల సామాన్యులతో సంభాషించే మన్‌-కీ-బాత్‌తోపాటు వివిధ ప్రభుత్వ పథకాలు, వినోద కార్యక్రమాలను వినేలా ఏర్పాట్లు చేసింది.మొత్తంగా అక్కడ మోహరించిన 180 కంపెనీల సీఆర్‌పీఎఫ్ బలగాలకు 60 రేడియోల చొప్పున కేటాయించగా.. వాటిని మారుమూల ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 54వేల మందిని ప్రధాన స్రవంతికి చేరువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో రేడియో సెట్ ఖరీదు రూ.1500గా అంచనా. బ్యాటరీలు లేదా కరెంటుతో పనిచేసేలా ఈ రేడియోలను రూపొందించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

# మరో రెండు వారాల్లో గ్రోకీపీడియా : మస్క్

వాషింగ్టన్(జనంసాక్షి):టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మరో సంచలనానికి తెరతీశారు. నాలెడ్జి ప్లాట్‌ఫామ్ వికీపీడియా తరహాలోనే కొత్త దానిని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ పోస్టులో వెల్లడించారు. దానికి గ్రోకీపీడియాగా పేర్కొన్నారు. దీని 0.1 బీటా వెర్షన్ మరో రెండు వారాల్లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. గ్రోకీపీడియను మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ కంపెనీ ఎక్స్ఏఐ సిద్ధం చేస్తోంది. ఎక్స్‌యూజర్ "మనుషులకు, కృత్రిమ మేధకు ప్రపంచంలోనే అత్యంత కచ్చితమైన నాలెడ్జ్ సోర్స్. దీనికి హద్దులు లేవు" అంటూ చేసిన పోస్టును మస్క్ రీపోస్టు చేశారు. గ్రోకీపీడియాకు సంబంధించిన ఫీచర్లను మస్క్ ఇప్పటి వరకు అధికారికంగా వెల్లడించలేదు. వాస్తవాలను వెల్లడించడం కోసమే మస్క్ ఈ ప్లాట్‌ఫామ్‌ను తయారు చేస్తున్నారు. ఇక సెప్టెంబర్ నెలలో కూడా మస్క్ గ్రోకీపీడియా ప్రస్తావన తీసుకొచ్చారు. తాజాగా దాని బీటా వెర్షన్ డేట్‌ను విడుదల వివరాలు వెల్లడించడం విశేషం. దీనిని ఎక్స్ యాప్‌తోనే అనుసంధానించి ఇచ్చే అవకాశం ఉంది.




# బీహార్‌లో నూతన 'తేజస్వం'



**వెనుకబడినవర్గాలకు తేజస్వి భరోసా**

బీహార్‌లో దశాబ్దాలుగా వెనుకబడిన కులాల్లో విద్య, ఉపాధి కరువైంది. ఈ కారణంగా యువతలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. అందుకే తేజస్వి యాదవ్.. ముసహర్ భుయాంల వంటి వెనుకబడిన కులాల్లోని యువతను కూడా ఆకర్షిస్తూ పేదరిక నిర్మూలన, ఇళ్లు, ఉద్యోగాలు వాగ్దానాలు చేస్తున్నాడు. ఫలితంగా సీఎంగా ఆయనను అత్యధికులు ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో నితీశ్‌కుమార్‌కు సగం కూడా మద్దతు లభించలేదు. ఇది యాదవ్, ముస్లింలు, యువతలో మహాఘట్‌బంధన్ మద్దతు బలపడుతున్నట్టు సూచిస్తోంది. ఎన్‌డీయే ప్రభుత్వంపై అవినీతి, నియామకాల కొరత, పేపర్ లీక్‌లు వంటి ఆరోపణలు ఈ ఎన్నికల్లో బలహీనతలుగా మారాయి. ఇక ప్రశాంత్ కిషోర్ పార్టీ జన సురాజ్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే బీహార్ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మార్పు తథ్యమని తేజస్వీ ప్రకటించడం ఎన్‌డీయే కూటమిలో గుబులు రేపుతోంది. రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్లు, ఉద్యోగాలు వంటి అంశాలపై యువత మద్దతు మరింత పెరిగితే బీహార్ రాజకీయాల్లో కొత్తశకం మొదలుకావడం ఖాయం..!



మరింత పుంజుకుంటోందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే రాష్ట్రంలో ఉన్న 38 జిల్లాల్లోనూ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిములు ప్రభావితం చూపనుండటం గమనార్హం. వారి ఓటు బ్యాంకు ఈసారి ఏకపక్షంగా మహాఘట్‌బంధన్‌వైపే ఉండనుంది. ఎన్‌డీయేతో భాగస్వామిగా ఉన్నందు వల్లనే జేడీయూను ముస్లిం ఓటర్లు వ్యతిరేకిస్తున్నట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# బస్సు ఛార్జీలు పెంచి బడుగుజీవులపై భారం మోపుతారా..?

ఆమె 'ఎక్స్' వేదికగా విమర్శలు చేశారు. ఇటీవల బస్సు పాస్ ధరలు పెంచి చిరుద్యోగులపై పెనుభారం మోపారన్నారు. ఇప్పుడు బస్సు ఛార్జీలను అమాంతం పెంచేశారని మండిపడ్డారు. బస్సు ఎక్కడమే పాపం అన్నట్లుగా ప్రజల జేబులను గుల్ల చేస్తున్నారని విమర్శించారు. గ్రీన్ జర్నీ పేరుతో సామాన్యుల రక్తాన్ని పీల్చేస్తున్నారని ఆరోపించారు.

# జీఎస్టీపై ఏంటీ డ్రామా?

రాశారు. పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో రిజర్వేషన్లు లేక రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం జరిగిందని అందులో పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో స్థానిక రిజర్వేషన్ కల్పించలేదన్నారు. దీంతో వందలాది విద్యార్థులు పీజీ సీట్లు కోల్పోతున్నారని వివరించారు. ఏపీలో మేనేజ్‌మెంట్ కోటా కింద 85 శాతం సీట్లు స్థానికులకే ఇస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయ లోపంతో 450 పీజీ సీట్లు ఆల్ ఇండియా కోటాకు వెళ్తున్నాయని తెలిపారు. మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం స్థానిక రిజర్వేషన్ తక్షణం అమలు చేయాలని.. ప్రస్తుతం విడుదల చేసిన పీజీ ప్రవేశాల నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త జీవో జారీ చేసి రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలన్నారు.

# బడుగు జీవుల పెన్నిధి కాకా

**- బలహీన వర్గాల కోసం జీవితాంతం పోరాటం చేసిన వెంకటస్వామి**

**- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

పిసిసి అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. ప్రధానంగా కార్మికుల కోసం ఆయన ప్రత్యేకంగా చేసిన కార్యక్రమాలు, సేవలు ఆయన ప్రత్యేకంగా తెచ్చిన చట్టాలు సమాజంలోని తాడిత, పీడిత ప్రజలు కార్మికులకు పెద్ద ఎత్తున ఉపయోగపడ్డాయి అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి దశలో ఆయన చేసిన పోరాటం మరువలేనిది అన్నారు. వారి ఆశయాలను మార్గాలను అనుసరిస్తూ సమాజానికి మనమంతా పునరంకితం కావడమే వెంకటస్వామికి ఘనమైన నివాళులు అర్పించడమని డిప్యూటీ సీఎం తెలిపారు.



# భారత్ ఇబ్బంది పెట్టే చర్యలు చేపట్టబోం

ప్రపంచ దేశాలతో సంబంధాలను మెరుగుపరుచుకుంటున్నట్లు చెప్పే మోదీ.. ఇప్పటికీ దౌత్యం విషయంలో పాక్‌ను ఒంటరిని చేయలేకపో తున్నారని విమర్శించారు.

# శాంతి ఒప్పందానికి త్వరగా అంగీకరించండి

అధ్యక్షుడు రూపొందించిన ఒప్పందంపై చర్చించేందుకు అమెరికా రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ఈజిప్టుకు ప్రాంతానికి వెళుతున్నారని వైట్ హౌస్ అధికారి మీడియాకు తెలిపారు.రెండేళ్లుగా కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించే ప్రణాళికకు పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ శుక్రవారం సానుకూలంగా స్పందించింది. బందీలను విడుదల చేయడానికి, ఒప్పంద వివరాలను చర్చించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొంది. ఇదే సమయంలో యుద్ధంలో దెబ్బతిన్న భూభాగంపై బాంబు దాడులను వెంటనే నిలిపివేయాలని ట్రంప్ ఇజ్రాయెల్‌కు పిలుపునిచ్చారు. అయితే ఇజ్రాయెల్ దళాలు ట్రంప్ మాటను ఉల్లంఘిస్తూ గాజాలో దాడులకు దిగాయి. ఇజ్రాయెల్ దాడుల్లో 57 మంది మృతిచెందారని, వారిలో ఒక్క గాజా నగరానికి చెందినవారే 40 మంది ఉన్నారని ఎన్క్లేవ్ పౌర రక్షణ సంస్థ తెలిపింది.

# ఎట్టకేలకు దిగి వచ్చిన పాక్ సర్కార్..

మొదటి మిలిటరీని పంపి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నించి విఫలమైన షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం.. చివరకు ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న జమ్ముకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేకేజేఏఏసీ)తో ఒప్పందం చేసుకుంది. ఈ క్రమంలో 25 అంశాలతో కూడిన ఒప్పందం ప్రతిని పాక్ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి తారిఖ్ ఫజల్ చౌదరి శనివారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. గత నెల 29 నుంచి జరుగుతున్న హింసాత్మక ఘర్షణల్లో పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 10 మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. దీంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు ముజఫరాబాద్‌కు షహబాజ్ షరీఫ్ గత బుధవారం ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపారు. వారు జేకేజేఏఏసీ నేతలతో రెండు రోజుల పాటు చర్చలు జరిపి ఒక ఒప్పందానికి వచ్చారు. దీని ప్రకారం పాక్ ప్రభుత్వం పీవోకేలోని ముజఫరాబాద్, పూంచ్‌లలో అదనంగా ఇంటర్మీడియట్, సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డులను ఏర్పాటుచేస్తుంది.అలాగే, ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు స్థానిక ప్రభుత్వం 15 రోజుల్లోగా హెల్త్ కార్డు అమలుకు నిధులు మంజూరు చేయాలి. పీఓకేలో విద్యుత్ వ్యవస్థను మెరుగుపరచడానికి నిధులు అందించాలి. పీఓకే అసెంబ్లీ సభ్యుల అంశంపై న్యాయ, రాజ్యాంగ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ చర్చించాలి. ఆస్తి బదిలీలపై పన్నును 3 నెలల్లోగా పంజాబ్ లేదా పంఖ్తుఖ్వాలతో సమానంగా తీసుకురావాలి. ఈ ఒప్పందాన్ని పర్యవేక్షించి అమలుచేయడానికి ఓ కమిటీని కూడా ఏర్పాటుచేస్తారు.



# మొయినాబాద్‌లోని ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

## 50 మంది మైనర్ల డ్రగ్స్ పార్టీ..

హైదరాబాద్(జనంసాక్షి):రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పరిధిలోని ఫాంహౌస్‌పై పోలీసులు దాడి చేశారు. పెద్దమంగళారం గ్రామ సమీపంలోని చెర్రీ ఓక్స్ ఫాంహౌస్‌లో మైనర్లు మద్యం, డ్రగ్స్ పార్టీ చేసుకున్నారు. సుమారు 50 మంది పార్టీలో పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు. వీరంతా ఇన్‌స్టాగ్రాంలోని ట్రాప్‌హౌస్ 9ఎంఎం అనే పేజీలో పరిచయమయ్యారు. పక్కా సమాచారంతో రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. ఆరుగురు నిర్వాహకులను ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ టెస్టులో ఇద్దరు మైనర్లకు గంజాయి పాజిటివ్ వచ్చింది. 8 విదేశీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# భారత నౌకాదళంలోకి మరో యుద్ధనౌక 'ఆండ్రోత్'



**విశాఖపట్నం**(జనంసాక్షి): విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో రెండో 'యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్' 'ఆండ్రోత్'ను వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధర్కర్ సోమవారం జాతికి అంకితం చేయనున్నారు. భారత నౌకాదళం స్వదేశీకరణ ప్రయత్నాల్లో ఇది మరో మైలురాయి కానుంది. ఇటీవలే అత్యాధునిక యుద్ధనౌకలు అర్నాలా, నిస్తార్, ఉదయగిరి, నీలగిరిల ప్రవేశంతో నౌకాదళంలో కొత్త ఉత్సాహం నెలకొంది. లక్షద్వీప్‌లోని ఓ ద్వీపం పేరైన 'ఆండ్రోత్'ను ఈ నౌకకు పెట్టారు. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ సంస్థ దీన్ని నిర్మించింది.

# నేను రాజీనామా చేయడం లేదు

## దుష్ప్రచారాలు నమ్మొద్దు: దానం నాగేందర్

**హైదరాబాద్**(జనంసాక్షి): ఎమ్మెల్యే పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఖండించారు. రాజీనామా ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు. "నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదు. నేనంటే గిట్టనివాళ్లు దుష్ప్రచారం చేస్తున్నారు. రాజీనామా అనే ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు" అని విజ్ఞప్తి చేశారు.

# కొండచరియలు విరిగిపడి..

వాతావరణ శాఖ తన బులెటిన్‌లో పేర్కొంది.పశ్చిమ జార్ఖండ్, దక్షిణ బీహార్, ఆగ్నేయ ఉత్తరప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా ఆవరించిన అల్పపీడనం ఉత్తర-ఈశాన్య దిశగా బీహార్ వైపు కదిలి, క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. దక్షిణ బెంగాల్‌లోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ముర్షిదాబాద్, బిర్భూమ్, నదియా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత 24 గంటల్లో పశ్చిమ బెంగాల్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయని, బంకురాలో అత్యధికంగా 65.8 మి.మీ. వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.అతలాకుతలమయ్యింది. డార్జిలింగ్‌లోని మిరిక్, సుఖియా పోఖరిలలో కొండచరియలు విరిగిపడి 14 మంది మరణించారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో పశ్చిమ బెంగాల్ - సిక్కిం మధ్య రోడ్డు సంబంధాలు తెగిపోయాయి. డార్జిలింగ్- సిలిగురి మధ్య ప్రధాన రహదారి మూసుకుపోయింది. భారీ వర్షపాతం జల్పైగురి, సిలిగురి, కూచ్‌బెహార్‌లను ప్రభావితం చేసింది. అనేక ప్రాంతాలు నీటమునిగాయి. చిత్రే, సెల్ఫీ దారా తదితర ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో జాతీయ రహదారి-10లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.సోమవారం ఉదయం వరకు పశ్చిమ బెంగాల్‌లోని ఉప-హిమాలయ జిల్లాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణ శాఖ తెలిపింది. డార్జిలింగ్, కాలింపాంగ్,

### నేపాల్‌లో వరద బీభత్సం..

**28 మంది మృతి**

**ఖాట్మండు(జనంసాక్షి):**నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఖాట్మండులో భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లుతున్న బాగ్మతి నది ఒడ్డు సమీపాన ఉన్న ప్రజలు ముప్పు బారిన పడ్డారు. వారిని నేపాల్ ఆర్మీ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. గడచిన 36 గంటల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు తెగిపోయాయి. వంతెనలు కొట్టుకుపోయాయి . విపత్తు ప్రమాదాల్లో 28 మంది మృతిచెందారని అధికారులు తెలిపారు.భారతదేశానికి తూర్పున సరిహద్దులో ఉన్న ఇలాం జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో 18 మంది మరణించారని పోలీసు ప్రతినిధి బినోద్ ఘిమిరే తెలిపారు. దక్షిణ నేపాల్‌లో పిడుగుపాటుకు ముగ్గురు మరణించగా, ఉదయపూర్ జిల్లాలో వరదలకు ఒకరు మృతిచెందారని ఆయన తెలిపారు. వరదల కారణంగా 11 మంది కొట్టుకుపోయారని అధికారులు తెలిపారు. విపత్తు సంభవించిన ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ప్రతినిధి శాంతి మహత్ మీడియాకు తెలిపారు.భారతదేశానికి తూర్పున సరిహద్దులో ఉన్న ఇలాం జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో 18 మంది మరణించారని పోలీసు ప్రతినిధి బినోద్ ఘిమిరే తెలిపారు. దక్షిణ నేపాల్‌లో పిడుగుపాటుకు ముగ్గురు మరణించగా, ఉదయపూర్ జిల్లాలో వరదలకు ఒకరు మృతిచెందారని ఆయన తెలిపారు. వరదల కారణంగా 11 మంది కొట్టుకుపోయారని అధికారులు తెలిపారు. విపత్తు సంభవించిన ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ ప్రతినిధి శాంతి మహత్ మీడియాకు తెలిపారు.

### భూటాన్‌ను ముంచెత్తిన వరదలు..

**- సహాయచర్యల్లో భారత సైన్యం**

**థింపు(జనంసాక్షి):**కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో పొరుగుదేశం భూటాన్‌లో వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదీ పరివాహ ప్రాంతాల్లో ఆకస్మిక వరదల కారణంగా వేలమంది ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. దీంతో అక్కడి ప్రజలకు సహాయం అందించేందుకు భారత సైన్యం రంగంలోకి దిగింది. భూటాన్ అధికారులు, భారత సైనికులు సంయుక్తంగా చేపట్టిన సహాయక చర్యల్లో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న భూటాన్ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.భారీ వర్షాలు కురుస్తుండడం వల్ల వల్ల ప్రతికూల వాతావరణం కారణంగా బాధితులను తరలిస్తున్న భూటాన్ హెలికాప్టర్ పని చేయకపోవడంతో ఆ దేశం భారత్‌ను అత్యవసరం సాయం కోరిందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. వెంటనే స్పందించిన భారత్ సైన్యం వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా తరలించి.. వారికి తక్షణ వైద్య సహాయం అందేలా రెండు హెలికాప్టర్లను మోహరించిందని తెలిపాయి. మరోవైపు నేపాల్‌లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో తూర్పు నేపాల్‌లో శనివారం రాత్రి కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు.







# 'బోయింగ్'లో ఎలక్ట్రికల్ వ్యవస్థలను తనిఖీ చేయండి

- పైలట్ల అసోసియేషన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):బ్రిటన్‌లో ల్యాండింగ్ సమయంలో ఓ ఎయిరిండియా విమానం కీలక వ్యవస్థలో చోటుచేసుకున్న ఊహించని పరిణామం తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. ఈ క్రమంలో భారత పైలట్ల సమాఖ్య కీలక విజ్ఞప్తి చేసింది. బోయింగ్ 787 విమానాల్లో ఎలక్ట్రికల్ వ్యవస్థలను క్షుణ్నంగా తనిఖీ చేయాలని కోరుతూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్‌కు లేఖ రాసింది."ఎయిరిండియా-171 ప్రమాద ఘటన తర్వాత ఇదే విషయంపై పైలట్ల సమాఖ్య తరఫున పలుసార్లు విజ్ఞప్తి చేశాం. డీజీసీఏ మాత్రం ఫ్యుయల్ కంట్రోల్ స్విచ్‌లను మాత్రమే తనిఖీ చేసింది. బీ-787 విమానానికి సంబంధించి అనేక ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటిలో ఉండే ఎలక్ట్రిక్ వ్యవస్థలను క్షుణ్నంగా తనిఖీ చేయాలని పౌరవిమానయాన శాఖ, ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరోని కోరుతున్నాం" అని పైలట్ల ఫెడరేషన్ పేర్కొంది.అమృత్‌సర్ నుంచి బర్మింగ్‌హామ్ వెళ్లిన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 విమానం ల్యాండింగ్ వేళ.. ర్యామ్ ఎయిర్ టర్బైన్ పనిచేయడం ఆందోళనకు కారణమైంది. ఇంజిన్లు, విద్యుత్, హైడ్రాలిక్ వైఫల్యం వంటి ఎమర్జెన్సీల్లో బ్యాకప్‌గా ఉండే ఈ వ్యవస్థ హఠాత్తుగా తెరుచుకోవడం కలకలం రేపింది. అయినప్పటికీ విమానం సురక్షితంగా దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే బోయింగ్ విమానాలపై భారత పైలట్ల సమాఖ్య ఆందోళన వ్యక్తం చేసింది.



# ఆర్టీసీ ఛార్జీల పెంపుదలను విరమించుకోవాలి



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాదు-సికింద్రాబాదు జంట నగరాల్లో ఆర్టీసీ ఛార్జీలు మొదటి మూడు స్టేజీలకు రూ.5 లు, నాలుగవ స్టేజీకి రూ.10ల పెంచిన ఛార్జీలను వెంటనే విరమించుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కొత్త డిపోలు, కొత్త ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటుకు రూ.392 కోట్లు ఖర్చు అవుతుందని, ఈ ఛార్జీలను పెంచుతున్నట్లు, అందుకు ప్రజలు సహకరించాలని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాదులో ఎలక్ట్రికల్ బస్సు చార్జీలను, బస్సు పాస్ చార్జీలను భారీగా పెంచిందని తెలిపారు. పండగల పేరుతో ప్రజల నుండి 50 శాతం ప్రత్యేక చార్జీలు వసూలు చేస్తూనే ఉన్నారని, మౌలిక సదుపా యాలకు ప్రత్యా మ్నాయ మార్గాలను అన్వేషిం చకుండా ప్రజలపై మరోసారి అదనంగా భారాలు వేయడం సమంజసం కాదని తెలిపారు.

**ఆర్టీసీలోనే కార్గో సేవలు కొనసాగాంచాలి**

ఆర్టీసీ కార్గో సర్వీసులను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తున్నట్లు వార్తలొస్తున్నాయని, కార్గో సేవలను ప్రైవేటీకరించాలనే ప్రయత్నాలను విరమించుకొని ఆర్టీసీలోనే కార్గోసేవలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత అందుబాటులోకి తేవాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని రిక్రూట్ చేసుకోవాలని కోరారు.

# స్థానికంపై సందిగ్ధం!

- ఎన్నికలు వాయిదా పడతాయా?
- కోర్టులో రిజర్వేషన్ల బంతి
- కోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే రిజర్వేషన్ల మార్పు
- ఆశావాహుల్లో ఆందోళన
- ఎన్నికలకు సర్వం సిద్ధం చేసిన కమిషన్



నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 5 (జనంసాక్షి) : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడా అని ఎదురు చూస్తున్న ప్రజలకు ప్రభుత్వ విచిత్ర నిర్ణయాలతో స్థానిక సంస్థల ఎన్నికలు సందిగ్ధంలో పడ్డాయి.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో ఇచ్చిన బిసి డిక్లరేషన్ ప్రకారం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తూ బి సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బిల్లు ఆమోదం చేసింది.ఆమేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లకు రిజర్వేషన్లు ఖరారు చేసింది.అయితే ఆ బిల్లును , రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ హై కోర్టు,సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేయడంతో స్థానిక సంస్థల ఎన్నికలు సందిగ్ధంలో పడ్డాయి.అయినప్పటికీ రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసింది.అయితే కోర్టులో చట్ట సవరణ,42 శాతం బిసి రిజర్వేషన్లకు ప్రతికూల తీర్పు వేస్తే రాష్ట్ర ప్రభుత్వం ఇరకాటంలో పడుతుంది.కానీ ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలు చాలా ఆలస్యంగా కావడంతో ప్రతికూల తీర్పు వచ్చినా ఎన్నికలు నిర్వహించాలని ఒక పక్క ప్రభుత్వం భావిస్తున్నది.ప్రతి కూల తీర్పు వేస్తే బిసి లకు ఇచ్చిన మాట తప్పినట్లు అవుతుంది.కానీ ఎన్నికలు ఆలస్యం కావడంతో ఎలాగైనా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే పాత రిజర్వేషన్ల ప్రకారం 23 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది.అలా జరిగినా ఎస్సీ,ఎస్టీ, రిజర్వేషన్లు అలాగే ఉంచి బిసి,జనరల్ స్థానాల రిజర్వేషన్లను మార్చి వారం పది రోజులు ఆలస్యంగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.దాంతో ఎన్నికలు వారం, పది రోజులు ముందుకు వెళ్లే అవకాశం ఉంది.కానీ బిసి ల్లో వ్యతిరేక త రాకుండా అసెంబ్లీ తీర్మానం,ఆర్డినెన్సు గవర్నర్ ,రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉన్నందున వారి నిర్ణయం కోసం వేచి చూడాలని వారు నిర్ణయం ప్రకటించకపోతే నెపాన్ని కేంద్రంపై నెట్టి ఎన్నికలను వాయిదా వేయాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు అభిప్రాయ పడుతున్నారు.

**ఆందోళనలో ఆశావాహులు...**

స్థానిక సంస్థలు అయిన జెడ్పీటీసీ,ఎంపిటిసి,సర్పంచులు గా పోటీ చేయాలని ఆశ పడుతున్న ఆశావాహులు కోర్టు తీర్పు ఎలా ఉంటుందో ప్రభుత్వ నిర్ణయం ఏమి తీసుకుంటుందో తెలియక ఆందోళన చెందుతున్నారు.కోర్టు తీర్పు ప్రతి కూలంగావస్తే ఇప్పుడు ప్రకటించిన రిజర్వేషన్లు అనుకూలంగా ఉన్నవారు రిజర్వేషన్లు మారితే పోటీ చేసే అవకాశం చే జారుతుందని ఆందోళన చెందుతున్నారు.రిజర్వేషన్లు మారితే ఇదివరకు ప్రకటించిన రిజర్వేషన్లు తమకు అనుకూలంగా ఉంటాయన్న ఆశతో అన్నారు.కానీ బిసి రిజర్వేషన్లు తగ్గితే అమకు అవకాశాలు పోతాయేమోనని బిసి లు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఎన్నికలు సందిగ్ధంలో పడ్డాయని చెప్పక తప్పదు.

# తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ ప్రత్యేక చర్యలు

- 1050 స్పెషల్ బస్సుల ఏర్పాటు

హైదరాబాద్ (జనంసాక్షి) : దసరా పండుగ తిరుగు ప్రయాణం నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఆదివారం నాడు సాయంత్రం 4 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ కి 1050 స్పెషల్ బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది. అందులో అత్యధికంగా వరంగల్ రీజియన్ నుంచి 229, కరీంనగర్ నుంచి 211, నల్గొండ నుంచి 137 ప్రత్యేక సర్వీసులని నడిపింది. ఆదివారం రాత్రి 9 గంటల వరకు రద్దీ కొనసాగనుంది. అలాగే, సోమవారం కూడా హైదరాబాద్ కి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండనుంది. రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

# రాజీనామా అవాస్తవం

- సోషల్ మీడియా ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



హైదరాబాద్ (జనంసాక్షి) : తన పదవికి రాజీనామా చేస్తున్నానంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దానం నాగేందర్ తీవ్రంగా స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అదంతా కేవలం దుష్ప్రచారం మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడి పూర్తి స్పష్టతనిచ్చారు. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం లేదని, ఈ పుకార్లను ఎవరూ నమ్మవద్దని దానం నాగేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. "నాపై గిట్టనివాళ్లే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. నేను రాజీనామా చేస్తున్నాననే వార్త పూర్తిగా అవాస్తవం" అని ఆయన తేల్చిచెప్పారు. తనపై రాజకీయంగా కుట్ర జరుగుతోందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పార్టీకి, ప్రజలకు తాను ఎప్పుడూ అంకితభావంతో పనిచేస్తానని, పదవులు వదులుకునే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న దానం నాగేందర్, ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి మంత్రిగా కూడా పనిచేశారు. ఇటీవలే తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, ఖైరతాబాద్ నియోజకవర్గంలో బలమైన నేతగా కొనసాగుతున్నారు. ఇలాంటి తరుణంలో ఆయన రాజీనామాపై వస్తున్న వదంతులు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ కష్టకాలంలో తనకు మద్దతుగా నిలుస్తున్న ప్రజలకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ దుష్ప్రచారం వెనుక ఎవరున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు వెల్లడిస్తానని దానం నాగేందర్ సూచనప్రాయంగా తెలిపారు.

# బతుకమ్మకుంట 'ఆపరేషన్ క్లీనింగ్'

- చెత్త కలెక్షన్ ఆటోలకు ప్రత్యామ్నాయ పార్కింగ్



హైదరాబాద్, అక్టోబర్ 05 (జనంసాక్షి) : దసరా పండగ వేడుకగా చేసుకున్నాం. బతుకమ్మ ఆటలు అయిపోయాయి. బతుకమ్మకుంటలో ఈ ఆదివారం "ఆపరేషన్ క్లీనింగ్" కార్యక్రమాన్ని హైడ్రా చేపట్టింది. హైడ్రా ఇన్స్పెక్టర్ బాలగోపాల్ ఆధ్వర్యంలో డీఆర్ఎఫ్, ఎంఈటీ సిబ్బంది రంగంలోకి దిగి.. బతుకమ్మ ఆటల అనంతరం కుంటలో వదిలిన బతుకమ్మలను బయటకు తీశారు. చెరువులో కుళ్లిపోకుండా పూలను తొలగించారు. అలాగే బతుకమ్మలను రూపొందించడానికి పూలను పేర్చిన ట్రే లను బయటకు తీశారు. బతుకమ్మ కుంటను గత ఆదివారం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిగారు ప్రారంభించిన విషయం విదితమే. ఆదివారం నుంచి మంగళవారం వరకు వరుసగా మూడు రోజులు పెద్దఎత్తునంబతుకమ్మ కుంట చెంత బతుకమ్మ ఆటలు ఆడారు. పెద్ద మొత్తంలో పూలు కుంటలో పడ్డాయి. ఎప్పటికప్పుడు వాటిని బయటకు తీసినా కొన్ని మునిగిపోయాయి. ఆదివారం "ఆపరేషన్ బతుకమ్మ కుంట" క్లీనింగ్ మాదిరి పూల వ్యర్థాలను తొలగించారు. దీంతో కుంట క్లియర్గా కనిపిస్తోంది.

**పెట్రోల్ బంక్ వెనుక ఆటోల పార్కింగ్..**

బతుకమ్మ కుంట ఆక్రమణలకు గురై నిర్మాణవ్యర్థాలతో నిండి.. కబ్జాదారుల చెరలో ఉన్నప్పుడు అక్కడ జీహెచ్ఎంసీకి చెందిన చెత్త కలెక్షన్ ఆటోలను పార్కింగ్ చేసేవారు. కానీ బతుకమ్మ కుంటను హైడ్రా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఆ పరిసరాల రూపురేఖలను హైడ్రా మార్చింది. బతుకమ్మ కుంట యిప్పుడు పిక్నిక్ స్పాట్లా మారింది. ఇంటింటికీ తిరిగి చెత్త కలెక్షన్ చేసిన ఆటోలను గతంలో మాదిరే కుంట ప్రధాన ద్వారం వద్ద ఆపడం ఇబ్బందిగా మారింది. ప్రత్యామ్నాయం చూపాలని వాహనదారులు కోరడంతో ఆ దగ్గరలోనే పెట్రోల్ బంక్ దగ్గర పార్కింగ్ సౌకర్యం హైడ్రా కల్పించింది. దీంతో బతుకమ్మ కుంట ప్రధాన ద్వారం వద్ద ప్రశాంతమైన వాతావరణం నెలకొంది.

# మూడేళ్ల కుమార్తెను చంపిన మహిళ..

- ఆమెతోపాటు ప్రియుడు అరెస్ట్

లక్నో (జనంసాక్షి) : మూడేళ్ల కుమార్తెను ప్రియుడితో కలిసి మహిళ హత్య చేసింది. చిన్నారి మృతదేహాన్ని కాలువలో పడేశారు. వివాదం ఉన్న పొరుగింటి మహిళపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులైన ఆ మహిళ, ఆమె ప్రియుడ్ని అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నరోరా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నివసిస్తున్న సీమా అలియాస్ లాలి భర్త కొన్నేళ్ళ కిందట మరణించాడు. దీంతో ప్రియుడు యతేంద్రతో సహజీవనం చేస్తున్నది. మూడేళ్ల కుమార్తె దివ్యాంశితో పాటు అతడితో కలిసి నివసిస్తున్నది. కాగా, సీమా పనికి వెళ్లినప్పుడు ఆమె కుమార్తె ఇబ్బంది పెడుతున్నదని ప్రియుడు యతేంద్ర ఆరోపించాడు. ఆ చిన్నారి విషయంపై వీరిద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కూతురి అడ్డు తొలగించుకునేందుకు సీమా ప్లాన్ వేసింది. అక్టోబర్ 1న ప్రియుడితో కలిసి దివ్యాంశిని హత్య చేసింది. బాలిక మృతదేహాన్ని నరోరా గంగా కాలువలో పడేశారు. మరోవైపు అదే రోజున తన కుమార్తె అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీమా ఫిర్యాదు చేసింది. వివాదం ఉన్న స్థానిక మహిళ లాల్‌త్రేష్, ఆమె సంబంధీకులపై నెపం నెట్టేందుకు ప్రయత్నించింది. తన కుమార్తెను చంపేందుకు వారు కిడ్నాప్ చేసినట్లు ఆరోపించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే రోజున కాలువలో చిన్నారి దివ్యాంశి మృతదేహాన్ని గుర్తించారు. సీమా తన ప్రియుడు యతేంద్రతో కలిసి కుమార్తెను హత్య చేసినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. సీమాను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నిజం ఒప్పుకున్నదని పోలీస్ అధికారి తెలిపారు. ఆమెతో పాటు ప్రియుడు యతేంద్రను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# సడన్ బ్రేక్ వేయడంతో వరుసగా గుద్దుకున్న ఆరు కార్లు


- ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ప్రయాణికులంతా సురక్షితం



హైదరాబాద్ (జనంసాక్షి) : నగరంలోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పై శనివారం మధ్యాహ్నం ఓ భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఒకదాని వెనుక ఒకటి మొత్తం ఆరు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అయితే, ఈ ప్రమాదం కారణంగా ఓఆర్ఆర్‌పై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళుతున్న మార్గంలో, హిమాయత్ సాగర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళుతున్న ఒక కారు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో, దాని వెనుక వస్తున్న వాహనాలు వేగాన్ని అదుపు చేసుకోలేకపోయాయి. దీంతో ఒకదానికొకటి వేగంగా ఢీకొట్టుకున్నాయి. ఈ విధంగా మొత్తం ఆరు కార్లు ఈ ప్రమాదంలో చిక్కుకున్నాయి. ప్రమాద తీవ్రతకు కార్లలోని ఎయిర్‌బ్యాగ్‌లు వెంటనే తెరుచుకోవడంతో ప్రయాణికు లందరూ ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో ఓఆర్ఆర్‌పై భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు, ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ల సహాయంతో పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరిం చేందుకు చర్యలు చేపట్టారు. అధిక వేగం, ముందు వెళ్తున్న వాహనానికి తగినంత దూరం పాటించకపోవడం వంటివే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# కల్వకుంట్ల కవిత చిన్ననాటి స్నేహితురాలి భర్త ఆకస్మిక మృతి

- రెండు వారాల క్రితం చింతమడకలో ఆనందంగా బతుకమ్మ ఆడిన స్నేహితురాలు
- స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలబడతానని భరోసా



హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత చిన్ననాటి స్నేహితురాలి భర్త అకాల మరణం చెందారు. ఈ ఆకస్మిక ఘటన పట్ల కవిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన స్నేహితురాలికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రెండు వారాల క్రితం చింతమడకలో తన స్నేహితురాలు ఎంతో ఉత్సాహంగా, సంబురంగా బతుకమ్మ ఆడిందని కవిత గుర్తు చేసుకున్నారు. ఇప్పుడామె పుట్టెడు దుఃఖంలో ఉందని విచారం వ్యక్తం చేశారు. విధి బలీయమైనదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాంతం తన తోడుగా ఉండాల్సిన భర్త దూరం కావడంతో స్నేహితురాలు అనుభవిస్తున్న బాధ వర్ణనాతీతమని ఆమె పేర్కొన్నారు. ఈ కష్టం నుంచి తన స్నేహితురాలు, ఆమె కుటుంబ సభ్యులు త్వరగా బయటపడాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని కవిత తెలిపారు. స్నేహితురాలిగా ఈ విషాద సమయంలో ఆమెకు భరోసాగా, అండగా నిలబడటం తన బాధ్యత అని కవిత స్పష్టం చేశారు. మరణించిన స్నేహితురాలి భర్త ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె కోరారు. ఈ మేరకు కవిత సోషల్ మీడియాలో స్పందించారు.

# డిజిటల్ ప్రపంచంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలి

- ప్రైవేట్ ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకోద్దు
- మహిళలకు హైదరాబాద్ కొత్త సీపీ సజ్జనార్ కీలక సూచన



హైదరాబాద్ (జనంసాక్షి) : మహిళలు ఆన్‌లైన్ వేదికలపై వ్యక్తిగత ఫోటోలు, సున్నితమైన సమాచారాన్ని పంచుకునే విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో పొంచి ఉన్న ముప్పు గురించి వివరిస్తూ, మహిళలు మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దని ఆయన కీలక సూచనలు చేశారు. నగరంలో జరుగుతున్న జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జిటో) కనెక్ట్ 2025 కార్యక్రమంలో భాగంగా ఆయన మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవలే నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన, ఈ వేదికగా మహిళల భద్రతకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. ఆదివారం తన 'ఎక్స్' ఖాతాలో ఈ విషయంపై ఆయన పోస్ట్ చేశారు. "చాలామంది మహిళలు తమ ప్రైవేట్ ఫోటోలను, వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్‌లో పంచుకుంటున్నారు. కానీ వాటిని దుండగులు సులభంగా దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది. నకిలీ గుర్తింపులతో పరిచయం చేసుకొని, నమ్మించి మోసం చేసే వారి సంఖ్య పెరిగిపోతోంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోసపోయారని గ్రహించిన తర్వాత కూడా కొందరు వారితో సంభాషణలు కొనసాగిస్తు న్నారని, ఇది మరింత ప్రమాదకరమని సజ్జనార్ స్పష్టం చేశారు. అలాంటి చర్యలు బ్లాక్‌మెయిలింగ్‌కు ఆస్కారం కల్పిస్తాయని తెలిపారు. "ఆన్‌లైన్‌లో ఎవరినైనా గుడ్డిగా నమ్మవద్దు. ఏదైనా సమాచారం పంచుకునే ముందు ఒకటికి రెండుసార్లు ధృవీకరించుకోవాలి. డిజిటల్ ప్రపంచాన్ని అందరికీ సురక్షితంగా మార్చేందుకు మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. ఇదే కార్యక్రమంలో సజ్జనార్ మహిళల శక్తిసామర్థ్యాలను కొనియాడారు. హైదరాబాద్ పోలీస్ విభాగంలో తన బృందంలో దాదాపు 50 శాతం మంది మహిళా ఐపీఎస్ అధికారులే ఉండటం గర్వకారణంగా ఉందని అన్నారు. "వారు ఒకవైపు ఇంటి బాధ్యతలను, మరోవైపు కఠినమైన వృత్తిపరమైన విధులను ఎంతో అంకితభావం, క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. నేటి భారతదేశానికి మహిళలు ప్రతిఘటన, నాయకత్వం, ఆవిష్కరణలకు నిజమైన ప్రతీకలు. వారు మొత్తం ప్రపంచానికే స్ఫూర్తి, బలం" అని ఆయన ప్రశంసించారు.

# హైదరాబాద్‌కు తిరుగుపయనమైన నగర జీవులు

- విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్
- పంతంగి, కొర్లపహాడ్ టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాల బారులు



హైదరాబాద్ (జనంసాక్షి) : దసరా పండగ సంబరాలు, సెలవులు ముగియడంతో, సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు పయనమవ్వడంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి (65) వాహనాలతో కిక్కిరిసిపోయింది. శనివారం రాత్రి నుంచి మొదలైన తిరుగు ప్రయాణాల వెల్లువ ఆదివారం తీవ్ర స్థాయికి చేరడంతో, రహదారిపై కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పండగ ఆనందం ముగిసి, ప్రయాణ కష్టాలు మొదలయ్యాయని పలువురు వాహనదారులు వాపోయారు. రహదారిపై వాహనాలు నత్తనడకన కదలడంతో ప్రయాణ సమయం రెట్టింపు అయ్యింది. ముఖ్యంగా నల్గొండ జిల్లా పరిధిలోని నార్కట్‌పల్లి కామినేని జంక్షన్, చిట్యాల, పంతంగి టోల్‌ప్లాజా, చౌటుప్పల్ వంటి కీలక ప్రాంతాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. కొన్నిచోట్ల రెండు గంటల పాటు ప్రయాణం చేసినా కేవలం 15 కిలోమీటర్ల దూరం కూడా దాటలేకపోయామని ప్రయాణికులు తెలిపారు. కార్లు, బస్సులు, ఇతర వాహనాలు ఒకేసారి భారీ సంఖ్యలో రోడ్డెక్కడంతో ఈ అనూహ్య రద్దీ ఏర్పడింది. ముఖ్యంగా చౌటుప్పల్ పట్టణంలోని తంగడపల్లి, చిన్నకొండూరు చౌరస్తాల వద్ద ఉన్న క్రాసింగ్‌ల కారణంగా ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. వాహనాల రద్దీని అంచనా వేసిన అధికారులు ముందుగానే కొన్ని చర్యలు చేపట్టారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద సాధారణంగా రోజుకు 40 వేల వాహనాలు ప్రయాణిస్తుండగా, శనివారం ఏకంగా 51 వేల వాహనాలు, ఆదివారం 49 వేల వాహనాలు దాటినట్లు టోల్ ప్లాజా అధికారులు వెల్లడించారు. అదేవిధంగా, కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద కూడా శనివారం 34 వేల వాహనాలు ప్రయాణించాయి. ఈ గణాంకాలు రద్దీ తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ వెళ్లే మార్గంలో ఉన్న 16 బూత్‌లకు గాను 12 బూత్‌లను తెరిచి వాహనాలను వేగంగా పంపే ప్రయత్నం చేశారు. రాచకొండ ట్రాఫిక్ పోలీసులు, టోల్ సిబ్బందితో కలిసి రద్దీని నియంత్రించేందుకు తీవ్రంగా శ్రమించారు. భువనగిరి ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, చౌటుప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌మోహన్ పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాలను క్రమబద్ధీకరించారు. అయినప్పటికీ, వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో ట్రాఫిక్ జామ్ అనివార్యమైంది. పండగల సమయంలో ఇలాంటి రద్దీ సహజమేనని, ప్రయాణికులు ముందుగా ప్రణాళిక వేసుకుని బయలుదేరాలని అధికారులు సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా రహదారి విస్తరణ వంటి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## భారత దేశంలో పేదరికం ఎందుకుంది? ఎలా పోతుంది?

భారత దేశంలో పేదరికం ఎందుకుంది?
అనే ప్రశ్నకు రాజకీయ పార్టీలు, సిద్ధాంత వేత్తలు, సామాజిక శాస్త్ర వేత్తలు రకరకాలుగా చెప్తారు. సైన్సు టెక్నాలజీ, సరకుల ఉత్పత్తి చాలా ముందుకు సాగి ముప్పయి ఏళ్లయింది. ఆనాటికే మానవులు ఒక గంట పని చేస్తే ప్రతి ఒకరు తహసిల్ దార్ స్థాయిలో జీవించ వచ్చు అని తేలింది. ఆ తరువాత ఇంకా అభివృద్ధి చెందింది. అయినా పేదరికం ఎందుకుంది?

1. సైన్సు అభివృద్ధి ఫలాలు అందరికి అందడం లేదు.
2. పాత కుల వృత్తుల్లో , గిట్టుబాటుకాని చిన్న వృత్తుల్లో కొనసాగాల్సి రావడం.
3. అసంఘటిత సేవా రంగాల్లో ఉత్పత్తిలో వుండి పోవడం
4. వ్యవసాయంలో కూలీలకు సరైన కూలీ లేక పోవడం
5. గ్రామీణ సమాజంలో ఏడాది పొడువునా పని లేక పోవడం. వందరోజుల కే పని ఉండఢం.
6. ఆధునిక పరికరాలు, ఉత్పత్తులు, వల్ల వెయ్యి మందిలో 450 మంది ఉపాధి లేక నిరుద్యోగులుగా మిగిలి పోవడం.
7. ఇలా 45 శాతం జనాభా సొంత వూరు వదిలి పట్టణాలకు, నగరాలకు, గల్ఫ్ కు వలస పోవడం. దాని వల్ల ఖర్చులు పెరగడం. స్వదేశంలో కాందిశీకులుగా, నిర్వాసితులుగా . మురికి వాడలు మారడం.
8. భూగర్భ గనులు, సాగునీటి ప్రాజెక్టులు , ప్రభుత్వ భూసేకరణ వల్ల 30 శాతం మంది సర్వం కోల్పోవడం..
9. అడవులపై ఆధార పడి బతికే వారి నుండి ప్రభుత్వం అడవులను హక్కు భుక్తం చేసికోవడం.
10. విద్యావంతులకు సరైన ఉద్యోగం, ఉపాధి లేక పోవడం.
11. గ్రామాల్లోని ఉత్పత్తి కులాలు ఉపాధి లేకపట్టణాల్లో సేవా వృత్తులు చేయడం.
12. ధరల పెరుగుదల బ్లాక్ మార్కెట్, అవినీతి, లంచాలు
13. మద్యం, ప్రయివేటు విద్య, ప్రయివేటు వైద్యం, ప్రయివేట్ రియల్ ఎస్టేట్ భవన నిర్మాణ రంగం వల్ల ధరలు పెరిగి అంతులేని దోపిడితో పేదలుగా మారడం
14. పేదలకు పెట్టుబడి పరపతి సౌకర్యాలు లేకపోవడం.
15. ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం విధానం వల్ల ఎదగలేక పోవడం.

ప్రాజెక్టులు, గనులు, భూసేకరణ, అడవుల ఆక్రమణ వల్ల దేశంలో ముప్పయి శాతం జనాభా పేదరికం లోకి నెట్టి వేయబడ్డారు.

పెళ్లిల్లకు, పండుగలకు, పుట్టిన రోజులకు ఖర్చులు చేయడం. అనుత్పాదక రంగాల్లో తమ పొదుపును ఖర్చు చేయడం.

పండిన పంటలకు గిట్టు బాటు ధర ఉండదు. మార్కెట్ శక్తులు విపరీతంగా ధరలు పెంచి అమ్ముకొని లాభాలు గడించడం.

మనిషికి కావలసిన కనీస కనీస అవసరాలు
ఒక ఇల్లు. కరెంటు , మంచినీరు, రోడ్, టాయిలెట్లు, ఏడాది ఏడాది పొడువున పని. పిల్లల చదువులు, వృద్దుల రక్షణ. రవాణాకు కనీసం ఒక సైకిలు. కనీస కూలీలకోసం, గిట్టుబాటు ధరల కోసం ఉద్యమాలు నడిచాయి. వెట్టి చాకిరి కొంత తగ్గింది పాత కుల వృత్తులకు గౌరవం లేదు. గుట్టుబాటు లేదు. అసలా కుండలు, అవసరమే లేదు. ఇట్లా కాలం తీరిపోయిన వృత్తులు.




**పేదరికం ఎలా పోతుంది?**

వీటి పరిష్కారానికి రకరకాల సిద్ధాంతాలు ప్రతి పాదనలు. మొదట్లో అధిక జనాభా అన్నారు. ఇపుడందరు ఒకరిద్దరి కన్న ఎక్కువ కనడం లేదు. రోజు రోజుకు పన్నులు, ప్రభుత్వ ఆదాయం పెరుగుతున్నది. పన్నులు పెరుగుతున్నాయి. ఉద్యోగాలు తగ్గుతున్నాయి. ప్రభుత్వ సేవలు తగ్గుతున్నాయి. ప్రభుత్వ ఆదాయమంతా ఏమై పోతున్నది.


అంచనాలు పెంచి కాంట్రాక్టర్ల పేరిట అధికారులు, నాయకులు పంచుకోవడం. ఆయుధాలకు,సైనికులకు, పోలీసులకు, దుబారా కు ఖర్చు చేయడం వల్ల ఎక్కడి ఆదాయం చాలడం లేదు. వాటిని సరిచేసి సరైన మార్గంలోకి మళ్లిస్తే
ఎన్నో చేయవచ్చు. ఒక రూపాయి పన్ను పెంచకుండా 5 ఏళ్లు దాటిన బాల బాలికలందరికి 16 సంవత్సరాల పాటు ఉచిత రెసిడెన్షియల్ ఉన్నత విద్య అందించవచ్చు. తద్వారా తల్లి దండ్రులపై భారం తగ్గుతుంది. ఒక్క రూపాయి పన్ను పెంచకుండా అందరికీ ఉచిత వైద్యం అందించ వచ్చు. మద్యం నిషేధిస్తే ప్రజల ఆదాయం ముప్పయి శాతం మిగులుతుంది. ప్రస్తుతం 96 వేల కోట్ల రూపాయలు ప్రజలు మద్యం కోసం ఖర్చు చేస్తున్నారు. ఇది రాష్ట్ర ఆదాయంలో మూడోవంతు.

మద్యం నిషేధిస్తే ప్రజల కొనుగోలు శక్తి పెరిగి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది.
ప్రయివేట్ రియల్ ఎస్టేట్ , భవన నిర్మాణం నిషేధిస్తే ప్రజలతు చవకగా ఇళ్లు అపార్టు మెంట్లు లభ్యమవుతాయి.

గోదాములలోని ధాన్యంపై లోన్లు ఇవ్వడం నిషేధిస్తే ధరలు నిలకడగా ఉంటాయి. ధరలు పెరగడానికి గోదాముల్లో దాచిన ధాన్యానికి బ్యాంకులు లోన్లు ఇవ్వడమే కారణం.

భూమి ని ఆస్తి హక్కు నుండి తొలగించి ఉపాధి కల్పన లో భాగం చేసి వారికి సరిపడ జీవన ప్రమాణాలకు చేయూత నిస్తే , చైనా వలె అధిక ఉతత్పత్తి సాధిస్తే ఇక వారు ఇతర ఉద్యోగాలు చేయడాన్ని నిషేధిస్తే సంపద కేంద్రీకరణ తగ్గి భూమి లేని వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.
ప్రాజెక్టులతో, గనులతో నివాసం, ఉపాధి కోల్పోయి నిర్వాసితులైన వారికి, లాభాల్లో వాటా పంచి ఇవ్వడం ప్రాజెక్టు కింద సాగయ్యే భూములు సేకరించి ఇవ్వడం అవసరం. ఇలా పేదరికం తొలగి పోవడానికి ఆలోచి ంచడం అవసరం. అధిక జనాభాతో అధిక సంపద, అధిక నైపుణ్యాలు అధిక ఉత్పత్తి సాధిస్తున్న చైనా నుండి ఎంతో నేర్చుకోవాలి.

## ఆదర్శ ఐఎఎస్ ఎస్ఆర్. శంకరన్



అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసి వారిలో సుస్థిరమైన స్థానాన్ని పదిలపరచుకున్న ఐ.ఎ.ఎస్ అధికారి ఎస్.ఆర్. శంకరన్. అవినీతి, అన్యాయాలకు మరియు పేదరికానికి వ్యతిరేకంగా ఆయన అవిశ్రాంతంగా కృషిచేశారు. పేదలకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు. అంతిమంగా ఆయన 'ఆదర్శవంతమైన ఐ.ఎ.ఎస్ అధికారి'గా విస్తృతంగా ప్రసిద్ధి చెందారు.

ఎస్.ఆర్. శంకరన్ 1934 లో అక్టోబర్ 22 నాడు తమిళనాడులోని తంజావూరులో జన్మించారు. మధురైలోని అమెరికన్ కళాశాల నుండి వాణిజ్యశాస్త్రంలో ఆయన పట్టభద్రులు కావడమే కాకుండా ఆ తరువాత అదే కళాశాలలో లెక్చరర్గా పనిచేశారు. 1956 లో ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ (ఐ.ఎ.ఎస్) లో చేరి సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారు. 'బాండెడ్ లేబర్ రద్దు చట్టం' మరియు 'భూ పంపిణీ చట్టం' వంటి విధానాలను 1970 ప్రారంభంలో వెలుగులోకి తీసుకు రావడంలో ఎస్.ఆర్.శంకరన్ విశేష కృషి చేశారు. 1976 లో బాండెడ్ లేబర్ చట్టం అంశాన్ని ఆయన తీవ్రంగా పరిగణించి ఆ బాండెడ్ లేబర్ను రద్దు చేయడానికి కృషి చేశారు. ఆయన రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామాలలో పర్యటించి అనేక మందిని బానిసత్వం నుండి విముక్తి పొందేలా చేశారు. బొగ్గు పరిశ్రమ జాతీయీకరణకు కూడా ఆయన తీవ్ర కృషి చేశారు.

ఎస్.సి, ఎస్.టి ప్రజానీకం కోసం సమగ్ర అభివృద్ధి పథకాలు మరియు ఏజెన్సీలతో పాటు ప్రత్యేక కాంపోనెంట్ ప్లాన్కు ఎస్.ఆర్. శంకరన్ మార్గదర్శ కత్వం వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా బాధితులకు ముఖ్యంగా దళితులకు అత్యవసరమైన బాండెడ్ లేబర్ అంశాన్ని పునః సమీక్షించడంలో కృషి చేశారు. అలాగే దళితులపై జరుగుతున్న దారుణమైన ఆకృత్యాల నిలుపుదలకు కృషి చేశారు. 1987లో తూర్పు గోదావరి జిల్లాలోని గుర్తేడు వద్ద అప్పటి పీపుల్స్ వార్ గ్రూప్ (ప్రస్తుతం మావోయిస్టు పార్టీ) కిడ్నాప్ చేసిన ఏడుగురు ఐ.ఎ.ఎస్ అధికారులలో ఎస్.ఆర్. శంకరన్ కూడా ఒకరుగా ఉన్నారు.


వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఎస్.ఆర్. శంకరన్ అనేక జిల్లాలలో పర్యటించారు. ఆయన ఆయా జిల్లాల్లో పర్యటించినప్పుడల్లా దళిత బస్తీలలో, ఆదివాసీ గ్రామాలలో బస చేశారు. 'ప్రజల్లో అవగాహన కల్పించడం తన కర్తవ్యం' అనే విధంగా ఆయన ముందుకు సాగారు. ఆయన సమర్థవంత మైన పరిపాలనలో సమగ్ర అభివృద్ధి పథకాలు మరియు ఏజెన్సీలు ఉనికిలోకి వచ్చాయి. 2004 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు నక్సల్స్ మధ్య చర్చలకు ఆయన మధ్యవర్తిత్వం వహించారు. చర్చలు విఫలం కావడంతో ఆయన కలత చెందారు. రాజ్యహింసను మరియు నక్సల్స్ హింసను కూడా ఆయన నిర్ద్వందంగా ఖండించారు.

ఎస్.ఆర్. శంకరన్ నిరంతరం అనేక సంఘర్షణలను ఎదుర్కొన్ననూ ఆయన ఏనాడు వెనకడుగు వేయలేదు. త్రిపుర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవిని స్వీకరించడానికి అగర్తల విమానాశ్రయం నుండి రిక్షాపై తన సామానులను స్వయంగా తీసుకుని రాష్ట్ర సచివాలయానికి ప్రయాణించడం ఆయన అతి సాధారణ జీవితానికి నిదర్శనంగా నిలుస్తుంది అని చెప్పవచ్చు. ఆ రకంగా ఆయన తన జీవితమంతా అతి సామాన్యమైన నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. ఉన్నత పదవుల పట్ల మరియు సంపద పట్ల ఆయన పెద్దగా ఆసక్తి చూపలేదు. 2005 లో తనకి ప్రకటించబడిన పద్మభూషణ్ అవార్డుని ఆయన సున్నితంగా తిరస్కరించారు. ఆయన తక్కువగా మాట్లాడేవారు మరియు ఎక్కువ పని చేసేవారు.

ఎస్.ఆర్. శంకరన్ ఎల్లప్పుడూ వివక్ష, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాడు. పేదలు, అణగారిన ప్రజల కోసం పనిచేశారు. వారి కష్టాలను తగ్గించడానికి కృషి చేశారు. మాన్యువల్ స్కావెంజింగ్ అనే అమానవీయ ఆచారాన్ని అంతం చేయడానికి ఆయన చేసిన ప్రయత్నాల ఫలితంగా వారి సంఖ్య 13 లక్షల నుండి 3 లక్షలకు గణనీయంగా తగ్గడం గమనార్హం. ఎస్.ఆర్. శంకరన్ తన జీతంలో ఎక్కువ భాగాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే సంస్థలకు అందజేశారు.

చివరికి ఎస్.ఆర్. శంకరన్ తన పెన్షన్ను కూడా ఎస్సీ, ఎస్టీ, పేద విద్యార్థులకు విరాళంగా అందజేశారు. ఆయన రాజీపడని మనస్తత్వాన్ని కలిగి ఉండి పేదల అభివృద్ధి ధ్యేయంగా కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా, కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీగా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా మరియు త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలైన అనేక పదవులను నిజాయితీకి నిలువుటద్దంలా నిర్వహించి పేద ప్రజా హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఎస్.ఆర్.శంకరన్ 2010 అక్టోబర్ 7న మరణించారు. ఆయన మరణించిననూ నేడు పేద ప్రజా హృదయాలలో ఎన్నటికి చెరగని ఆదర్శ ఐ.ఎ.ఎస్. అధికారిగా వేగుచుక్కగా వెలుగొందుతూనే ఉన్నారు.

**( అక్టోబర్ 7 ఎస్.ఆర్. శంకరన్ 15 వ వర్ధంతి )**



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## గాంధీయ స్త్రీవాద నైతికత



మహాత్మా గాంధీ భారత స్వాతంత్ర్య సమరంలోనే కాకుండా, సామాజిక మార్పులు, నైతిక విలువలు వంటి అంశాల్లో కూడా గొప్ప ప్రభావం చూపారు. ఆయన సిద్ధాంతాలు అహింస, సత్యాగ్రహం, స్వావలంబన వంటివి స్త్రీల సాధికారతతో ముడిపడి ఉన్నాయి. "గాంధీయ స్త్రీవాద నైతికత" అనేది గాంధీజీ యొక్క నైతిక దృక్పథాన్ని స్త్రీవాద దృష్టికోణంతో కలిపి పరిశీలించే అంశం. ఇది స్త్రీలను సమాజంలో సమానంగా చూడటం, వారి స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించడం వంటి ఆలోచనలను కలిగి ఉంటుంది. ఈ వ్యాసంలో గాంధీజీ యొక్క ఆలోచనలు స్త్రీవాదానికి ఎలా సంబంధించినవి, వాటి బలాలు, బలహీనతలు మరియు సమకాలీన ప్రాముఖ్యత.

**గాంధీజీ దృష్టి కోణం లో స్త్రీ:**
గాంధీజీ స్త్రీలను సమాజంలో బలమైన శక్తిగా చూశారు. ఆయన భావనలో స్త్రీలు అహింసా మార్గంలో సమాజాన్ని మార్చగలరు. ఉదాహరణకు, స్వదేశీ ఉద్యమంలో స్త్రీలు చరఖా నడపడం ద్వారా స్వావలంబనను ప్రదర్శించారు. గాంధీజీ స్త్రీలను "మాతృస్వరూపాలు"గా చూడటం వల్ల వారిని ఆధ్యాత్మికంగా ఉన్నతంగా పరిగణించారు, కానీ ఇది కొన్ని సమయాల్లో సాంప్రదాయిక పాత్రలకు మాత్రమే పరిమితం చేసింది. ఆయన స్త్రీవాదాన్ని స్వాతంత్ర్య సమరంతో ముడిపెట్టి, స్త్రీలను రాజకీయంగా క్రియా శీలకంగా పోరాడేలా చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో స్త్రీల పాత్ర గాంధీయ స్త్రీవాద నైతికతకు మూలాధారం.స్త్రీవాద నైతికత అంటే స్త్రీల అనుభవాలు, సమానత్వం, న్యాయం వంటివి ఆధారంగా నైతిక నిర్ణయాలు తీసుకోవడం. గాంధీజీ యొక్క యూనివర్సల్ ఎథిక్ (సార్వత్రిక నైతికత) ఇందులో సమానత్వం, అహింస వంటి అంశాలను జోడిస్తుంది, కానీ స్త్రీవాద విమర్శకులు ఇందులో వ్యత్యాసాలు చూస్తారు.

**అహింస- స్త్రీల సాధికారత:**
గాంధీజీ అహింసను స్త్రీల సహజ గుణంగా చూశారు. సత్యాగ్రహం ద్వారా స్త్రీలు హింసాత్మక వ్యవస్థలను మార్చగలరని ఆయన నమ్మారు. ఉదాహరణకు, సెల్ఫ్-ఎంప్లాయ్డ్ విమెన్స్ అసోసియేషన్ (సేవా) వంటి సంస్థలు గాంధీయ అహింస, స్వావలంబనను స్త్రీల సాధికారతకు ఉపయోగిస్తున్నాయి. ఇది స్త్రీవాద నైతికతలో "కేర్ ఎథిక్స్" (సంరక్షణ నైతికత)తో సమానంగా ఉంటుంది. ఎందుకంటే అహింస సంబంధాలను బలపరుస్తుంది.

**సత్యాగ్రహం- ఫెమినిస్ట్ రెసిస్టెన్స్:**
సత్యాగ్రహం అనేది నాన్-వాయలెంట్ ప్రతిఘటన, ఇది స్త్రీవాదంలో జెండర్ అసమానతలకు వ్యతిరేకంగా ఉపయోగపడుతుంది. గాంధీజీ స్త్రీలను ఈ మార్గంలో పాల్గొనమని ప్రోత్సహించారు, కానీ ఇది కొన్ని సమయాల్లో స్త్రీలను పాసివ్ రోల్స్కు పరిమితం చేసింది.స్త్రీవాద విశ్లేషణలో ఇది బలమైనది, ఎందుకంటే ఇది స్త్రీలను ఏజెంట్స్గా చూపుతుంది. గాంధీజీ స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని చెప్పారు. ఇది స్త్రీవాదంలో ఎంపవర్మెంట్తో ముడిపడి ఉంది, ఎందుకంటే స్వావలంబన స్త్రీలను పురుషాధిక్యత నుండి విముక్తి చేస్తుంది.కానీ, గాంధీజీ యొక్క భావనలు మతపరమైన, హేతుబద్ధమైన అంశాల మిశ్రమం. ఇది స్త్రీలను సాంప్రదాయిక పాత్రల్లోనే ఉంచుతుంది.

**బలాలు-బలహీనతలు:**
గాంధీయ స్త్రీవాద నైతికత యొక్క బలం ఏమిటంటే, ఇది యూనివర్సల్ ఎథిక్ను స్త్రీల అనుభవాలతో కలుపుతుంది. గాంధీజీ స్త్రీలను సమానంగా చూడటం వల్ల స్త్రీవాద థియరీకి కొత్త డైమెన్షన్ ఇచ్చారు. ఉదాహరణకు, ఆయన ఫెమినిస్ట్ ఎథిక్ థియరీకి గాంధీయ దోహదాన్ని చూడవచ్చు, ఇక్కడ స్త్రీల విశ్వాసం, సంరక్షణ వంటివి ముఖ్యం.కానీ, బలహీనతలు కూడా కొన్ని ఉన్నాయి. కొందరు విమర్శకులు గాంధీజీని "ఫ్లాడ్ ఫెమినిస్ట్"గా చూస్తారు, ఎందుకంటే ఆయన చర్యలు స్త్రీలను పాట్రియార్కీ (పురుషాధిక్యత) సమాజంలోనే ఉంచాయి. ఉదాహరణకు, స్త్రీలను కేవలం మాతృత్వంతో ముడిపెట్టడం వల్ల వారి వ్యక్తిగత స్వాతంత్ర్యం పరిమితమైంది.అలాగే, గాంధీయ యూనివర్సల్ ఎథిక్ స్త్రీల వైవిధ్యాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదు. ఇది స్త్రీవాద విమర్శకులతో విభేదాలకు దారితీసింది. సమకాలీన స్త్రీవాదంలో ఇది ఇంటర్సెక్షనల్ ఫెమినిజం (కులం, వర్గం వంటి అంశాలు)తో సరిపోలక పోవడం ఒక లోపం.

**సమకాలీన ప్రాముఖ్యత:**
గాంధీయ స్త్రీవాద నైతికత ఈనాటి సమాజంలో ఇంకా సంబంధ కలిగి ఉంది. ఇది అహింసాత్మక మార్పులకు మార్గం చూపుతుంది, ముఖ్యంగా జెండర్ హింసకు వ్యతిరేకంగా. కానీ దీనిని సమకాలీన స్త్రీవాద దృష్టికోణంతో అనుసరించాలి, అప్పుడే ఇది మరింత శక్తివంతమవుతుంది. గాంధీజీ యొక్క ఆలోచనలు స్త్రీల సాధికారతకు ఆధారం, కానీ వాటిని విమర్శాత్మకంగా పరిశీలించడం అవసరం. ఇలాంటి నైతికతలు సమాజాన్ని మరింత సమానంగా మారుస్తాయి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.


## శాంతి మార్గం

కత్తి కంటే కలమే బలమైనది
పదునైన మాట కంటే మౌనముదే
విజయం
కోపం అగ్నిలా వ్యాపించినా
ప్రేమ జలధి దానిని ఆర్పుతుంది
రక్తపు చరిత్రల కన్నా
కరుణా గాధలే చిరస్థాయమైనవి
పిడికిలి బిగించిన చెయ్యి కరిగిపోతుంది
స్పర్శతో చిగురించే చేయి
నిలిచిపోతుంది
హృదయంలో పెరిగే ద్వేషపు మొలక
అంతులేని యుద్ధాల విత్తనం
మనసులో పూసే క్షమా పుష్పం
సర్వజీవాల ఆనంద వనం
ద్వేషంతో నిండిన చూపు
చీకటి తుఫానుల గర్భం
కానీ దయతో వెలిసిన చూపు
సూర్యకాంతి వానధారం
కత్తిచాటులోనూ దొరుకుతుంది మరణం
మమతలోనే పెరుగుతుంది జీవితం
మానవుని మహోన్నత బలం
ఉన్నది అరచేతిలో కాదు ఆత్మలో

డా. ఐ. చిదానందం
తెలుగు ఉపన్యాసకులు
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ
నాగర్ కర్నూల్ జిల్లా
చరవాణి - 8801444335

**అక్టోబర్ 6... ఐపిసి అమలులోకి వచ్చిన దినం**

## భారతీయ శిక్షాస్మృతి సృష్టికర్త మెకాలే



**165 ఏళ్లుగా చెక్కుచెదరని మూల రూపం**

భారతీయ శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ ఐపిసి) భారత ప్రభుత్వ ధర్మ శాస్త్రం. భారత దేశంలో నేరాలు చేసిన వారికి దీనిని అనుసరించి చే శిక్ష వేస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ (భారతీయ శిక్షాస్మృతి) 1860 - 1860 అక్టోబరు 6 నాడు (1860 లో చేసిన 45 వ చట్టం) మొద లైంది. ఇండియన్ పీనల్ కోడ్ జమ్ము కాశ్మీర్లో కూడా అమలు లో ఉంది. కానీ, ఈ రాష్ట్రంలో ఇండియన్ పీనల్ కోడ్ అనరు. రణబీర్ పీనల్ కోడ్ (ఆర్.పి.సి) అని పిలుస్తారు. ఇండియన్ పీనల్ కోడ్ మూలాలు 1860 నాటి ఆంగ్లేయుల వలస పాలనలో (బ్రిటిష్ ఇండియా) ఉన్నాయి. 1860 నాటి బ్రిటిష్ ఇండియా చేసిన చట్టం ద్వారా ఇండియన్ పీనల్ కోడ్ అమలు లోకి వచ్చింది. మొట్టమొదటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తుప్రతి 1860 లో, మొదటి లా కమిషన్ అజమాయిషిలో జరిగింది. మొదటి లా కమిషన్ ఛైర్మన్ లార్డ్ మెకాలే (థామస్ బాబింగ్టన్ మెకాలే, ఫస్ట్ బేరన్ మెకాలే పి.సి. (జ 1800 అక్టోబరు 25 మరణం 1859 డిసెంబరు 28) ). (ఈయనే భారత దేశంలో ఆంగ్ల విద్యా బోధనకు పునాది వేసిన వాడు). మొదటి ఇండియన్ పీనల్ కోడ్ 1862 సంవత్స రంలో, అమలు లోకి వచ్చింది. నాటి నుంచి ప్రపంచం లోను, భారతీయ సమాజాల లోను, విద్యాపరంగా, వైజ్ఞానికంగా, సముద్రాలలో, సముద్ర గర్భాలలో, రోదసీ లోను, ప్రయాణ వాహనాల లోను, న్యాయపరంగా, వైద్యరంగం లోను, ఉద్యోగ రంగం లోను, బాంక్ లావాదేవీలు (ఏ.టి.ఎమ్), సెల్ ఫోన్లు, సైబర్ నేరాలు, కంప్యూటర్ రంగాలలో జరిగిన సమస్తమైన మార్పు లను, మన భారతీయ శిక్షా స్మృతి అనేకమైన మార్పులు, చేర్పులకు గురి అవుతూ, నేటి రూపాన్ని పొందింది. గృహ హింస సెక్షన్ 498-ఎ ఒక ఉదాహరణ. మన భారతీయ శిక్షాస్మృతిలో 511 సెక్షన్లు ఉన్నాయి. వరకట్నం ఛట్టాలు మరో ఉదాహరణ. వరకట్న సమస్య, ఐరోపా, అమెరికా దేశాలలో లేదు కాబట్టి, వరకట్న చట్టాలు, శిక్షలు వారి శిక్షా స్మృతిలో లేవు. లార్డ్ మెకాలే, నాటి ఫ్రెంచి పీనల్ కోడ్, లివింగ్స్టోన్స్ కోడ్ ఆఫ్ లూసియానా అనే రెండు ప్రామాణిక గ్రంథాలను ఆదర్శంగా తీసుకుని, మన ఇండియన్ పీనల్ కోడ్ 'చిత్తు ప్రతి' ని తయారు చేసాడు. భారతీయుల ప్రామాణిక గ్రంథాలైన మను స్మృతిని, యాజ్ఞవల్క్య స్మృతిని, నాటి వైదిక పండితుల సలహా, సహాయం కూడా తీసు కున్నాడు. శిక్షల విషయంలో, ఆ నాటి పెద్దలు, పండితులు, రాజులు అభిప్రాయాలను కూడా లెక్కలోకి తీసుకున్నాడు. లార్డ్ మెకాలే మహా మేధావి అయినా, తన అభిప్రాయాల కంటే, నాటి భారత దేశ మత, సాంఘిక, సామాజిక వ్యవస్థలకు, ఆఛార వ్యవహా రాలకు విలువ ఇచ్చి, వారి అభిప్రాయాలను గౌరవించి, తన మేధస్సుతో 'ఇండియన్ పీనల్ కోడ్' చిత్తుప్రతి తయారు చేశాడు. 1860 నాటి ఇండియన్ పీనల్ కోడ్ చిత్తు ప్రతి, మూల రూపం, నేటికీ చెక్కు చెదరలేదు. దీనిమీద కొన్ని విమర్శలు ఉన్నప్పటికీ, ఈ నాటికీ, న్యాయ శాస్త్రంలో, దీనికి తిరుగు లేదు. పాకిస్తాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత, ఇండియన్ పీనల్ కోడ్ని యధా తధంగా పాకిస్తాన్ తన దేశంలో అమలు చేసింది. దాని పేరు పాకిస్తాన్ పీనల్ కోడ్ (పి.పి.సి). బంగ్లాదేశ్ కూడా బంగ్లాదేస్ పీనల్ కోడ్ పేరుతో అమలు చేసింది. బ్రిటిష్ వలస దేశాలైన, మియన్మార్ (నాటి బర్మా), శ్రీలంక (నాటి సిలోన్, మలే సియా, సింగపూర్, బ్రూనీ దేశాలు కూడా ఇండియన్ పీనల్ కోడ్ ను యధాతధంగా (మక్కికి, మక్కి) అమలు చేస్తున్నాయి. లార్డ్ మెకాలే తయారు చేసిన 'చిత్తుప్రతి' ని, నాటి ఛీఫ్ జస్టిస్ సర్ బార్నెస్ పీకాక్, కలకతా సుప్రీమ్ కోర్టు న్యాయాధిపతి (ఇతను నాటి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు కూడా) సునిశితంగా, సుదీర్ఘం గా, పరిశీలించి, పరీక్షించాడు. వారి పరిశీలన తర్వాత ఇండియన్ పీనల్ కోడ్ 1860 అక్టోబరు 6 నాడు చట్టసభ ఆమోదం పొందింది. దురదృష్ట వశాత్తు, ఇండియన్ పీనల్ కోడ్ సృష్టికర్త లార్డ్ మెకాలే తన కృషి, చట్టమై, అమలు జరగటం చూడలేదు. కారణం మెకాలే 1859 డిసెంబరు 28 న, తన 59వ ఏట, మరణించాడు. ఆయన అవివా హితుడు. ఇండియన్ పీనల్ కోడ్ 1837 లోనే నాటి గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా ఇన్ - కౌన్సిల్ కి నివేదించినా, 1860 సంవత్సరం వరకూ అది వెలుగు చూడలేదు. 1830కి ముందు, భారత దేశంలో, 'ది ఇంగ్లీష్ క్రిమినల్ లా', అనేక చట్ట సవరణలతో, నాటి ప్రెసిడెన్సీ టౌన్ లలో (బొంబాయి, కలకత్తా, మద్రాసు అమలు జరిగేది.

ఈ ఇండియన్ పీనల్ కోడ్ ప్రపంచమే కుగ్రామంగా మారినా, జీవితం వేగవంత మైనా, సమాజాలు మారు తున్నా, ప్రపంచమే మారి పోతున్నా కూడా, 162 సంవత్సరాల నుంచి చెక్కు చెదరకుండా, ఉన్నది అంటే, మెకాలే దూరదృష్టి. ఆయన మేధస్సు అనితర సాధ్యం. మరో పది దేశాలకు కూడా తన గ్రంథం ఆయా దేశాలకు వేదం, బైబిల్, ఖురాను అయ్యింది.

ఇండియన్ పీనల్ కోడ్ ( భారతీయ శిక్షాస్మృతి ), 1860, నేరాల పరంపరను సేకరించి , వాటికి పడే శిక్షలకు అనుగుణంగా నేరాల విభజన ( వర్గీకరణ )ను చేసింది. నేర పరిశోధనను, ప్రాసిక్యూషన్ ను విభజించ మని ( బ్రిటన్ లోని సి.పి.ఎస్.న్ వలె) దానివలన నేరాలు , శిక్షలు తొందరగా పరిష్కారం అవుతాయని పేర్కొంది. న్యాయ శాస్త్రం లోని పదాల అర్థాల వివరణ, శిక్షలు గురించిన వివరణ,
సాధారణమైన మినహా యింపులు, స్వీయ రక్షణ హక్కు నుంచి, అబెట్మెంట్ , (నేరానికి సహకరించుట), నేరపూరితమైన కుట్ర , చట్టము అతిక్రమించు కుట్ర, దేశానికి వ్యతిరేకంగా (దేశ ద్రోహం) చేసే నేరాలు, పదాతి దళం (ఆర్మీ), నౌకాదళం (నేవీ), వాయుసేనా దళం (ఎర్ ఫోర్స్), ఈ మూడు దళాలకి సంబదించిన నేరాలు. (1917లో నేవీ (నౌకాదళం), ఎర్ ఫోర్స్ (వాయుసేనా దళం), సైన్య వ్యతిరేక నేరములు, ప్రజల శాంతి , భద్రతలకు భంగం కలిగించే, ప్రజా సేవకులైన ప్రభుత్వ
ఉద్యోగులకు సంబంధించిన నేరాలు, ప్రభుత్వ ఉద్యోగులు చేసే నేరాలు, ఎన్నికలు వాటికి సంబంధించిన నేరములు,
కోర్టు ధిక్కరణ నేరాలు (కంటెంప్ట్ ఆఫ్ లాఫుల్ అథారిటీ ఆఫ్ పబ్లిక్ సర్వెంట్స్), తప్పుడు సాక్ష్యాలు, పబ్లిక్ జస్టిస్ కి వ్యతిరేకంగా చేసే నేరాలు, నాణెములు (ప్రభుత్వ ధనము), ప్రభుత్వము ముద్రించే స్తంపులు తూనికలు మరియు కొలతలు – సంబంధించిన నేరాలు,
ప్రజల ఆరోగ్యము, భద్రత, సౌకర్యము, మర్యాద, నీతి కి సంబంధించిన నేరాలు, మతానికి సంబంధమైన నేరాలు, మానవ శరీరానికి హాని కలిగించే నేరాలు.
1.ప్రాణ హాని ( హత్య తో కలిసి), కల్పబుల్, హోమిసైడ్,
2.గర్భస్రావం కలిగించటం, పుట్టబోయే (ఇంకా పుట్టని) బిడ్డలకు హాని చేయటం ( గాయ పరచటం), ఎక్స్పోజర్ ఆఫ్ ఇన్ఫెంట్స్, కన్సీల్మెంట్ ఆఫ్ బర్త్ (పిల్లల పుట్టుకను వెల్లడించ కుండా దాచటం), 3.గాయపరచటం, 4.అనధి కారకంగా అడ్డుకోవటం, బందించటం (నిర్బంధించటం)
5. నేరపూరితంగా దాడి చేయటం, గాయ పరచటం, 6.కిడ్నాపింగ్ (మనిషిని బలవంతంగా గాని, మోసపూరితంగా గాని ఎత్తుకు పోవటం), అబ్డక్షన్, బానిసత్వం , వెట్టి చాకిరి (బలవంతంగా, బల ప్రయోగం తో పని చేయించు కోవటం), 7.లైంగిక వేధింపులు (అత్యా చారం లేదా మానభంగం ( రేప్ ) తో సహా) – సంబంధించిన నేరాలు, 8.అసహజమైన నేరాలు (సెక్షన్ 377), ఆస్తులకు సంబందిం చిన నేరాలు 1.దొంగతనం, 2.ఎక్స్టార్షన్, 3.రోబరీ , దోపిడీలు, 4.ఆస్తులకు సంబందించిన విషయాలను తారు మారు చేయటం (క్రిమినల్ మిస్ అప్రోప్రియేషన్ ఆఫ్ ప్రాపర్టీ), 5.నమ్మకం వమ్ము చేయటం (నమ్మించి మోసం చేయటం) (కిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్), 6.దొంగతనం చేసిన సొమ్ముని, వస్తువులను (దొంగసొత్తు ), కొనటం, స్వీకరించటం, 7.మోసం చేయటం, 8.తప్పుడు పనుల (తప్పుడు పత్రాల) ద్వారా ఆస్తులను అమ్మటం (ఫ్రాడ్యు లెంట్స్ డీడ్ అండ్ డిస్పొజిషన్ ఆఫ్ ప్రాపర్టీ), 9.అల్లర్లు, అల్లరి పనులు చేయటం, 10.హక్కు ( అనుమతి ) లేకుండా, ఇతరుల ఇళ్ళలోకి, భూములలోకి ప్రవేశించటం, ఆస్తి పత్రాలకు సంబంధించిన నేరాలు, ఆస్తుల (భూములు, ఇళ్ళు) హద్దులకు సంబంధిం చిన నేరాలు: 1.ఆస్తులు (భూములు, ఇళ్ళు), ఇతర హద్దులకు సంబంధించిన నేరాలు, 2. కరెన్సీ నోట్లు, బాంక్ నోట్లు – సంబంధించిన నేరాలు, 1958 లో చేర్చారు. క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ కంట్రాక్ట్స్ ఆఫ్ సర్వీస్, పెళ్ళి (వివాహం)కు సంబంధించిన నేరాలు. భర్త, భర్త తాలూకు బందువుల హింస (కరత్వం). గృహ హింస చట్టాన్ని 1983 లో చేర్చారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్. 9440595494

# జిల్లా జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుంటాం

- ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థులు గట్టి పోటీ
- గెలుపు గుర్రాలకు అదిక ప్రధాన్యత
- బిజెపి పార్టీ జిల్లా కన్వీనర్ తాళ్లపల్లి బాలేశ్వర గుప్తా

**తాండూరు, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చి జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని వికారాబాద్ జిల్లా స్థానిక సంస్థల బిజెపి పార్టీ కన్వీనర్ బాలేశ్వర గుప్తా పేర్కొన్నారు. ఆదివారం బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల పై అనుసరించవలసిన దిశా నిర్దేశం అభ్యర్థుల కార్యచయంలో భాగంగా జిల్లా బిజెపి నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బిజెపి పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర గుప్తా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలి శివకుమార్, సీనియర్ నాయకులు మనోహర్, జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ గౌడ్, నరేందర్ రెడ్డి, స్టేట్ జివిస్టి సభ్యులు ఆంజనేయులు తదితరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బాలేశ్వర గుప్తా మాట్లాడుతూ ఈ స్థానిక సంస్థల ఎన్నికలలో పూర్తిస్థాయిలో బిజెపి పార్టీ నుంచి అన్ని



ఎంపీటీసీ 227 స్థానా లకు 20. జడ్పిటిసి స్థానాలకు పోటీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే 10 మండలాల నుంచి ఎంపీటీసీ, జడ్పిటిసి లకు పోటీ చేసే అభ్యర్థులు దరఖాస్తులు ఇవ్వడం కూడా జరిగిందని తెలిపారు. జడ్పీ చైర్మన్ కు కూడా ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నారని తెలిపారు. ప్రతి ఎంపీటీసీ జడ్పిటిసి కోసం పోటీపడే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లుగా తెలిపారు. అన్ని దరఖాస్తులను రాష్ట్ర కోర్ కమిటీ జిల్లా కోరు కమిటీ పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా కోట్పల్లి మండలంలో కూడా ఎంపీటీసీ జడ్పిటిసి స్థానాలకు అభ్యర్థులు పోటీపడుతున్నారని వారే కాకుండా మిగతా వచ్చే దరఖాస్తులు తీసుకొని అధిష్టానానికి పంపిస్తున్నట్లుగా తెలిపారు. ఈ ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చేందుకు గెలుపు గుర్రాలను ఎంపిక చేసి అభ్యర్థులను ప్రకటిస్తారని అన్నారు. అదేవిధంగా జడ్పీ చైర్పర్సన్ పీఠం కూడా కైవాసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు తాండూరు మండలం సంఘం కాలాన్‌లో చోటు చేసుకున్న సంఘటనపై బిజెపి పార్టీ నాయకులపై కక్ష కట్టారని ఈ విషయాన్ని తమ అధిష్టానన్ని దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అన్నారు. త్వరలోనే వీటి పరిణామాలకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో తాండూర్ మండల స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యతలను విజయ్ కుమార్ కు అందిస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మనోహర్ రావ్.,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బాలి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, సుదర్శన్ గౌడ్, జిల్లా కార్యదర్శి జుంటుపల్లి వెంకటేష్,నూతనంగా ఎన్నికైన తాండూర్ మండల అధ్యక్షుడు వడ్ల విజయ్ కుమార్, తాండూర్ పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాలయ్య, యువ నాయకుడు కుర్వ జగదీష్, కార్యకర్తలు ఉమేష్, కృష్ణ.,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం



**శామీర్‌పేట్, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆపన్నహస్తం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దానికి సహకరిస్తున్న మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్‌కి కృతజ్ఞత కల్గి ఉండాలని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్ అన్నారు. ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కేశవరం గ్రామానికి చెందిన కాసుల మల్లేష్ కి 27,500, ఉప్పెన కృష్ణవేణికి 60,000 వేల రూపాయల చెక్కుని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏదైనా జబ్బు చేసిన నిరు పేదలు ఆసుపత్రుల్లో వైద్య చికిత్స చేసుకున్న తర్వాత అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వారికి నిధులు మంజూరు చేయడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు శేఖర్, మైనార్టీ నాయకులు యూసుఫ్, ఇతర కాంగ్రెస్ నాయకులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా రోడ్డు..

- ప్రయాణకులకు తప్పని తిప్పలు



**మర్పల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** అసలే గుంతల రోడ్డు.. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మరి అధ్వానంగా తయారయ్యింది. రహదారి గుండా వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం కేంద్రం నుండి కొత్తపూర్ వెళ్లే మార్గంలో పంచలింగాలకు వెళ్లే రోడ్డు దగ్గర పూర్తిగా గుంతల పడి వర్షానికి నీళ్లు మడుగుల నిలబడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తో గుంతలో నీళ్లు నిలబడి మరి ప్రమాదంగా మారుతుంది. ఇకనైనా సంబంధిత అధికారులు గుంతలను మరమ్మత్తులు చేసి వాహనాలకు ఇబ్బంది కాకుండా చూడాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

## ఓనం పండుగ మలయాళీలకు ఎంతో ముఖ్యమైనది

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** మలయాళీలు అత్యంత వైభవంగా జరుపుకునే వేడుకలలో ఓనం ఎంతో ప్రాముఖ్య మైనదని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. ఆదివారం గాజుల రామారం డివిజన్ పరిధిలోని ప్యారడైజ్ ఫంక్షనల్ లో మలయాళీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓనం వేడుకలకు ఎమ్మెల్యే వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం ఏ ప్రాంతంలో నివసిస్తున్న పూర్వీకుల సంప్రదాయాన్ని, పండుగలను నిర్వహించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. స్నేహం, ప్రేమ, ఐక్యత లకు ప్రతీకగా ఓనం పండుగ నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో మలయాళీస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కేకే పొన్నప్పన్, ఉపాధ్యక్షులు లాలు కుట్టన్, ప్రధాన కార్యదర్శి పీకే రమేష్, జాయింట్ సెక్రెటరీ సునీల్ సూరారం, కోశాధికారి ఈఎం బైజు, అడ్వైజర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సునీల్, బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు పూప్పాలా భాస్కర్, బి



ఆర్ ఎస్ సీనియర్ నాయకులు సంజయ్, అడ్వకేట్ కమలాకర్, చిన్న చౌదరి, తారా సింగ్, మహేష్, నవీన్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పైలెట్ భరోసా..

- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం తాండూరు నియోజకవర్గంలో ని యాలాల మండలం పేర్కంపల్లి గ్రామంలో మరియు బషీరాబాద్ మండలం కుప్పన్ కోట్ గ్రామంలో పలువురు కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పరమర్శించారు.అదేవిధంగా మాజీ ఎంపీపీ సాయిలుగౌడ్ వర్ధంతిలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పైలెట్ రోహిత్ రెడ్డి అధైర్యపడకండి అండగా ఉంటానని తెలిపారు. పైలెట్ వెంట యాలాల మండల బీఆర్ ఎస్ పార్టీ అద్యక్షులు రవీందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు ఉన్నారు.

## దీక్ష సహనానికి ప్రతిరూపం భగీరథ మహర్షి


- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**మొయినాబాద్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** దీక్ష సహనానికి ప్రతి రూపం శ్రీ శ్రీ శ్రీ సగర భగీరథ మహర్షి అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం నాడు మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం గ్రామంలో ఉప్పర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ శ్రీ శ్రీ సగర భగీరథ మహర్షి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమనికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగీరథ మహర్షి మహాజ్ఞానిగా అభివర్ణించారని, పరోపకారానికి పెట్టిన పేరు దీక్ష, సహనానికి ప్రతిరూపం అని తెలిపారు. భగీరథ మహర్షి ఎంత కష్టమైన లెక్క చేయకుండా అనుకున్నవి సాధించాడనీ అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, అనంతరెడ్డి, శేఖర్ సాగర్, జగన్మోహన్ రెడ్డి, రామకృష్ణ గౌడ్, జైపాల్ రెడ్డి, చారి, అమరేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, సగర సంగం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్



**మొయినాబాద్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ కలిసి సమన్యాయంగా పని చేయాలని టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఆదివారం మొయినాబాద్ మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్యాయ కమిటీ సభ్యులు బాకారం గ్రామ కొమ్మిడి వెంకట్రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలందరూ సమన్యాయంగా పని చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అభ్యర్తులందరూ గెలువు కోసం కష్టపడి పని చేయాలని ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇందిరమ్మ ఇండ్లను ప్రజలకు తెలియజేస్తూ అభ్యర్థులను గెలిపించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఫిషర్మెన్ చైర్మన్ నారాయణవు మహేందర్ ముదిరాజ్, కాశీంబౌలి మాజీ ఉపసర్పంచ్ నల్లా జయరాంరెడ్డి, బాకారం మాజీ వార్డు సభ్యులు ఇమ్మిడి రవీందర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్ర భక్తులకు అన్న ప్రసాద వితరణ



**తాండూరు, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** హిందూ ఉత్సవ కేంద్ర సమితి తాండూరు ఆధ్వర్యంలో ఈ నవరాత్రులలో భాగంగా తుల్జాపూర్ భవాని మాత దర్శనానికి వెళ్లే పాదయాత్ర భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి సభ్యులు రైల్వేస్టేషన్‌లో భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హిందూ ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ భవాని మాత అశీస్సులతో తలపెట్టిన కార్యక్రమం విజయవంతంగా పూర్తి కావాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు, పర్యాద రామకృష్ణ, కుమార్ వాల్మీకి, మంతన్ గౌడ్ అశోక్, మిర్చి వెంకట్, పరమేష్, కోట్ల రాజు, తాంధ్ర నరేష్, లోకేష్, మరియు టైలర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు దక్కేలా కృషి చేయండి

**మోమిన్‌పేట, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిపించే విధంగా ఎలాంటి గ్రూపు తగాదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులకు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు ఆదివారం మండలంలోని మోరంగపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయదశమి శుభాకాంక్షలు తెలపడానికి నగరంలోని లోని ఆయన నివాసానికి వెళ్లారు ఈ సందర్భంగా పార్టీ నాయకులకు గ్రామాల్లో ఎలాంటి విభేదాలు లేకుండా పార్టీ అభ్యర్థులు ఎవరైనా సరే భారీ మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారిని సూచించారు ఎంపీటీసీ జడ్పిటిసి గ్రామ సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఆధారపడి ఉందని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శులు వెంకటయ్య మాణయ్య మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పులిగారి బాబు బబ్లు



చిన్న నరసింహులు ప్రకాష్ ఎస్ బబ్లు శేఖర్ రాజు శ్రీనివాస్ మల్లయ్య రజితరులు స్పీకర్ను కలిసిన వారిలో ఉన్నారు.

## గండిపేట, హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తివేత

**రాజేంద్రనగర్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో నగర శివారు జంట జలాశయాలైన గండిపేట (ఉస్మాన్ సాగర్), హిమాయత్ సాగర్‌లకు నీటిమట్టం పెరిగి వరద ఉధృతి గత రెండు రోజుల నుంచి పెరుగుతోంది. శనివారం నుంచి వరద ముప్పు తో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తూ వరద ఉధృతిని ఎప్పటికప్పుడు గమనిస్తూ వరద నీటిని ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం గండిపేట జలాశయంకు ఇన్ఫ్లో 1900 క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో 8 గేట్లను 3అడుగు మేర ఎత్తి దిగువకు 2704 అవుట్ఫ్లో క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. హిమాయత్ సాగర్ జలాశయం కు ఇన్ఫ్లో 1200 క్యూసెక్కుల ఇన్ఫ్లో వరద చేరుతుండడంతో 2 గేట్లను 3 అడుగుల మేర ఎత్తి 1981 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.అయితే మూసీకి వరద పెరగడంతో నది పరివాహక ప్రాంతాల ప్రజలను జలమండలి అధికారులు, గండిపేట మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్ర లు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తూ పునరావ కేంద్రాలకు తరలిస్తు అప్రమత్తం చేస్తున్నారు.



## బాల్య వివాహాలను నిర్మూలించడానికి సహకరించాలి



**పెద్దేముల్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** బాల్య వివాహాలతో అమ్మాయి జీవితంలో ఎన్నో అనర్థాలు వస్తాయని.. ఎట్టిపరిస్థితుల్లోనూ బాల్యవివాహాలు చేయరాదని సాధన ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి, మదనంతాపూర్, కొండాపూర్, రేగొండి, మంబాపూర్, తింసాన్‌పల్లి, నాగులపల్లి, సిద్దన్న మడుగు తండా, తట్టేపల్లి, పాషాపూర్, జయరాం తండా(ఓ) గ్రామాల్లోని దేవాలయాలు, చర్చీలు, మస్జీదుల ఆవరణలో బాల్యవివాహాల నిర్మూలన బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్యవివాహాల ద్వారా అమ్మాయి జీవన విధానంలో, మానసిక స్థితిలో పరిపక్వత చెందక భవిష్యత్తులో వారి జీవితంలో ఎన్నో రకాల నష్టాలు జరుగుతాయని చెప్పారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు వయసు దాటిన తర్వాతనే వివాహాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రుక్మిబాయి, మాజీ ఎంపీటీసీ కమలబాయి బాబుసింగ్, సాధన సంస్థ ప్రతినిధులు నర్సింహులు, గుమ్మడి రమేష్, రోజా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ నిర్మాణానికి భూమి పూజ



**కేశంపేట, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి , పోమాలపల్లి గ్రామ శివారులో గుట్టపై శివాలయ పునర్నిర్మాణానికి కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దాత కంచుకోట యాదగిరి గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు. శివాలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ కంచుకోట సత్యనారాయణ, గ్రామ యువ నాయకులు కానం ప్రేమ్ కుమార్ గౌడ్, నాయకులు నల్లవోలు శ్రీనివాస్ రెడ్డి , కోక్కళ్ళ కుమారస్వామి, బాలరాజ్, ఏర్పుల వేణు, రమేష్, నరసింహ, ఉడిత్యాల వెంకటేష్ , దశరథ్ పాల్గొన్నారు.

# ఒక పార్టీ వాళ్లు దోచుకుంటే ఇంకో పార్టీ దాచుకుంటున్నారు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు

**జోగిపేట, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** గతంలో టిఆర్ఎస్ పార్టీ వాళ్లు రాష్ట్రాన్ని తాకట్టుపెట్టి దోచుకుంటే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అదే పని చేస్తూ రాష్ట్ర ఖజానాను దోచుకొని దాచుకుంటుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు ఆదివారం నాడు జోగిపేటలో బిజెపి ఆధ్వర్యంలో అలై బలై కార్యక్రమం ధూమ్ ధామ్ గా జరిగింది.దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు రెండు పార్టీలు రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి సొంత ప్రయోజనాలను చూసుకుంది అన్నారు వర్షాలతో రాష్ట్రం అతలాకుతలమై రైతు లు నష్టపోతే వారిని పరామర్శించిన దాఖలా లు లేవన్నారు గత ప్రభుత్వంలో సర్పంచులకు చేసిన పనుల నిధులు ఇవ్వకపోవడంతో ఎంతోమంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నార న్నారు వచ్చే స్థానిక సంస్థనికల్లో జెడ్పిటిసి ఎంపిటిసి సర్పంచులు అధిక సంఖ్యలో గెలిపించుకొని జిల్లా పరిషత్ ను బిజెపి కైవసం చేసుకుంటుందని ఆయన జోష్యం చెప్పారు అనంతరం ప్రముఖ న్యాయవాది చంటి ప్రభు కూతురు చంటి దేవిక తన అనుచరులతో బిజెపిలో చేరారు. దీనికి రాష్ట్ర అధ్యక్షులు ఆమెకు బిజెపి కండువా కట్టి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి. మాజీ ఎంపీ బీబీ పాటిల్ బిజెపి జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి లు మాట్లాడారు ఈ కార్యక్రమంలో . రాష్ట్ర నాయకులు సంగప్ప ,అనంతరావు కులకర్ణి జగదీశ్వర్, గంగా జోగినాథ్, ప్రభాకర్ గౌడ్, ఆయా



మండలాల బిజెపి అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
06 అక్టోబర్ 2025

# న్యాయస్థానాల ద్వారా అందరికీ న్యాయఫలాలు దక్కాలి

**• హైకోర్టు న్యాయమూర్తి మాధవి దేవి**



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** మెరుగైన వసతులతో కూడిన న్యాయస్థానాల ద్వారా అందరికీ న్యాయ ఫలాలు దక్కాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలంగాణ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ అన్నారు.వనపర్తి జిల్లా కేంద్రంలో రూ.81 కోట్ల వ్యయంతో, 20 ఎకరాల స్థలంలో నూతనంగా నిర్మించనున్న 10o2 కోర్టు(పోక్సో, ఫ్యామిలీ కోర్టు కాంప్లెక్స్‌తో కలిపి) భవన సముదాయానికి తెలంగాణ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ ఆన్లైన్ ద్వారా శిలా ఫలాకాన్ని ఆవిష్కరణ చేయగా, హై కోర్టు న్యాయమూర్తులు అనిల్ కుమార్ జూకంటి, మాధవి దేవి భూమి పూజ, శంఖుస్థాపన చేశారు.శంకుస్థాపనకు ముందు వనపర్తి జిల్లాకు విచ్చేసిన ముఖ్య అతిథులు హై కోర్టు న్యాయమూర్థులకు ఆర్ అండ్ బీ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల పూల మొక్కలు ఇచ్చి సాధారంగా ఆహ్వానం పలికారు. అనంతరం శంకుస్థాపన ప్రదేశంలో న్యాయమూర్తులు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. కోర్టు భవన నిర్మాణ ప్రాంగణంలో ముఖ్య అతిథులు మొక్కలు నాటారు.ముఖ్య అతిథులతో పాటు రిటైర్డ్ జడ్జి, తెలంగాణ ఈఆర్సీ ఛైర్మన్ డి నాగార్జున, వనపర్తి జిల్లా న్యాయమూర్తి ఎం ఆర్ సునీత, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ గిరిధర్ రావుల, హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పీ పీ కిరణ్ కుమార్ ఉన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నూతన న్యాయస్థానాల్లో మెరుగైన వసతులతో అందరికీ న్యాయ ఫలాలు దక్కాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. పవిత్రమైన విజయదశమి పర్వదినాల సమయంలో వనపర్తి జిల్లాలో నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం ఆనందకర విషయమని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి కోర్టు నిర్మాణం త్వరగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తూ అందరికీ అభినందనలు తెలియజేశారు. శంకుస్థాపన అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో హైకోర్టు న్యాయమూర్తులు సభను ఉద్దేశించి మాట్లాడారు. జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి మాట్లాడుతూ వనపర్తి జిల్లా కేంద్రంలో నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం శుభ పరిణామం అన్నారు. న్యాయవ్యవస్థలో ప్రజలందరికీ న్యాయం చేకూర్చడం కోసం మంచి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం యొక్క ప్రాధాన్యతను వివరించారు.ఇప్పుడు న్యాయవ్యవస్థను బలోపేతం చేసే దిశగా నిర్మిస్తున్న ఈ నూతన కోర్టు కాంప్లెక్స్ అందరి ప్రయోజనాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ నూతన కోర్టు భవన నిర్మాణం కోసం అందరి కృషి ఉందన్నారు. అదేవిధంగా జిల్లాలో లీగల్ లిటరసీ కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. జస్టిస్ మాధవి మాట్లాడుతూ తాను ఉమ్మడి పాలమూరు జిల్లా ఆడబిడ్డ నే అని చెబుతూ, వనపర్తిలో సంస్థానాదిషుల కాలం నుంచే న్యాయస్థానాలు ఏర్పాటు చేసి ప్రజలకు న్యాయం అందించే వ్యవస్థ ఉందని చెప్పారు. నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి అడగులు పడడంలో వనపర్తి బార్ అసోసియేషన్ సభ్యులు అయిన తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కృషి ఉందన్నారు. దేవాలయం లాంటి ఈ కోర్టు భవనంలో ప్రతి ఒక్కరికి న్యాయ ఫలాలు అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి లో నూతన కోర్టు భవన నిర్మాణానికి అడుగులు పడటం శుభపరిణామం అని, ఇది తనకు ఎంతో మరచిపోలేని రోజుగా చెప్పారు. దేవాలయం లాంటి న్యాయస్థానంలో అందరికీ న్యాయ ఫలాలు అందాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ జడ్జి, తెలంగాణ ఈ ఆర్ సి ఛైర్మన్ నాగార్జున మాట్లాడుతూ వనపర్తిలో నూతన కోర్టు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం ఆనందంతో పాటు భావోద్వేగానికి గురిచేస్తుందన్నారు. న్యాయవ్యవస్థలో ప్రతి ఒక్కరికి న్యాయాన్ని చేకూర్చేందుకు ఇంకా మౌలిక సదుపాయాలను మెరుగు ప్రర్చాల్సిన అవసరం ఉందన్నారు. తాను వనపర్తి లో పుట్టి పెరిగి వనపర్తి బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఉండి ఈరోజు అనేక హోదాల్లో పనిచేసినట్లు గుర్తు చేసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి సంస్థానాదీషుల కాలం నుంచే కవులు కళాకారులకు పుట్టినిల్లు అని చెప్పారు. తిరుపతి వేంకటకవులను సైతం సత్కరించిన చరిత్ర వనపర్తికి ఉందని చెప్పారు. ఈరోజు నూతన కోర్టు భవన నిర్మాణంలో భాగంగా పోలీసుశాఖకు అవసరమైన సదుపాయాల గురించి న్యాయమూర్తి మాధవి దేవిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు చెబుతూనే ఆమెకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా వనపర్తి బార్ అసోసియేషన్ తరపున ముఖ్య అతిథులను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, జిల్లా లీగల్ అథారిటీ సెల్ కార్యదర్శి రజిని, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ న్యాయవాదులు శ్రీరామ్ రావు, మన్మోహన్రావు, అశోక్ రావు, మాధవరావు బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతరులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నంగునూరు, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** నంగునూరు మండల మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నంగునూరు మండలం కోనాయిపల్లి శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో బిఆర్ఎస్ నాయకులు, యువకులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు కేక్ కట్ చేశారు. అనంతరం రాజగోపాల్ పేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. అంతకుముందు ముంద్రాయి గ్రామం లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ పరిసర ప్రాంతంలో శ్రీకాంత్ రెడ్డి 53 సంవత్సరాల సందర్భంగా 53 పండ్ల మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



**భూత్పూర్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డులోని సుభాని దర్గా వద్ద గ్యార్మీ వేడుకలను ఆదివారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా స్థానిక నేతలు, గ్రామస్తులు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హాజరై ప్రత్యేక ఫాతెహాలు, దువాలు నిర్వహించి దర్గా వద్ద గ్యార్మీ జెండాను ఎగురవేశారు. అనంతరం ముస్లిం సోదరులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్ గౌడ్,విజయ్,బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప,గోవర్ధన్ ,ముస్లిం మత పెద్దలు జమీర్,ఇబ్రహీం, ఖాదర్ ,అహ్మద్,ఖదీర్ ,అప్సర్, సర్వర్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



**మక్తల్, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా విజ్ఞప్తి చేశారు. అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడి చాలా తగ్గిందని తెలిపారు. గత సంవత్సరం సరాసరి ఎకరాకు 10 క్వింటాళ్లు అయితే ఈ సంవత్సరం 4 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు అని తెలిపారు. పత్తి విత్తనాలకు, ఎరువులు, పిచికారి మందులకు, కలుపు,పత్తి తీయుటకు మొత్తం ఖర్చు లెక్కిస్తే ఎకరాకు 30 వేల పెట్టుబడి అయ్యిందని తెలిపారు. దానికి తోడు ప్రైవేట్ గా దళారులు క్వింటాలు పత్తికి 5000 కొనడం వలన కూలీల ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి, సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి సీసీఐ అధికారులతో మాట్లాడి పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతులు ఉప్పు ఆంజనేయులు, బడేసాబ్, గుడిసె రామాంజనేయులు, మ్యాకలి ఆంజనేయులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



**మల్దకల్, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** జోగులాంబగద్వాల జిల్లా కేంద్రంలోని ఆదివారంఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మల్దకల్ మండల స్థాయికార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామాలలో నాయకులు కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరికి అవకాశాలు వచ్చే విధంగా వారి గ్రామాల రిజర్వేషన్లు అనుకూలంగా స్థానిక నాయకత్వం బట్టి ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించే విధంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.త్వరలో జరగబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేసి ఎంపీటీసీ,జడ్పీటిసి సర్పంచుల అభ్యర్థులను గెలిపించి భవిష్యత్తులో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్క కార్యకర్తలు గుండెల్లో పెట్టుకొని కాపాడుకునే బాధ్యత నాదే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి,గడ్డంకృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు,మాజీ ఎంపీపీరాజారెడ్డి, మాజీ జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, సింగల్ విండో ఛైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి




**నర్వ, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** నర్వ మండల కేంద్రంలొ ఆదివారం వాల్మీకి జయంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మండల అన్ని గ్రామాల బోయలు అధిక సంఖ్య పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు,బోయాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని నినాదాలు చేశారు,ఈకార్యక్రమంలొ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య గడ్డంపల్లి హనుమంతు నర్వ మండల వాల్మీకి సంఘం అధ్యక్షులు అయ్యన్న పలు గ్రామాల బోయలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనది



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. ఆదివార సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో స్థానిక రేడియంట్ హై స్కూల్ లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత బాధ్యతాయుతమైనదని విద్యార్థులకు మార్గదర్శం చేస్తూ వారి బంగారు భవిష్యత్తుకు తరగతి గదిలో చక్కని పునాదులు వేయాలని కోరారు.గుణాత్మకమైన విద్యను అందించిన ఉపాధ్యాయులు విద్యార్థుల గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని శంకర్ గౌడ్ తెలిపారు.మూడున్నర దశాబ్దాలపాటు విద్యా శాఖకు విశిష్టమైన సేవలందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పానగల్ మండల విద్యాధికారి బత్తుల శ్రీనివాసులు,కిష్టగిరి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేశ్వరగౌడ్‌ను నిర్వాహకులు శాలువ పూలమాల జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈనాటి కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు కందూరు నారాయణ రెడ్డి బైరోజు చంద్ర శేఖర్ ఏం. ఎ సత్తార్ ఏసేపు రాజారాం ప్రకాష్ నిరంజనయ్య గంధం నాగరాజు దేశి రాములు యాదవ్ బండారు శ్రీనివాస్ టి.రాంరెడ్డి వీరాచారి బుజ్జిబాబు రామకృష్ణారెడ్డి కొత్తకాపు నారాయణరెడ్డి మహంతప్ప తదితరులు పాల్గొన్నారు.

## నేటి అలాయ్ బలాయ్‌ను విజయవంతం చేయం



**సంగారెడ్డి, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 6 సోమవారం నిర్వహించనున్న అలై బలై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీరశైవ లింగాయత్ లింగ బలిజ జిల్లా అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి కమ్యూనిటీ హాల్ లో ఆయన మాట్లాడుతూ..అక్టోబర్ 6 సాయంత్రం 5 గంటలకు సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా విద్యానగర్ కాలనీ రోడ్ నెంబర్ 3లో గల విద్యానగర్ కమ్యూనిటీ హాల్ లో దసరా పండుగ పురస్కరించుకుని ఆత్మీయ సమ్మేళనం(అలాయి భళాయి) కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. ఈకార్యక్రమానికి లింగాయత్ బంధుమిత్రులందరూ హాజరు కావాలని కోరినారు. కార్యక్రమానికి గౌరవ అధ్యక్షులు ధనంజయ, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మల్లికార్జున్ పాటిల్, ఉపాధ్యక్షులు రాజేశ్వర స్వామి, ఉప కోశాధికారి శివకుమార్ ,కార్యదర్శులు శరణుబసవేశ్వర్ ,శివ కుమార్ ,గౌలీశ్వర్ ,మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు వీరమనమ్మ ,నిర్మల పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని వీరశైవ లింగాయత్ లింగ బలిజ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ముగిసిన వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**మక్తల్, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** మఖ్తల్ పట్టణంలోని బ్రాహ్మణ వాడిలో కొలువైన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి 60వ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 02 వ తేదీ వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పాడి పశు సంవర్ధక, క్రీడా యువజన, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర సేవలలో సహకరించిన ప్రతి ఒక్కరికీ మెమెంటో, శాలువాతో సత్కరించారు. మఖ్తల్ నియోజకవర్గం తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఏ. రవికుమార్, కల్లూరి గోవర్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫయాజ్, ఆలయ ధర్మకర్త శ్యాం సుందర్ జోషి, వంశీ కృష్ణ జోషి, గోవిందరావు, సురేంద్ర చారి, వాదిరాజ్, డివి చారి, విద్వాన్ రాఘవేంద్ర, కిష్టాచారి, హనుమేష్ చారి, గురుజాల్ విద్యాసాగర్, రఘు ప్రసన్న బట్, విజయ్, వెంకటేష్, శ్రీకాంత్, అరవింద్, పంచలింగాల హనుమేష్ చారి, ముడుమాల్ రాఘవేంద్రరావు, తిరుమలరావు, కౌశిక్, రాహుల్, అభయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన మాజీ ఎంపీపీ మొగులప్ప



**రాయికోడు, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** రాయికోడ్ మండల పరిషత్ మాజీ అధ్యక్షులు ఎస్ మొగలప్ప బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం జోగిపేటలో నిర్వహించిన అలై బలై కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్ నేతృత్వంలో బిజెపి పార్టీలో చేరారు.ఆయనకు మాజీ ఎంపీ తో పాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బిజెపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎస్ మొగులప్ప మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశానికి చాలా అభివృద్ధి పతంలో నడిపిస్తున్నాడని మోడీ అభివృద్ధికి ఆకర్షితులై తాను బిజెపి పార్టీలో చేరానని తెలిపారు. రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షునితో పాటు బిజెపి నాయకులు గణేష్ మాణిక్ విట్టల్ రెడ్డి వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

**• జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి**



**మాగనూరు, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి పిలుపునిచ్చారు. బిజెపి ఉమ్మడి మండల అధ్యక్షులు నల్లె నర్సప్ప అధ్యక్షతన మాగనూర్ మండలంలోని వర్కూర్ గ్రామంలో మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి బలరాం రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు 420 హామీలు ఇచ్చి అన్ని వర్గాలను మోసం చేసి గ్రామాల అభివృద్ధి గాలికి వదిలేసారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ గ్రామాల అభివృద్ధి కీ నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు ఇచ్చి అనేక ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి ప్రజా సంక్షేమనికి కట్టుబడి ఉందని వారి బాటలో స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు, మండలంలోని అన్ని గ్రామాల్లో అభ్యర్థులు పోటీ చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మండల అధ్యక్షులు జయానంద్ రెడ్డి, జిల్లా నాయకులు వాకిటి మల్లేష్, కనకరాజు, ప్రధాన కార్యదర్శి కరిమని తిమ్మప్ప,మండల నాయకులు ఆంజప్ప గౌడ్, లోకపల్లి హన్మంతు, పెద్ద తిమ్మప్పోళ్ల వెంకటప్ప, నాగప్ప,ప్రతాప్ రెడ్డి, ఉషానోళ్ల వెంకటప్ప,కేశవరెడ్డి, దాసరి శ్రీను,క్రిష్ణ, నర్సింహా, కొల్పూర్ మహేష్, సోమప్ప గౌడ్, శ్రీపాద్, అంజిరెడ్డి, కమలకాంత్,బూత్ అధ్యక్షులు బంగి అశోక్, గుడి గుడి భీమప్ప, పి నర్సిమా, దుబాయ్ శీను, శరత్ కుమార్, జి బుగ్గప్ప, తాయప్ప, వాకిటి చంద్రశేఖర్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

- ములుగు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బడే నాగజ్యోతి
- కాంగ్రెస్ బాకీపడ్డ హామీలపై ఇంటింటికి అవగాహన కల్పించాలే
- 6 గ్యారంటీల మోసాన్ని 420 హామీలను ప్రజలకు వివరించాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి
- కాంగ్రెస్ పార్టీని నమ్మితే చీకటే తప్ప వెలుగులు ఉండవు
- అధికారం కోసం కాదు ప్రజల కోసమే పోరాటం చేస్తం



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 05(జనంసాక్షి) :** ఆరు గ్యారంటీలు 420 హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల ఎన్నికల కోసం మీ ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ జెడ్పి చైర్ పర్సన్ బడే నాగజ్యోతి కోరారు. ఈ మేరకు ఆదివారం రోజున ములుగు జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో బిఆర్ఎస్ పార్టీ ములుగు మండల అధ్యక్షుడు సాని కొమ్ము రమేష్ రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బడే నాగజ్యోతి హాజరై స్థానిక సంస్థల ఎన్నికలపై మండల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆనాడు అధికారం కోసం అనేక హామీలు ఇచ్చి ఒక్కటి నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి 22నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు చేయలేదని, ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ బాకీకార్డు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డును గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను అప్రమత్తం, చైతన్యం చేస్తూ ఇచ్చిన హామీలు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడిగేందుకు రావాలని కాంగ్రెస్ నాయకులను నిలదీసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 22నెలల కాంగ్రెస్ పార్టీ పాలనలో అక్కా చెల్లెలకు ఒక్కొక్కరికి 55వేలు, వృద్దులు వితంతులు, బీడి కార్మికులకు 44వేలు, దివ్యాంగులకు 44వేలు, ఆడబిడ్డలకు తులం బంగారం, చిన్నారులు కళాశాలకు వెళ్లే స్కూటీలు, ఫీజురియింబర్స్ మెంట్ కింద వివిధ సంస్థలకు 8వేల కోట్లు బాకీ ఉన్నట్లు ఆమె తెలిపారు. అలాగే రైతు భరోసా కింద ఒక్కో రైతుకు 76వేలు, రుణమాఫీ 80శాతం కూడ పూర్తి చేయకుండా అనేక మంది రైతులకు రెండు లక్షల చొప్పున బాకీ ఉందన్నారు. రైతు కూలీలకు 24వేలు, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి కింద 88వేలు, విద్యాభరోసా కార్డు ఇస్తమని చెప్పిన ప్రభుత్వం ఒక్కొక్కరికి 5లక్షలు, ఉచిత బస్సుతో మోసపోయిన ఆటో అన్నలకు రెండేళ్లలో 24వేలు బాకీ ఉన్నట్లు వివరించారు. 200యూనీట్లు ఫ్రీ అని చెప్పినా ఎక్కడా అది అమలు కావడం లేదని, ఇల్లు లేని నిరుపేదకు ఇండ్లు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్క ఇల్లు కట్టించలేదన్నారు. ఉద్యమకారులను మభ్యపెట్టిండ్లు 250చదరపు గజాల ఇంటి స్థలం 5లక్షలు ఇస్తమని మోసం చేశారని, రాజీవ్ యువకిరణాల పేరు నాలుగు సార్లు దరఖాస్తులు తీసుకుని దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఇలా హామీల పేరుతో మోసం చేసిన కాంగ్రెస్‌ను ఉపేక్షించుకుంటూ పోతే వాళ్ల మోసాలకు హద్దులు ఉండవని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే కాదు ప్రజాస్వామ్యం తెలిసిన వాళ్లు ఓట్లు వస్తే నోట్ల సంచులు, పథకాలను చూపి వాటిని అమలు చేయకుండా మోసం చేసే వాళ్ల గురించి సమాజానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కాంగ్రెస్‌ను నమ్మితే చీకటే తప్ప వెలుగులు ఉండవని, 78ఏండ్లలో 50ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఇప్పటికి చీకట్లోనే ఉంచిందన్నారు. మనం అధికారం కోసం కాదు ప్రజల కోసమే పని చేస్తున్నామని అధికారంలో ఉంటే ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిండం జరిగిందని అధికారంలో లేకపోతే ప్రతిపక్షంలో ఉంటూ ప్రభుత్వం మెడలు వచ్చి పనులు చేయించామని పార్టీ కార్యకర్త ఒక్క క్షణం కూడా అలసత్వం చేయకుండా కాంగ్రెస్ బాకీ కార్డును గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు.

అదేవిధంగా పోరిక గోవింద్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సమిష్టి కృషితో పనిచేసి మన నాయకులను గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన అన్నారు. ప్రజల్లోకి కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను పంపిణీ చేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోరిక పోమ నాయక్, సకినాల భవాని, అజ్మీర ధర్మమ్ సింగ్, ములుగు టౌన్ ప్రెసిడెంట్ చెన్న విజయ్, జిల్లా యూత్ అధ్యక్షుడు కోగిల మహేష్, మాజీ ఎంపీపీ భూక్య మురళి, వేల్పూరి సత్యం, కవ్వంపల్లి బాబు, వేములపల్లి బిక్షపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుతోట చంద్రమౌళి, పోరిక విజయరామ్ నాయక్, భూక్య జంపన్న, గొర్రె సమ్మయ్య, దాసరి రమేష్, దేవర నేని స్వామి రావు, మసిపెద్ది సత్యనారాయణ రావు, గండి కుమార్, ఉయ్యాల భద్రయ్య, బైకాని సాగర్, మోరే రాజన్న, ఆరిందుల కుమార్, బైకాని ఓదెలు, గడ్డమీద భాస్కర్, నేరెళ్ల శంకర్, భూక్య అమర్ సింగ్, మాదం సాగర్, అనుముల సురేష్, లింగంపల్లి రవీందర్రావు, చింత మల్లయ్య, చింత నారాయణ, మాలోత్ రవీందర్, అడ్డూరి రాజు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# కాంగ్రెస్ బాకీ కార్డు పంచిన బీఆర్ఎస్



**గంగారం అక్టోబర్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మాయ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 22 నెలల్లో ఇప్పటివరకు ఒక్కో వ్యక్తికి ఎంత బాకీ పడ్డదో తెలియచేస్తూ గంగారం మండలంలోని గ్రామాల్లో స్థానిక, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి బాకీ కార్డు పంపిణీ చేసిన నాయకులు కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం మీ వద్దకు వచ్చినప్పుడు వాళ్ళు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నించాలని, బాకీ కార్డులు చూపించి ఎండగట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గంగారం మండల పార్టీ అధ్యక్షులు ఇర్ప సూరయ్య, ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బాలకృష్ణ, ఉమ్మడి మండల సీనియర్ నాయకులు ఈసం సమ్మయ్య, రిటైర్డ్ టీచర్ జిల్లా నాయకులు సువర్ణ పాక జగ్గారావు, లోడి వెంకన్న, జాజ్జరి నర్సింగరావు, సోషల్ మీడియా ఇన్చార్జ్ జనగం రవి తదితరులు పాల్గొన్నారు

# ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సాయం

- జెడ్పీఎస్ఎస్ ఆత్మకూరు పూర్వ విద్యార్థుల హృదయపూర్వక సేవా కార్యక్రమం



**ఆత్మకూరు, సెప్టెంబర్5 (జనం సాక్షి):** జెడ్పీఎస్ఎస్ ఆత్మకూరులో 2005-06 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి, ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలకు సాయం అందించారు. గూడెప్పాడు గ్రామానికి చెందిన లావణ్య కుటుంబానికి 10,000 రూపాయలు, అదే గ్రామానికి చెందిన బలబద్ర రాకేష్ తల్లికి 5,000, రూపాయలు పసరుగొండకు చెందిన కోరే శ్రీశైలం తల్లికి 5,000, రూపాయలు ఆత్మకూరు కి చెందిన చిమ్మని స్వాతి కుటుంబానికి 5,000, రూపాయలు అలాగే ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆర్. సురేష్‌కు చికిత్స నిమిత్తం 5,000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సేవా కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వరుణ్ గౌడ్, దేవేందర్, వినయ్ కుమార్, జ్ఞానేశ్వర్, రామరాజు, నత్తి అనిత, లావణ్య, రమేష్, సురేష్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు. సాయం అందుకున్న కుటుంబాలు పూర్వ విద్యార్థుల ఈ మానవతా కార్యక్రమానికి కృతజ్ఞతలు తెలిపారు. "ఇలాంటి స్ఫూర్తిదాయక చర్యలు సమాజంలో మానవతా విలువలను పెంచుతాయి" అని స్థానికులు అభినందించారు.



# కొండచిలువ కలకలం

- పోలీసులు, అటవీశాఖ అధికారులు అప్రమత్తం

**భీమదేవరపల్లి(ఎల్కతుర్తి) అక్టోబర్ 05 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం భారీ కలకలం చోటుచేసుకుంది. ఊరంకి లక్ష్మి ఇంటి వద్ద ఆకస్మికంగా 9 అడుగుల పొడవైన కొండచిలువ ప్రత్యక్షమవడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు.ఇంటి వద్ద పిల్లలు ఆడుకుంటుండగా పెద్ద పామును చూసి వారు కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికి పరుగెత్తారు. గ్రామంలో అంత పెద్ద కొండచిలువ కనిపించడం ఇదే తొలిసారి కావడంతో కొంతసేపు ఉత్కంఠ వాతావరణం నెలకొంది. వెంటనే గ్రామస్తులు ఎల్కతుర్తి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సీఐ పులి రమేష్,ఎస్సై ప్రవీణ్ కుమార్,కానిస్టేబుళ్లు రాజు,గణేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తర్వాత పాములు పట్టడంలో నిపుణుడైన శ్రీధర్ అనే యువకుడిని పిలిపించి,ఆయన సహాయంతో కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. అధికారులు ఆ కొండచిలువను సమీప అటవీ ప్రాంతంలో వదిలివేశారు. వర్షాకాలంలో పాములు కొండచిలువల వంటి సర్పాలు తిండి కోసం గ్రామాల వైపు తరచుగా వస్తాయని,గ్రామస్తులు ముఖ్యంగా వ్యవసాయ బావులు కొలనులు గొదాములు వంటి ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్,ఎస్సై ప్రవీణ్ కుమార్, సూచించారు. అలాగే పాములు కనిపించిన వెంటనే అటవీశాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీసుల చర్యల పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తూ పెద్ద ప్రమాదం తప్పిందంటూ ఊపిరి పీల్చుకున్నారు.

# మానవత్వం చాటుకున్న యువకులు



**సారంగాపూర్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** దసరా సెలవు దినాల్లో సరదాగా గడిపే రోజుల్లో ఆలూరులో క్రికెట్ టోర్నమెంట్ ఏపీఎల్ సెకండ్ సీజన్ నిర్వహించడం జరిగింది సాధారణంగా టోర్నమెంట్లో గెలుపొందిన యువకులకు వచ్చిన డబ్బుతో ఆనందంగా గడపడం చూసాము కానీ అందుకు విరుద్ధంగా తమకు వచ్చిన డబ్బులతో యువకులు తమ మానవత్వంతో ఒక కుటుంబానికి ఆసరాగా నిలవడం జరిగింది ఆలూరు గ్రామానికి చెందిన రేంజెర్ల చిన్న అమ్మాయి కుటుంబానికి తమ వంతు సాయంగా 6000 నిత్యవసర సరుకులు ఇవ్వడం జరిగింది... ఆ కుటుంబానికి. ఆలూరు బ్లాస్టర్ టీం అండగా నిలవడం జరిగింది..... ఇలాంటి మానవ దృక్పథంతో యువకులు చేసిన మంచి కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు ఈ టోర్నమెంట్లో గెలుపొందిన ఆగ్రామస్తులు అభినందించారు ఈ టోర్నమెంట్లో గెలుపొందిన ఆలూర్ బ్లాస్టర్ టీం ను అభినందించారు... ముందు ముందు మరెన్నో సేవలు చేయాలని గ్రామస్తులు కోరారు.

# బిజినెస్‌లో పెట్టుబడి పెట్టించి మోసం చేసిన వ్యక్తి రిమాండ్



**మహబూబాబాద్ బ్యూరో, అక్టోబర్ 05(జనం సాక్షి):** మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, మహబూబాబాద్ టౌన్ పరిధిలోని ఒక బాధితురాలికి మాయమాటలు చెప్పి తన బిజినెస్ లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి, ఆ యువతి చేత సుమారు 6 (ఆరు) లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టించి మోసం చేసిన బత్తుల రవికిరణ్ తండ్రి లక్ష్మీపతి పత్తిపాకకు చెందిన వ్యక్తిని శనివారం రోజున నిందితుని ఆఫీస్ దగ్గర పట్టుకుని కోర్టులో హాజరుపరచి రిమాండుకు తరలించామని తెలిపారు. అలాగే ఇలాంటి మోసపూరిత చైన్ మార్కెటింగ్ వ్యాపారాలు చేస్తే అధిక డబ్బులు ఇస్తామని ప్రజలను మోసం చేసే వ్యక్తులను నమ్మవద్దని మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ అన్నారు.

# పిడుగుపాటుకు మహిళ మృతి



**కాటారం, అక్టోబర్ 5 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఒడిపిలవంచ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో పాటు పిడుగుపాటుకు ఒక మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిపిలవంచ గ్రామానికి చెందిన ఇసునం లక్ష్మి (48) అనే మహిళ రోజువారిగా వెళుతున్న కూలీ పనుల్లో భాగంగా పత్తి చేనుకు వెళ్ళింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో కురిసిన అకాల వర్షంతో పాటు పిడుగుపాటుకు లక్ష్మి అక్కడికక్కడే కుప్పకూలి, చనిపోయింది. లక్ష్మి భర్త రాజయ్య గత నాలుగేళ్ల కిందట చనిపోయారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

# ఎమ్మెల్యేను పరామర్శించిన మేయర్

### కాంతమ్మ పార్థివ దేహానికి నివాళులు



**వరంగల్ ఎంజీఎం అక్టోబర్ 5(జనంసాక్షి):** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి దొంతి కాంతమ్మ మరణించగా ఆదివారం హన్మకొండ లోని ఏం ఎల్ ఏ స్వగృహం లో ఆమె పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించి పూల మాల సమర్పించి నివాళులు అర్పించిన నగర మేయర్ గుండు సుధారాణి. ఈ సందర్భం గా ఏం ఎల్ ఏ కు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన మేయర్ ఆత్మస్థైర్యాన్ని మనో నిబ్బరాన్ని ఆ భగవంతుడు అందజేయాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# శ్రామిక మహిళల హక్కుల సాధన కోసం పోరాటం చేస్తాం

- కనీస వేతనాల చట్టం అమలు చేయాలి
- కాగజ్ నగర్ లో సిఐటియు భారీ ర్యాలీ
- రాష్ట్ర 5 వ మహాసభలో జాతీయ కోశాధికారి సాయిబాబు




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 5 (జనం సాక్షి) :** దేశంలో సంఘటిత, అసంఘటిత శ్రామిక మహిళల హక్కుల సాధన కోసం సిఐటియు పోరాటం చేస్తూనే ఉంటుందని అఖిలభారత సిఐటియు ట్రేడ్ యూనియన్ జాతీయ కోశాధికారి సాయిబాబు అన్నారు. ఆదివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో 2 రోజులపాటు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర మహిళా శ్రామిక 5వ మహాసభలకు ముఖ్య అతిథిగా సాయిబాబు హాజరై ప్రసంగించారు. దేశంలో భారతీయ జనతా పార్టీ హయాంలో శ్రామిక మహిళ ల హక్కులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. సమాన పనికి సమ్మాన వేతనం అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని ఆరపించారు. కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ అందిస్తూ దేశంలో అధిక సంఖ్యకు శ్రామిక మహిళల శ్రమ దోపిడి కి పాల్పడుతున్నారని అన్నారు. దేశంలో కార్పొరేట్ యాజమాన్యాల కబంధహస్తాల్లో 45 శాతం సంపద ఉందని అన్నారు. కార్మిక హక్కులను కాల రాసే విధంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ చట్టాలను తీసుకువచ్చి అమలు చేస్తున్నదని దుయ్యబట్టారు. సమాజంలో సగభాగం అయిన మహిళలకు నేటికి సైతం విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో సంచిత స్థానం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజన తదితర రంగాలకు చెందిన కార్మికుల హక్కులను హరిస్తూ కనీస వేతనాల చట్టం అమలు చేయడం లేదని విమర్శించారు. అంత కు ముందు పట్టణంలోని బాల భారతి ఉన్నత పాఠశాల నుంచి డోలు వాయిద్యాలు, నృత్యాలు ర్యాలీగా బయలుదేరి పట్టణంలోని మెయిన్ మార్కెట్, అంబేద్కర్ చౌక్, రాజీవ్ గాంధీ చౌక్ మీదుగా తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా వినయ్ గార్డెన్ వరకు బారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మహాసభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, శ్రామిక మహిళ సమన్వయ.రాష్ట్ర కమిటీ కన్వీనర్ ఎస్ వి రమ, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, వెంకటేష్, జయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జై రాజేందర్, ముంజం శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు కుశన రాజన్న, దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, ముంజం ఆనంద్ కుమార్, గుడిసెల కార్తీక్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వి ఆనంద్, జిల్లా కార్యదర్శి ఆర్ .మహేష్ వివిధ జిల్లాల సిఐటియు నాయకులు, ఉద్యోగ సంఘాలు నాయకులు, శ్రామిక మహిళ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- చైతన్యవంత కథనాలను రాయాలి
- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్..



**నర్సంపేట, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ అన్నారు. ఆదివారం నర్సంపేట పట్టణంలోని కేఎస్ఆర్ కాన్సెప్ట్ స్కూల్ లో టీడబ్ల్యూజేఎఫ్ నర్సంపేట నియోజకవర్గ స్థాయి జిల్లా ఉపాధ్యక్షులు కిషన్, కొమ్ము రాజు ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తున్న క్రమంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజల పక్షాన, అనేక సమస్యలను, అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే క్రమంలో దాడులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడుల నియంత్రణ రక్షణ కల్పించేందుకు గతంలో అటాక్స్ కమిటీ ఉండేదన్నారు. ప్రభుత్వం తిరిగి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అటాక్స్ కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులు నియమ నిబంధనల మేరకు పని చేయాలని, ఏదైనా విషయం సోషల్ మీడియాలో వేగంగా ప్రచారం అవకాశం ఉన్నందున నిర్ధారించుకున్నకే వార్తలు రాయాలన్నారు. సమాజంలోని సమస్యలను అధ్యయనం చేసి వార్తలు రాయాలని సూచించారు. జర్నలిస్టులు నైతిక నియమాలు, సూత్రాలను పాటించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రను పోషించిన జర్నలిస్టులకు కిందటి కేసీఆర్ ప్రభుత్వం ఎలాంటి సంక్షేమ పథకాలు ఇవ్వలేదన్నారు. ప్రధానంగా ఇండ్లు, ఇండ్ల స్థలాలు అంటూ ఆశచూపి చేయిచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క జర్నలిస్టు సొసైటీకి కుడా స్థలం ఇవ్వలేదన్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపుపై కోర్టులో కేసు కొనసాగుతుందని అన్నారు. జర్నలిస్టుల ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ వేసి అధ్యయనం చేయాలన్నారు. తద్వారా జర్నలిస్టులకు నివేశన స్థలాలు కేటాయింపు పై ప్రభుత్వం ప్రత్యేక పాలసీని తీసుకురావాల్సిన అవుసరం ఉందన్నారు. అక్రిడిడేషన్ కార్డుల జారీలో ప్రభుత్వం జాప్యం వీడి అర్హులైన జర్నలిస్టులందరికీ అందజేయాలన్నారు. ఇప్పటికే ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మచ్చిక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు క్యాష్ లెస్ వైద్య సదుపాయం కల్పించాలన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షులు పొడేటి అశోక్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, జర్నలిస్టులకు నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. అనంతరం నర్సంపేట నియోజకవర్గ అడ్ హక్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్ గా కుంటమల్ల అరవింద్, కో కన్వీనర్లుగా వల్లాజీ సురేష్, కల్లెపు ప్రణీత్, బాధావత్ రవి, భూక్య వెంకట్, దోనాల రమేష్, ఇంగోలి అశోక్ రావు, ఈదుల కృష్ణ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమం లో టీ డబ్ల్యూ జే ఎఫ్ జిల్లా నాయకులు జినుకల రజినికుమార్,

# కాంగ్రెస్ బాకీ కార్డులే బీఆర్ఎస్ పార్టీ బ్రహ్మాస్త్రాలు

**మాడ్గులపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అమలుకు సాధ్యం కానీ 420 అబద్ధపు హామీలను ఇచ్చిఆరుగ్యారెంటీ లను అప్పనంగా గాలికి వదిలిన కాంగ్రెస్ పార్టీ "కాంగ్రెస్ బాకీ కార్డులే"స్థానిక సంస్థల ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ బ్రహ్మాస్త్రాలు అని మిర్యాలగూడ, నాగార్జునసాగర్, నల్లగొండ, నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతుభాస్కర్ రావు, నోముల భగత్, కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామంలోని వివిఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన భారత రాష్ట్ర సమితి స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణరాష్ట్రం ఏర్పాటు నుండి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతును రాజుగా చేయాలనే తపనతో రైతు పక్షపాతిగా మారి రైతులను గుండెల్లో పెట్టుకొని చూసుకొని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కాపాడుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వకపోగా, పూర్తి స్థాయిలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ కాలే దని, రైతుబంధు, రైతు బీమా విషయంలోనూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా మోసం చేస్తుందన్నారు.



స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రత్యర్థి పార్టీలను చిత్తు చేసేందుకు కార్యకర్తలు ఐక్యమత్యంతో ఒక్కో గ్రామం నుంచి బిఆర్ఎస్ సైనికులందరు కలిసి ఒకే అభ్యర్థిని సూచించాలని, పార్టీబలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలుకు సాధ్యం కానీ అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన"కాంగ్రెస్‌కు బాకీ కార్డులే శాపంగా మారి" ఆర్ఎస్ పార్టీ బ్రహ్మాస్త్రాగా ఉపయోగపడతాయన్నారు.

కాంగ్రెస్ బాకీ కార్డును ప్రతి పల్లెకు ప్రతి ఇంటికి తీసుకుని వెళ్లి కాంగ్రెస్ నిజస్వరూపాన్నిబట్టబయ లు చేసి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భారత రాష్ట్ర సమితిమండల అధ్యక్షుడు పాలుట్ల బావయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భారత రాష్ట్ర సమితినాయకులు మహమ్మద్ మోసిన్ అలీ, పోకల రాజు, కందిమళ్ల నరేందర్ రెడ్డి, సూదిరెడ్డిశ్రీనివాసరెడ్డి,పగిల్లసైదులు, నిమ్మల నవీన్ రెడ్డి, జేరిపోతుల రాములు గౌడ్, వెన్న శ్రవణ్ రెడ్డి, మారుతి వెంకట్ రెడ్డి, యాదగిరి రెడ్డి, షేక్.ఖాసిం, యాదగిరి రెడ్డి కర్ర,ఇంద్రారెడ్డి ,సతీష్ , పోరెడ్డి, కోటిరెడ్డి, కూరెళ్ళవెంకటాచారి, మహమ్మద్ ఆగ అఫ్జల్, గడ్డం సైదులు, ,కర్ర శ్రీను , గడ్డం శ్యామ్ సుందర్ రెడ్డి, గుదే సత్యనారాయణ శర్మ, కృష్ణయ్య, జంగయ్య ,గోవర్ధన్ , చారి, కృష్ణయ్య, జనార్ధన్, రాములు, సన్నాల నాగరాజు, తవిటి సైదులు, గొడుగు రమేష్,కన్నెబోయిన నాగరాజు, దర్శనం నాగయ్య, జలంధర్, మేకల నరేష్, బంగారపు రవి, డాకయ్య, కొండేటి కెప్టెన్‌లతో పాటు మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు గ్రామ పార్టీ అధ్యక్షులు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీలో రాష్ట్రస్థాయిలో రాణించడం అభినందనీయం



**కోదాడ, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** కబడ్డీలో సూర్యాపేట జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలవడం అభినందనీయమని కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు ఎండి. మహబూబ్ జానీ కోదాడ ఎంఈఓ సలీం షరీఫ్‌లు అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ 16 విభాగంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొందిన సూర్యాపేట జిల్లా కబడ్డీ జట్టు కు ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కబడ్డీ క్రీడలో కోదాడకు ఘనమైన చరిత్ర ఉందని ఇదే చరిత్రను కొనసాగించాలన్నారు కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచి సూర్యాపేట జిల్లాకు మరింత వన్నె తేవాలన్నారు ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ సూర్యాపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అల్లం ప్రభాకర్ రెడ్డి, నామా నరసింహారావు ,చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఈదుల కృష్ణయ్య, రెవిన్యూ అధికారి జానకి రామిరెడ్డి, క్రీడాకారులు పంది కళ్యాణ్, భద్రం సైదులు, వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు చలిగంటి రామారావు తదితరులు ఉన్నారు.

## వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** అధిక వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని ముందస్తు చర్చలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి పట్టణంలో ఉదయం నుండి కురుస్తున్న వర్షాల కారణంగా పట్టణంలో గతంలో ముంపునకు గురైన జి ఆర్ కాలనీలలో ఆదివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మున్సిపల్ కమిషనర్ సిహెచ్ రాజేంద్రరెడ్డి సానిటరీ ఇన్స్పెక్టర్ మరియు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించి ఉదయం నుండి కురుస్తున్న భారీ వర్షం వలన జి ఆర్ కాలనీ బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న నీటి ఉద్రితిని ప్రత్యక్షంగా పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గతంలో భారీ వర్షాల వలన కలిగిన ఇబ్బందులను, నష్టాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండి కాలనీవాసులను అప్రమత్తం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలను చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించినారు. జి ఆర్ కాలనీతో పాటు కామరెడ్డి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలన్నింటిలో అధికారులు పర్యటిస్తూ అధిక వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీ, జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తర్వాత ప్రజావాణి కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందువల్ల జిల్లాలోని ప్రజలు ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని అన్నారు.

## కనీసం వరద బాధితులను ఆదుకోలేని నువ్వేం ముఖ్యమంత్రివి..

• **సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరీ హరీష్ రావు**



**నాగిరెడ్డిపేట్, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** ఇటీవల వరదల్లో తీవ్రంగా నష్టపోయి ఇబ్బంది పడుతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గము నాగిరెడ్డిపేట్ మండల ప్రాంత ప్రజలను,రైతులను మాజీ మంత్రివర్యులు వేముల ప్రశాంత్ రెడ్డి,ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్,కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్తో కలిసి మాజీ మంత్రివర్యులు,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరీ హరీష్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరీ హరీష్ రావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...కామారెడ్డి జిల్లాలో వర్షాలతో వేలాది ఎకరాల పంట నష్టం జరిగిందని వందలాది ఇండ్లు కూలిపోయాయని,ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కామారెడ్డికి వచ్చి రివ్యూ చేసి అందర్నీ ఆదుకుంటామని భరోసా ఇచ్చి నిన్నటికి నెల రోజులు పూర్తయిందన్నారు. కానీ నయా పైసా సహాయం జరగలేదన్నారు. జిల్లా అధికారులు పంపించిన రిపోర్టులో దాదాపు 340 కోట్ల నష్టం జరిగిందని చెప్తే ఇప్పటివరకు రేవంత్ రెడ్డి 34 రూపాయలు కూడా ఇవ్వలేదని తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది రోడ్లు,చెరువులు తేపోయాయి కాలువలకు గండ్లు పడ్డాయి ఇప్పటివరకు ఏ ఒక్క చోట కూడా పునరుద్ధరణ పనులు ప్రారంభించలేదన్నారు. రోడ్లు పాడైపోవడంతో ఎల్లారెడ్డి నియోజకవర్గం నుండి కామారెడ్డి జిల్లా కేంద్రానికి రవాణా సౌకర్యం స్తంభించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి రవాణా లేదు పిల్లల చదువులు పాడైతున్నాయన్నారు. కామారెడ్డి జిల్లాలో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి నష్టపరిహారాన్ని అందించాలి. ఎగ్గొట్టిన పంట బోనస్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి,ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్,జనార్ధన్ గౌడ్,కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్,బిఆర్ఎస్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ముజ్బుద్దీన్,టిఎస్పిఎస్సి మాజీ బోర్డు మెంబర్ సుమిత్ర ఆనంద్,ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాపరెడ్డి,నాగిరెడ్డిపేట్ మండల మాజీ జెడ్పిటిసి ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి,మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గుర్రాల సిద్దయ్య, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా విశ్వభారతి విద్యానిలయం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని విశ్వభారతి విద్యానిలయంలో 1999-2009 మధ్య ఒకటి నుండి పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ట్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఆత్మీయంగా పలకరించుకొని భావోద్వేగానికి లోనయ్యారు. నాటి విద్యార్థులంతా నేడు వివిధ ఉన్నత స్థాయిలలో ఉండటం పట్ల ఆనంద వ్యక్తం చేశారు. తమ స్థితిగతులను ఒకరినొకరు అడిగి తెలుసుకొని నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల తర్వాత తామంతా ఒకచోట కలుసుకోవటం ఆనందంగా ఉందన్నారు. విద్యతోనే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకలో పాల్గొన్న వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, భరత్, రాజేష్, కిరణ్, వాజిద్, వెంకటమురళీ, అన్వర్, షారుఖ్, వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తుపై రాజకీయం చేయడం సిగ్గుచేటు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** ప్రజలు ప్రకృతి వైపరీత్యంతో కాకావికలం చెందుతే వారిని పరామర్శించడానికి మీకు నెలరోజుల తర్వాత తీరిందా, లేదా స్థానిక ఎన్నికల లబ్ధి కోసమా అనే ప్రశ్నించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పది సంవత్సరాల్లో వర్షాలు వడగళ్ల వాన వల్ల ఎన్నోసార్లు పంట నష్టం జరిగినా ఏ ఒక్కసారి కూడా రైతులను ఆదుకోలేదు. ఇక్కడి ప్రజలపై ప్రేమతో రాలేదు స్థానిక ఎన్నికల్లో పరువు కాపాడుకోవడానికి హరీష్ రావు పర్యటన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హరీష్ రావు పర్యటన పై మాట్లాడుతూ కుటుంబ సమస్యలు నుండి తేరుకొని బాధితులను పరామర్శించడానికి నెల రోజులు పట్టింది. ప్రజల నివాసాలు నీళ్లతో కొట్టుకు పోయి హహకారాలు చేస్తుంటే బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఎటుపోయారు. వర్షాల్లో ప్రమాదమని తెలిసి కూడా ముఖ్యమంత్రి హెలిపాడ్‌లో ముంపు ప్రాంతాలు చూడడానికి వచ్చారు వాతావరణం అనుకూలించక ప్రజలను పరామర్శించలేకపోయారు. తిరిగి రెండు రోజుల్లో వచ్చి నష్టపోయిన రైతులతో మాట్లాడి వారిని పరామర్శించి వారి కుటుంబాలకు తక్షణ సహాయం కింద 11 వేల రూపాయల చొప్పున చనిపోయిన వారి కుటుంబాలకు నాలుగు లక్షలు అందించారు. నాలుగు గంటలలో రోడ్లను మరమ్మతు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రివ్యూ నిర్వహించి అధికారులను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

## భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈమధ్య జిల్లాలో అధిక వర్షాల వలన కలిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు క్షేత్రస్థాయిలో చురుగ్గా వ్యవహరించి ముంపునకు గురయ్యే ప్రాంతాలు, అధికంగా ఓవర్ ఫ్లో అయ్యే ప్రాజెక్టులు, చెరువులు, ప్రమాదకరంగా ప్రవహించే వాగులు, వంకలు, తడిచిపోయిన పాత ఇండ్లు, భవనాలు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తదితర అన్ని ప్రాంతాలను గుర్తించి ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేసి జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూడాలని, అదేవిధంగా గ్రామాలు, మండలాలు మరియు మున్సిపాలిటీల వారిగా ఎప్పటికప్పుడు పరిస్థితులను జిల్లా స్థాయిలో తెలియజేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, చేపలు పట్టుటకు, పశువులు, గొర్రెలను నీటి వనరుల వద్దకు వెళ్ళరాదని ప్రభుత్వ అధికారుల సూచనలను పాటిస్తూ ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 08468-220069కు సమాచారం అందించి జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని సూచించమైనది.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**సూర్యాపేట ప్రతినిధి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని సాహితి హైస్కూల్ కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంను ఆదివారం హొటల్ శ్రీ గ్రాండ్ లో ఘనంగా నిర్వహించారు. 1995-96 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 30ఏళ్ల తర్వాత కలుసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకొని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో నేడు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జెల్లా ప్రసాద్, ఉపాధ్యాయలు శ్రీనివాస్, నాగార్జున, శ్రీనివాస్, విజయలక్ష్మి, ఎలిజబెత్, సంగీత,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కాకా



**మిర్యాలగూడ, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** నిరుపేద కార్మికుల సంక్షేమం కోసం జీవితాంతం కృషి చేసిన నాయకుడు మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకట స్వామి (కాకా) అని అన్నారు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్). కాకా జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక కార్మిక ఉద్యమాలలో ప్రత్యక్ష పోరాటం చేసిన వ్యక్తి కాకా అని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల్లో వెలుగులు నింపిన వ్యక్తి కాకా అని అన్నారు. హైదరాబాదులోని ఎంతోమంది కార్మికులకు నిరుపేదలకు బస్తీలు కట్టించి వారి హృదయాల్లో దేవుడిగా కొలువై ఉన్న వ్యక్తి కాకా అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన వ్యక్తి కాక అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, కోడి రెక్క శౌరి తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు

• **చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి**

**శంకర్‌పల్లి, అక్టోబర్ 5 (జనం సాక్షి) :** వ్యవహరిస్తేశంకర్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో చైర్ పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాశటి చంద్రమోహన్ తో కలిసి మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన కూరగాయలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్కు అమ్ముకోవడానికి తీసుకు వస్తే కమిషన్ ఏజెంట్లు ఇస్తానుసారంగా ముట్టి తీస్తున్నారని, మార్కెట్ కమిటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని,మార్కెట్ ఫీజు అధికంగా వసూలు చేస్తే కూడా లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కూరగాయలకు అరకిలో ఉల్లిగడ్డకు కిలో తీసుకోవాలని సూచించారు. ఏజెంట్లు ముట్టి ఎక్కువగా తీసుకోవడంతో రైతులు శంకరపల్లి మార్కెట్కు బదులుగా పటాన్చెరువు తదితర మార్కెట్లకు



తమ వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకునేందుకు తీసుకు వెళు తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ నిబంధనలకు అనుగుణంగా కమిషన్ ఏజెంట్లు రైతుల నుంచి ముట్టి ఎంత తీయాలి? మార్కెట్కు ఫీజు ఎంత చెల్లించాలి? అనే వివరాలను పాలకవర్గం తీర్మానం చేసి మార్కెట్లో రైతులకు తెలిపే విధంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ డైరెక్టర్ల పదవులను స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అమ్ముకున్నారని కొందరు లేనిపోని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ డైరెక్టర్ పదవులను అమ్ముకున్నట్లు ఆధారాలతో సహా రుజువు చేయాలని, ఎక్కడికి రావాలో స్థలం నిర్ణయిస్తే అక్కడికి వస్తామని అక్కడ నిరూపించాలని వారు సవాల్ విసిరారు. కొంతమంది కమిషన్ ఏజెంట్లు కావాలని లేనిపోని ఆరోపణలు చేస్తూ పాలకవర్గాన్ని బదలాం చేయాలని చూస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకవర్గం రైతులకు మేలు చేసే కార్యక్రమాలను చేపడుతుందని కమిషన్ ఏజెంట్లకు తొత్తులుగా వ్యవహరించదని వారు హెచ్చరించారు. మార్కెట్ కమిటీ ఉన్నతాధికారులు సూచించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయడమే తమ పాలకవర్గ ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మల్లేశం సర్తాజ్,ప్రశాంత్, చంద్రశేఖర్ రెడ్డి శ్రీహరి సంతోష్ తదితరులు ఉన్నారు.






## మొదటి క్రెడిట్ కార్డుకు 45 ఏళ్లు

**ముంబై:**క్రెడిట్ కార్డుల వినియోగం ఈ రోజుల్లో సర్వ సాధారణం అయిపోయింది. ఉద్యోగస్తులు మాత్రమే కాకుండా, వ్యాపారవేత్తలు సైతం వీటిని విరివిగా ఉపయోగిస్తున్నారు.అయితే మనదేశంలో.. క్రెడిట్ కార్డు ఎప్పుడు ప్రారంభమైందనే విషయం బహుశా కొంతమందికి తెలియకపోవచ్చు. ఈ కథనంలో ఆ వివరాలను తెలుసుకుందాం.1980లో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. మొదటి క్రెడిట్ కార్డును జారీ చేసింది. దీనిని సెంట్రల్ కార్డు అని పిలిచేవారు. ఇది వీసా నెట్‌వర్క్ కింద ఉండేది. దీన్ని బట్టి చూస్తే.. ఇండియాలో క్రెడిట్ కార్డు ప్రారంభమైన దాదాపు 45 సంవత్సరాలైందన్నమాట.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం.. ప్రస్తుతం, భారతదేశంలో 11 కోట్లకు పైగా క్రెడిట్ కార్డులు ఉన్నాయి. ఇందులో రెగ్యులర్ కార్డులు, ట్రావెల్ కార్డులు, లైఫ్ స్టైల్ కార్డులు, ఫ్యూయెల్ కార్డులు, సెక్యూర్ కార్డులు యూపీఐ కార్డులు వంటివి అనేకం ఉన్నాయి. వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా.. కావలసిన క్రెడిట్ కార్డులను ఎంచుకుంటారు.

# ఇక ఫోకస్ అంతా 6జీపైనే..

### నుంచి ఇండియా మొబైల్ కాంగ్రెస్


**న్యూఢిల్లీ:**ఈ నెల 8 నుంచి 11 వరకు న్యూఢిల్లీలో నిర్వహించే ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2025 సద స్సులో ప్రధానంగా 6జీ వ్యవస్థను అభివృద్ధి చేయడం, భాగస్వామ్యాలను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెట్టనున్నారు.విశ్వసనీయ భాగస్వామిగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన భారత్, 6జీ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించగలదని డిజిటల్ టెక్నాలజీ ప్లాట్‌ఫాం ఐఎంసీ సీఈవో పి. రామకృష్ణ తెలిపారు.'6జీ వ్యవస్థకు ప్రధానమైన అంశాలను అనుసంధానం చేయగలిగే కీలక ప్లాట్‌ఫాంగా ఇండియా మొబైల్ కాంగ్రెస్ ఎదుగుతోంది. ఇందులో భారత తో పాటు యూరప్, బ్రిటన్, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాల నుంచి పరిశ్రమకు చెందిన



సీనియర్ నేతలు, నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు' అని ఆయన పేర్కొన్నారు. 6జీ సిపోజియంలో టెక్నాలజీ దిగ్గజాలతో పాటు ఐఐటీ, అంతర్జాతీయ యూనివర్సిటీల్లాంటి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల నుంచి విద్యావేత్తలు పాల్గోనున్నారు. 6జీకి సంబంధించిన టెక్నాలజీలు, కృత్రిమ మేథ నెట్‌వర్క్‌లు, స్పెక్ట్రం క్రమబద్ధీకరణ తదితర అంశాలపై అత్యున్నత స్థాయిలో చర్చలు జరపనున్నట్లు రామకృష్ణ చెప్పారు. 7,000 మంది పైగా గ్లోబల్ ప్రతినిధులు, 800 మంది వక్తలు, 150 దేశాల నుంచి 400 మంది ఎగ్జిబిటర్లు ఇందులో పాల్గొంటారని అంచనా. 6జీ గ్లోబల్ రేసుకు భారత్ సారథ్యం వహించనుందని సెల్యులార్ ఆపరేటర్స్ సమాఖ్య సీవోఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ తెలిపారు.ఏఐ, జెన్‌ఏఐ టెక్నాలజీల్లో భారతీయ డిజిటల్ ఆవిష్కరణలు, దేశీయంగా టెలికం రంగాన్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 5జీ విస్తరణ, 6జీ సన్నద్ధతకు 6 గిగాహెట్జ్ బ్యాండ్‌ను సమర్థవంతంగా కేటాయించడం కీలకంగా ఉంటుందని వివరించారు.

## హైదరాబాద్‌లో హార్ట్‌ఫోర్డ్ టెక్నాలజీ సెంటర్

**న్యూఢిల్లీ:**హైదరాబాద్: అమెరికాకు చెందిన బీమా సేవల సంస్థ ది హార్ట్‌ఫోర్డ్ తాజాగా హైదరాబాద్‌లో తమ ఇండియా టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించింది. కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా అధునాతన వర్క్‌స్టేషన్లు, శిక్షణా సదుపాయాలు మొదలైన ప్రత్యేకతలతో దీన్ని రూపొందించినట్లు సంస్థ తెలిపింది.డిజిటల్, కృత్రిమ మేథ సామర్థ్యాలను పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడుతుందని చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ శేఖర్ పన్నాల తెలిపారు.సుశిక్షితులైన టెక్నాలజీ నిపుణుల లభ్యత, గ్లోబల్ ఇన్నోవేషన్ కేంద్రంగా హైదరాబాద్ పేరొందిన నేపథ్యంలో నగరాన్ని ఎంచుకున్నట్లు చీఫ్ డేటా, ఏఐ, ఆపరేషన్స్ ఆఫీసర్ జెఫ్ హాకిన్స్ తెలిపారు. దాదాపు 200 ఏళ్ల పైగా చరిత్ర గల ది హార్ట్‌ఫోర్డ్‌కి ప్రపంచవ్యాప్తంగా 19 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. అమెరికాలోని హార్ట్‌ఫోర్డ్, షికాగో తదితర ప్రాంతాల్లో టెక్నాలజీ కేంద్రాలు ఉన్నాయి.





## డీమార్ట్ లాభాలు హైజంప్..

### - 3 నెలల్లో రూ. 16,219 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ ఆదాయం రూ. 16,219 కోట్లుగా (స్టాండెలోన్) నమోదైంది.గత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నమోదైన రూ. 14,050 కోట్లతో పోలిస్తే 15 శాతం పెరిగింది. త్రైమాసికాలవారీగా క్యూ1లో నమోదైన రూ. 15,932 కోట్లతో పోలిస్తే 1.8 శాతం వృద్ధి చెందినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో కంపెనీ పేర్కొంది.2025 సెప్టెంబర్ ఆఖరు నాటికి మొత్తం స్టోర్స్ సంఖ్య 432గా ఉంది. స్టాండెలోన్, కన్సాలిడేటెడ్ ఫలితాలను ఆమోదించేందుకు అక్టోబర్ 11న కంపెనీ బోర్డు మసావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో డీమార్ట్‌కి కార్యకలాపాలు ఉన్నాయి.




## బిట్‌కాయిన్ సరికొత్త రికార్డ్..

### - ఆల్‌టైమ్ గరిష్టాలకు చేరిన ధర

**వాషింగ్టన్:**అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా.. పెట్టుబడిదారులలో ఆందోళన మొదలైంది. డాలర్ విలువ రోజురోజుకి తగ్గుముఖం పట్టింది. ఈ తరుణంలో బిట్‌కాయిన్ వాల్యూ ఆదివారం ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకొని..1,25,000 డాలర్ల మార్కును దాటింది. అంటే భారతీయ కరెన్సీ ప్రకారం ఒక బిట్‌కాయిన్ విలువ సుమారు రూ. 1.08 కోట్లు.ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీ అయిన బిట్‌కాయిన్ విలువ తాజాగా 1,25,689 డాలర్లకు చేరుకుంది. ఆగస్టు 14న నెలకొల్పిన 1,24,514 రికార్డును సైతం.. ఇప్పుడు అధిగమించింది. ప్రస్తుత పరిస్థితులు బిట్‌కాయిన్ విలువను అమాంతం పెంచే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా అమెరికా స్టాక్‌లలో లాభాలు, బిట్‌కాయిన్ లింక్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి ఇన్‌ఫ్లోలు పెరిగాయి.ఇటీవల ప్రారంభమైన ప్రభుత్వ షట్‌డౌన్.. డబ్బును సురక్షితమైన ఆస్తులలో పెట్టుబడి పెట్టేలా చేసింది. మార్కెట్ వర్గాలు దీనిని 'డీబేస్‌మెంట్ ట్రేడ్' అని పిలుస్తున్నారు. "ఈక్విటీలు, బంగారం, పోకీమాన్ కార్డుల వంటి సేకరణలతో సహా అనేక ఆస్తులు ఆల్ టైమ్ గరిష్టాలను తాకాయి. డాలర్ విలువ తగ్గడం.. బిట్‌కాయిన్ విలువ పెరగడంలో ఆశ్చర్యం ఏమీ లేదు" అని జాషువా లిమ్ అన్నారు.

## రెనోలో 3000 మంది బయటకు

### - కారణం ఇదే..

**ముంబై:**ప్రముఖ ఫ్రెంచ్ కార్ల తయారీ సంస్థ రెనాల్ట్.. ప్రపంచవ్యాప్తంగా 3,000 మంది ఉద్యోగులను తొలగించడానికి సిద్ధమవుతోంది. ఈ ఏడాది చివరి నాటికి ఈ తొలగింపులకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది.రెనాల్ట్ కంపెనీ.. హెచ్‌ఆర్, ఫైనాన్స్, మార్కెటింగ్ విభాగాల్లో ఉద్యోగులను తొలగించనుంది. మొత్తం మీద సంస్థ తన మొత్తం ఉద్యోగులలో 15 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ తొలగింపులు సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు.. ప్రపంచ వ్యాప్తంగా ఇతర ప్రదేశాలలో కూడా ఉన్నాయి. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగానే కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.రెనాల్ట్ కంపెనీ 2024 చివరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 98,636 మంది సిబ్బందిని నియమించింది. "ఆటోమోటివ్ మార్కెట్‌లోని అనిశ్చితులు.. పోటీ వాతావరణం దృష్ట్యా, మా కార్యకలాపాలను సరళీకృతం చేయడానికి తగిన మార్గాలను పరిశీలిస్తున్నాము. ఇందులో భాగమని లేఆఫ్స్ కూడా చేయడానికి చూస్తున్నట్లు" రెనాల్ట్ ప్రతినిధి పేర్కొన్నారు.రెనాల్ట్ జూలై ఆర్థిక నివేదిక ప్రకారం.. కంపెనీ ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో 11.2 బిలియన్ యూరోల (13 బిలియన్ డాలర్లు) నష్టాన్ని చవిచూసింది.

## సరికొత్త బ్రిక్స్‌టన్ బైక్ ..'స్టోర్ 500'



**ముంబై:**బ్రిక్స్‌టన్ మోటార్ సైకిల్స్.. తన మొట్టమొదటి మిడ్-కెపాసిటీ అడ్వెంచర్ మోటార్ సైకిల్ అయిన 'స్టోర్ 500'ను ఆస్ట్రియాలోని తన ప్రధాన కార్యాలయంలో అధికారికంగా ఆవిష్కరించింది.ఈ బైక్ కోసం ప్రీ-బుకింగ్‌లు డిసెంబర్ 2025లో ప్రారంభమవుతాయి. ఆ తరువాత డెలివరీ ఎప్పుడనే విషయాన్ని సంస్థ వెల్లడించనుంది. ముందుగా బుక్ చేసుకున్నవారికి.. ముందుగా డెలివరీలు జరుగుతాయని సంస్థ వెల్లడించింది.బ్రిక్స్‌టన్ స్టోర్ 500 బైక్.. 486 సీసీ లిక్విడ్-కూల్డ్, ప్యారలల్-ట్విన్ ఇంజిన్ ద్వారా 8500 ఆర్పీఎం వద్ద 47.6 బీహెచ్‌పీ పవర్, 6750 ఆర్పీఎం వద్ద, 43 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ బైక్ యూఎస్డీ ఫ్రంట్ ఫోర్క్, సెంట్రల్ రియర్ మోనోషాక్ వంటి సస్పెన్షన్ సెటప్ పొందుతుంది. డ్యూయల్ ఛానల్ ఏబీఎస్‌తో డిస్క్ బ్రేక్‌లు ఈ బైకులో ఉంటాయి.ఫీచర్స్ విషయానికి వస్తే.. కనెక్టివిటీ ఎంపి కలతో కూడిన 5 ఇంచెస్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే, ఎల్ఈడీ డీఆర్ఎల్ ఇండికేటర్స్, ఇంటర్నల్ ఫాగ్ ల్యాంప్స్, యూఎస్బీ ఛార్జింగ్ పోర్ట్ మొదలైనవి ఈ బైకులో ఉన్నాయి. అయితే కంపెనీ ఈ బైకుని ఇండియన్ మార్కెట్లో లాంచ్ చేస్తుందా?, లేదా అనేది వెల్లడించలేదు.

# బోయింగ్‌లో మళ్లీ సాంకేతిక సమస్య

### ఎయిర్ ఇండియా విమామానికి తప్పిన పెనుముప్పు.. • పైలట్ల చాకచక్యంతో ప్రయాణికులు సేఫ్

**బర్మింగ్‌హామ్:** ఎయిర్ ఇండియా విమానానికి కొద్దిపాటిలో పెను ప్రమాదం తప్పిన ఉదంతం చోటుచేసుకుంది. భారత్‌లోని అమృత్‌సర్ నుంచి బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌కు బయలుదేరిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానంలో గాలిలో ఉన్న సమయంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ల్యాండింగ్ కోసం విమానం కిందకు దిగుతున్న సమయంలో దానిలోని అత్యవసర పవర్ యూనిట్ 'ర్యామ్ ఎయిర్ టర్బైన్' (ఆర్ఏటీ) ఊహించని రీతిలో తెరుచుకుంది. అయితే, పైలట్లు అప్రమత్తమై ఎంతో చాకచక్యంతో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఏఐ117 విమానంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బర్మింగ్‌హామ్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు ఉపక్రమిస్తున్న తరుణంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమై పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ




ఘటనలో విమానంలోని ప్రయాణికులుగానీ, సిబ్బంది ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. 'అమృత్‌సర్ నుంచి బర్మింగ్‌హామ్‌కు వెళుతున్న ఏఐ117 విమానం ల్యాండ్ అవుతున్న సమయంలో టర్బైన్ తెరుచుకున్నట్లు మా సిబ్బంది గుర్తించారు. అయితే ఆ సమయంలో విమానంలోని ఇతర వ్యవస్థలన్నీ సాధారణంగానే పనిచేస్తున్నాయి. మొత్తానికి విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది' అని పేర్కొంది.ల్యాండింగ్ అనంతరం విమానంలో నిపుణులతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టినట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది. ఈ అంతరాయం కారణంగా బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన ఏఐ114 విమాన సర్వీసును రద్దు చేసినట్లు తెలిపింది. కాగా ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని పేర్కొంది. సంస్థకు ప్రయాణికుల భద్రతే ముఖ్యమని ఎయిర్ ఇండియా మరోమారు స్పష్టం చేసింది.

### 20 ఏళ్ల తర్వాత సందర్శకుల కోసం

## ఫారో చక్రవర్తి సమాధి

లుక్సార్: ఈజిప్టులోని లుక్సార్ నగరంలో ఫారో చక్రవర్తి సమాధిని రెండు దశాబ్దాల అనంతరం సందర్శకుల కోసం శనివారం తిరిగి తెరిచారు. ఈజిప్టును క్రీస్తు పూర్వం 1390-1350 మధ్యన పాలించిన అమెన్‌హోటెప్-3 సమాధి 'ప్రఖ్యాత వాలీ ఆఫ్ కింగ్స్'లో పశ్చిమ దిక్కున ఉంది.దీనిని 1799లో గుర్తించారు. ఇందులోని ప్రధానమైన సార్కోఫాగస్ (మమ్మీ) సహా ముఖ్యమైన వస్తువులు లూటీకి గురయ్యాయని ఈజిప్షియన్ యాంటిక్విటీస్ అథారిటీ తెలిపింది. జపాన్ ఆర్థిక, సాంకేతిక సాయంతో రెండు దశాబ్దాలపాటు మూడు దఫాలుగా ఈ సమాధి పునరుద్ధరణ పనులు సాగాయి.ఫారో, ఆయన భార్య సమాధి గోడలపై ఉన్న చిత్రాలకు రంగులు అద్దడం కూడా ఇందులో ఉన్నాయి. సార్కోఫాగస్‌ను ఉంచిన భారీ పెట్టె ఫ్రేమ్ కూడా ఇందులో ఉంది. వ్యాలీ ఆఫ్ కింగ్స్ ప్రాంతంలో 36 మీటర్ల పొడవు, 14 మీటర్ల లోతున మెట్ల దారి సమాధికి దారి తీస్తుంది. ఇందులో చక్రవర్తిని ఉంచిన ప్రధాన సమాధి ఛాంబర్‌తోపాటు ఆయన ఇద్దరు భార్యలకు రెండు ఛాంబర్లున్నాయి.



## బంగారం ఇక మరింత భారం

### • ఈ దీపావళికి కొనడం కష్టమే..

**న్యూఢిల్లీ:**దీపావళి సమీపిస్తున్న కొద్దీ, బంగారం, వెండి ధరలు చారిత్రాత్మక గరిష్టాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, పండుగ డిమాండ్, సెంట్రల్ బ్యాంక్ విధానాల వల్ల పసిడి ధరలు మరింత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో బంగారం ధరలు ఇప్పటికే 10 గ్రాములకు రూ .1,18,000 దాటగా, వెండి కిలోకు రూ .1,44,000 దాటింది. దీపావళి రోజు అంటే అక్టోబర్ 21 నాటికి బంగారం రూ .1.22 లక్షలు, వెండిరూ .1.50 లక్షలకు చేరుకుంటాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.అంతర్జాతీయంగా, బంగారం ఔన్స్ కు 3950-4000 డాలర్లకు చేరుకుంటుందని, అలాగే వెండి ఔన్స్ కు 49- 50 డాలర్లకు పెరుగుతుందని అంచనా. ఈ ధరల వేగానికి విశ్లేషకులు చెబుతున్న కారణాలు.. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ డోవిష్ (తక్కువ వడ్డీ రేట్లు, వృద్ధికి ప్రాధాన్యం) వైఖరి, బలహీనపడుతున్న అమెరికన్ డాలర్, బలమైన ఈటీఎఫ్ ఇన్‌ఫ్లోలు, భారతదేశ పండుగ, వివాహ సీజన్ల నుండి బలమైన డిమాండ్. సౌరశక్తి, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ టెక్నాలజీస్ వంటి రంగాల నుండి పెరుగుతున్న పారిశ్రామిక డిమాండ్ కూడా వెండి ర్యాలీకి మద్దతు ఇస్తోంది. సరఫరా పరిమితులు, రూపాయి విలువ తరుగుదల మరింత ఊపందుకుంటోంది.

## అది బంగారం కాదు రాగి

### • శబరిమల టీడీబీ కేసులో ఉన్నికృష్ణన్ వెల్లడి

**తిరువనంతపురం:** శబరిమల బంగారు పూత వివాదంలో విజిలెన్స్ ముందు ఆరోపణలను ఉన్నికృష్ణన్ పొట్టి ఖండించారు. అంతకుముందు చెప్పినట్టే తన ప్రకటనను పునరావృతం చేస్తూ తనకు అందినవి రాగి పలకలని చెప్పాడు.ఉన్నికృష్ణన్ పొట్టి ప్రకారం.. అధికారుల పొరపాటు వల్ల ఈ సంఘటన జరిగింది. పత్రాలలో నమోదు చేయబడినట్లుగా అధికారులు రాగి పలకలను అందజేశారని, అధికారిక తప్పిదానికి తనను ఎందుకు నిందిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా దేవస్థానం మాన్యువల్ గురించి తనకు తర్వాతే తెలిసిందని పొట్టి అన్నారు. దేవస్థానం విజిలెన్స్ నిన్న ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ఉన్నికృష్ణన్ పొట్టిని దాదాపు నాలుగు గంటల పాటు విచారించారు. దర్యాప్తుకు తాను పూర్తిగా సహకరించానని , విచారణ బృందం అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చానని ఆయన మీడియాకు తెలిపారు. ఎస్పీ సునీల్ కుమార్ నేతృత్వంలో ఈ వాంగ్మూలాన్ని నమోదు చేశారు.అయితే , పొట్టి



ప్రకటనలు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డును క్లిష్ట పరిస్థితిలో ఉంచాయి. ఆలయం నుండి అప్పగించబడిన రాగి షీట్లు అని ఆయన ప్రధాన వాదనగా ఉంది. ఇది.. 1999లో గ్రూప్ ఛైర్మన్ విజయ్ మాల్యా బంగారు పూత పూసినట్లు నిర్ధారించబడిన రికార్డులకు విరుద్ధంగా ఉంది. ద్వారపాలక శిల్పాల నుండి వచ్చిన అసలు బంగారు పూత పూసిన ప్యానెల్‌కు ఏం జరిగిందో బోర్డు ఇంకా స్పష్టం చేయలేదు. ఇంతలో ఈ కేసుపై ప్రాథమిక విచారణ నిర్వహించడంపై పోలీసులు న్యాయ సలహా కోరుతున్నారు. అనుమతి లభించిన తర్వాత పతనంతిట్ట పోలీసు సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ప్రాథమిక దర్యాప్తు ప్రారంభమవుతుంది.శబరిమలలో బంగారం దుర్వినియోగంపై కేరళలోని ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర విమర్శలు వస్తుండటంతో ఈ అంశంపై సంపూర్ణ దర్యాప్తునకు ఆదేశించాలని హైకోర్టుకు వెళ్లనున్నట్లు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు పీఎస్ ప్రశాంత్ శనివారం ప్రకటించారు. శబరిమల ఆలయానికి బంగారు తాపడం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. దీనిపై ప్రశాంత్ స్పందిస్తూ.. బోర్డును రాజకీయాల్లోకి లాగటానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 1998లో ఆలయానికి బంగారు తాపడం ప్రాజెక్టుకు ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా స్పాన్సరర్‌గా వ్యవహరించారని, అప్పటి నుంచి ఈ ప్రాజెక్టులో ఏం జరిగిందో పూర్తిగా దర్యాప్తు జరిపించాలని కోర్టును కోరనున్నట్లు వెల్లడించారు. ఆలయ ద్వారపాలక విగ్రహాలకు బంగారు తాపడం పలకలను మార్చేందుకు చెన్నైకి పంపటంలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని స్పష్టంచేశారు.

## ఫాస్టాగ్ లేకపోతే డబుల్ ఛార్జ్..

**ముంబై:**జాతీయ రహదారులపై వెళ్లే వాహనదారులు తమ వాహనాలకు ఫాస్టాగ్ లేకపోతే డబుల్ ఛార్జ్ చెల్లించాల్సి ఉంటుంది. ఫంక్షనల్ ఫాస్టాగ్‌లు లేని వాహనాలు లావాదేవీలో నగదును ఉపయోగిస్తే రెట్టింపు రుసుము చెల్లించాలి.అదే యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) ద్వారా చెల్లిస్తే వినియోగదారు రుసుముకు 1.25 రెట్లు మాత్రమే వసూలు చేస్తారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంతోపాటు జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద నగదు లావాదేవీలను తగ్గించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సవరించిన జాతీయ రహదారుల రుసుము (రేట్లు, వసూళ్ల నిర్ణయం) నిబంధనలు, 2008 ప్రకారం.. చెల్లుబాటు అయ్యే, ఫంక్షనల్ ఫాస్టాగ్ లేకుండా ఫీజు ప్లాజాలోకి ప్రవేశించే వాహనాలు యూపీఐ ద్వారా చెల్లింపును ఎంచుకుంటే ఆ వాహన కేటగిరికి వర్తించే వినియోగదారు రుసుము కంటే 1.25 రెట్లు మాత్రమే వసూలు చేస్తారని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ తెలిపింది.కొత్త ఫీజుల విధానం నవంబర్ 15 నుండి అమల్లోకి వస్తుంది. "ఈ సవరణ ఫీజు వసూలు ప్రక్రియను బలోపేతం చేయడం, టోల్ వసూలులో పారదర్శకతను పెంచడంతోపాటు జాతీయ రహదారి వినియోగదారులకు ప్రయాణ సౌలభ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది" అని రోడ్డు రవాణా శాఖ పేర్కొంది.




## 8న భారత్‌కు కీర్ స్టార్మర్

### 8, 9వ తేదీల్లో పర్యటించనున్న బ్రిటిష్ ప్రధాని

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఈ నెల 8, 9వ తేదీల్లో భారత్‌లో పర్యటించబోతున్నారు. ఈ నెల 9న ముంబైలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన సమావేశ మవుతారు.విజన్-2035 రోడ్‌మ్యాప్‌లో భాగంగా భారత్, యూకే మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి చేపట్టిన చర్యల పురోగతిని వారు సమీక్షిస్తారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చిస్తారు. ముంబైలో గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో స్టార్మర్ ప్రసంగిస్తారు. స్టార్మర్ గత ఏడాది జూలైలో బ్రిటిష్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.



### దగ్గుమందుతో చిన్నారుల మృతి..

## కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అత్యవసర సమావేశం

**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో 14 మంది చిన్నారుల మరణానికి కారణమైన దగ్గు మందులపై చర్చించేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించనున్నదని సంబంధిత అధికారులు తెలిపారు.దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఆరోగ్య కార్యదర్శులు, డ్రగ్ కంట్రోలర్లు పాల్గొనే ఈ సమావేశానికి కేంద్ర ఆరోగ్య కార్యదర్శి అధ్యక్షత వహించనున్నారు.మీడియాకు అందిన వివరాల ప్రకారం.. ఈ సమావేశంలో ఈ తరహా దగ్గు మందుల నియంత్రణ చర్యలను బలోపేతం చేయడం, దేశంలో ఔషధ ఉత్పత్తుల భద్రత, నాణ్యతను నిర్ధారించడంపై చర్చించనున్నారు. ముఖ్యంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సాధారణంగా సిఫార్సు చేసే దగ్గు మందులపై విశ్లేషణ చేయనున్నారు. మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో 14 మంది చిన్నారులు కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ తీసుకున్న తర్వాత మూత్రపిండాల వైఫల్యం కారణంగా మరణించారు. ఔషధ నమూనాలలో 48.6 శాతం డైథిలిన్ గ్లైకాల్ ఉందని, ఇది అత్యంత విషపూరిత పదార్థమని అధికారులు తెలిపారు.ఈ ఘటన దరిమిలా మధ్యప్రదేశ్ ప్రభుత్వం శనివారం కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ అమ్మకాలను నిషేధించింది.కోల్డ్‌రిఫ్ సిరప్‌కు తమిళనాడులో సంబంధిత ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించగా, దానిలో డైథిలిన్ గ్లైకాల్ అనే రసాయనం ఉందని, దీనిని తీసుకున్నప్పుడు తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యం సంభవిస్తుందని, చివరికి మరణానికి కారణమవుతుందని నిపుణులు తెలిపారు.
ఈ నివేదిక అనంతరం మధ్యప్రదేశ్ ప్రభుత్వం తమిళనాడులోని సిరప్ తయారీ సంస్థ శ్రేసన్ ఫార్మాస్యూటికల్ కు చెందిన ఇతర ఔషధ ఉత్పత్తుల అమ్మకాలపై నిషేధం ప్రకటించింది. దగ్గు మందు కారణంగా చిన్నారులు మరణించిన ఉదంతంలో చింద్వారాకు చెందిన ఒక వైద్యుడిని అరెస్టు చేశారు.

**రాజస్థాన్‌లో..**

రాజస్థాన్‌లోని భరత్‌పూర్, సికార్‌లలో డెక్స్ట్రోమెథోర్ఫాన్ హెచ్‌బీఆర్ సిరప్ కారణంగా చిన్నారులు అనారోగ్యం బారిన పడ్డారని తెలియడంతో జైపూర్‌లోని కేసన్ ఫార్మా సరఫరా చేసిన 19 రకాల మందులను నిలిపివేసినట్లు రాజస్థాన్ ఆరోగ్య మంత్రి గజేంద్ర సింగ్ ఖీన్వ్‌సర్ తెలిపారు. సిరప్ తీసుకున్న తర్వాత బాధితులు వాంతులు, తల తిరగడం, మూర్ఛపోవడం లాంటి సమస్యలకు లోనయ్యారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య శాఖ వెంటనే ఈ ఔషధాలను నిషేధించి, రాష్ట్ర ఔషధ పరీక్షా ప్రయోగశాలకు నమూనాలను పంపిందని మంత్రి తెలిపారు. కాగా డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా తన తాజా సూచనలో డెక్స్ట్రోమెథోర్ఫాన్‌ను రెండేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ఇవ్వకూడదని, ఐదేళ్ల కన్నా ఎక్కువ వయస్సు ఉన్న వారికి మాత్రమే సూచించాలని తెలిపింది.

# కాంగ్రెస్ పార్టీలోకాకా సేవలు ప్రశంసనీయం

- మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి : ఎమ్మెల్యే విజయరమణారావు
- ఎస్సీ కాలనీ అభివృద్ధికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే
- నామినేటెడ్ పదవి కోసం శ్యాంసుందర్ వేడుకోలు
- రోగులకు పండ్లు పంపిణీతో సేవా కార్యక్రమాలు





**సుల్తానాబాద్,అక్టోబర్ 05 (జనంసాక్షి) :** పెద్దపల్లి పార్లమెంటు పరిధి అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన కాంగ్రెస్ దిగ్గజం గడ్డం వెంకటస్వామి (కాక) సేవలు ప్రశంసనీయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాక విగ్రహం వద్ద 96వ జయంతి వేడుకలు అంగ రంగ వైభవంగా ఘనంగా జరిగాయి. మున్సిపల్ కమిషనర్ తిప్ప రాజు రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి, గజమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెద్దపల్లి నుంచి ఏడుసార్లు ఎంపీగా ఎన్నికైన కాక, రెండు పర్యాయాలు మంత్రిగా ప్రాంత అభివృద్ధికి నిబద్ధుడని కొనియాడారు. కార్మిక శాఖ మంత్రిగా సింగరేణి కార్మికులకు పెన్షన్ విధానం తీసుకువచ్చారు. పౌరసరఫ రాల శాఖలో రేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఏఐసీసీ పెద్దలను ఒప్పించి, చిరకాల వాంఛను సాకారం చేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. కేంద్ర కార్మిక మంత్రిగా కార్మికులకు అమూల్య సేవలు అందించి పేరు ప్రఖ్యాతులు సంపాదించారని చెప్పారు. ఆయన అడుగుజాడల్లో కుమారుడు గడ్డం వివేక్ వెంకటస్వామి పార్లమెంటు సభ్యునిగా, మరో కుమారుడు గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లి ఎంపీగా ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సజ్జాద్, మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్, రైతు సెల్ మండల అధ్యక్షులు పన్నాల రామన్న, అమిరిశెట్టి రాజలింగం, అమిరిశెట్టి తిరుపతి, మస్త్యాల రవీందర్, బిరుదు కృష్ణ, గాజుల రాజమల్లు, కల్వల శ్రీనివాస్, న్యాతరి శ్రీనివాస్, ఐఎన్‌టియూసి జిల్లా ఉపాధ్యక్షులు నీరట్ శంకర్, ఆరెపల్లి రాహుల్, వేగోళం అబ్బయ్య గౌడ్, పడాల అజయ్ గౌడ్, మేకల పోషాలు, తొర్రి కొండప్రభాకర్, పన్నాల తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గజబింకర్ జగన్, గ రిగే శ్రీనివాస్, కల్లేపల్లి జానీ, కోడి కనకయ్య, చందర్, ప్రకాష్, వినుకొండ శ్రీధర్ పటేల్, పొన్నం చంద్రయ్య గౌడ్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మేనేజర్ అలీముద్దీన్‌తో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాక జన్మదిన సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఐఎన్‌టియూసి జిల్లా ఉపాధ్యక్షులు నీరట్ శంకర్, గాజుల రాజమల్లు, న్యాతరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలు జరిపారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాజుల రాజమల్లు, న్యాతరి శ్రీనివాస్, ఆరేపల్లి రాహుల్, కరుణాకర్, కిరణ్, శ్రీనివాస్, వెంకటేష్, స్వామి, నీరట్ శ్యామ్‌తో పాటు అభిమానులు భాగస్వాములయ్యారు. మరోవైపు, సుల్తానాబాద్ మున్సిపల్ ఆరవ వార్డు సుభాష్ నగర్ ఎస్సీ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయరమణారావు హామీ ఇచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో కాలనీ నాయకులు పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పట్టా సర్టిఫికెట్ల మంజూరు, అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణం పూర్తి, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీలు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు, అంబేద్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటు వంటి డిమాండ్లు చేశారు. అంబేద్కర్ సంఘం సీనియర్ నేత న్యాతరి ప్రభాకర్, ఎస్సీ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు న్యాతరి శ్యాంసుందర్, మాజీ వార్డు సభ్యులు ఆరేపల్లి ఇలా రావు, న్యాతరి శ్రీనివాస్, మహంకాళి శంకరయ్య, న్యాతరి జయరాజు, చిలుముల లక్ష్మణ్, న్యాతరి కాళీ చరణ్, ఆరేపల్లి కొమురయ్య, న్యాతరి స్వామి, కల్వల రాజు, కల్లేపల్లి దేవేందర్, న్యాతరి రమేష్, మామిడిపల్లి నంబయ్యలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అదే సమయంలో, గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్న ఎస్సీ సెల్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు న్యాతరి శ్యాంసుందర్‌కు నామినేటెడ్ పదవి ఇప్పించాలని ఎమ్మెల్యే విజయ రమణారావుకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థి దశ నుంచి ఎన్ఎస్‌యూఐలో అంచలాంచలుగా పనిచేసిన శ్యాంసుందర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా క్రియాశీలకంగా ఉన్నారని, అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ ఆందోళనల్లో భాగమైనారని తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేశానని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ డైరెక్టర్ పదవి కోరుతూ, సుశిక్షిత కార్యకర్తగా గుర్తించాలని వేడుకున్నారు.

### రిజర్వేషన్ల వ్యవహారం ఆశావహులకు

# ముందు నుయ్యి.. వెనుక గొయ్యి

- ఒకవైపు కోర్టు కేసులు..మరో వైపు ఎన్నికల షెడ్యూలు.
- అయోమయంలో ఆశావాహులు..!
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా కుటుంబ కులగణన సర్వేలో బీసీ జనాభా 56.33 శాతం ఉన్నట్లు అధికారికంగా తేలిందని బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ అన్నారు. ఆదివారం అయన మాట్లాడు తూ బీసీలకు జనాభా దామాషా ప్రకారం స్థానిక ఎన్నికల్లో, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండగా,కే వలం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఉభయ సభల్లో ఏకగ్రీవంగా తీర్మానం చేసి 2 బీసీ బిల్లులను గవర్నర్ ద్వార కేంద్రానికి, రాష్ట్రపతికి ఆమోధంకై పంపించడం జరిగిందన్నారు. అట్టి బిల్లులు ఆమోదం పొందక పోవడంతో 2018లో తీసుకువచ్చిన పంచాయతీ, మున్సిపల్ చట్టాలను సవరిస్తూ,రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చి,గత అసెంబ్లీలో చట్టాలను సవరించి గవర్నర్ ఆమోదం కోసం పంపిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదముద్ర వేయకపోవడం బాధాకరమన్నారు. 2010లో ఐదుగురు జడ్జీలతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ,ఎస్టీ,బీసీ రిజర్వేషన్లు మొత్తం కలిపి 50 శాతం రిజర్వేషన్లు దాటకూడదని షరతులు విదించి తీర్పు నివ్వడంతో,రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావించి,ప్రత్యేక జీవో 9ని జారీ చేసి ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో జీవో 9 ద్వార రిజర్వేషన్లను పెంచడం చెల్లుబాటు కాదని కొందరు హైకోర్టులో,సుప్రీం కోర్టులో కేసులు వేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 6న సుప్రీం కోర్టులో, 8న హైకోర్టులో కేసు విచారిస్తామని కోర్టులు తెలువడంతో, అనుకూలంగా తీర్పు వస్తుందా,వ్యతిరేకంగా తీర్పు వస్తుందా, వ్యతిరేకంగా తీర్పు వస్తే 9 న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తారా,లేక ఎన్నికలు వాయిదా వేస్తారా,పాత బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు జరుపుతారా, 42 శాతం కొత్త రిజర్వేషన్లతో పార్టీ పర రిజర్వేషన్లు కల్పిస్తారన్న సందేహాలతో ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు ఆందోళన చెందుతున్నారన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుల అమల్లో ముందుండి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న అఖిలపక్షం కోర్టుల్లో జీవో 9 అమలుకు కోర్టులను, గవర్నర్ను,కేంద్రాన్ని,రాష్ట్రపతిని ఒప్పించి బీసీలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని అయన కోరారు.

# కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

### స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి : పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య



**కమ్మర్పల్లి 05 అక్టోబర్ (జనంసాక్షి) :** కమ్మర్పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆదివారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానిక ఎన్నికలు సజావుగా జరగడానికి కావలసిన అన్నిరకాల ముందస్తు ఏర్పాట్లను చేసుకోవాలని, గత ఎన్నికలలో నేర ప్రవృత్తి కలిగిన వారిని ముందుగానే గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిదిలో గల పోలింగ్ స్టేషన్స్ ,పోలింగ్ లోకేషన్స్ గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రతి పోలింగ్ స్టేషన్ ను తప్పనిసరిగా సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకొని పోలింగ్ కేంద్రాలలో ఉండవలసిన కనీస వసతుల గురించి సమాచారం అందించాలని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల బ్యారక్ లను తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల ఫైల్స్‌ను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పోలీస్ విభాగము నిర్విరామముగా నిర్వహిస్తున్న పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల యొక్క భద్రత మరియు శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు ఇవ్వడం జరిగింది. పోలీస్ స్టేషన్ పరిధిలోని రికార్డ్ లను పరిశీలిస్తూ,అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని ప్రతి కేసులో నాణ్యమైన,ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని,సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు ,కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని చెప్పారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి అట్టి గ్రామాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలి అన్నారు. కమ్మర్పల్లి పోలీస్ స్టేషన్ జిల్లా బోర్డర్ సరిహద్దు లో ఉన్నందున అక్కడి నుండి ఇక్కడికి వచ్చి వెళ్లే వారిపై నిఘా వ్యవస్థ పటిష్ట పరిచి అక్కడి పోలీసు సిబ్బందితో సత్సంబంధాలు మెరుగుపరుచుకోవాలని ఆదేశాలు జారిచేసారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ,సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సిబ్బందిని కి పలు అధికారులు 24×7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని,సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట భీంగల్ సీఐ పి. సత్యనారాయణ,కమ్మర్పల్లి ఎస్సై జి.అనిల్ రెడ్డి ,హెడ్ కానిస్టేబుల్,కానిస్టేబుల్స్ సిబ్బంది ఉన్నారు.

# రుద్రంగి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

### కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన ప్రభుత్వ విప్



**రుద్రంగి అక్టోబర్ 5 (జనం సాక్షి) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రుద్రంగి గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగరాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో శుభం గార్డెన్స్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పలు సూచనలను దిశా నిర్దేశం చేశారు. వారు మాట్లాడుతూ... ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిధులు ఖర్చు చేస్తోంద న్నారు. కార్యకర్తలు నాయకులు చెప్పే సూచనలు సలహాలు స్వీకరిస్తూ ముందుకు పోతామన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడుగా పని చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికల్లో అవకాశం రానివారు ప్రస్తుతం అవకాశం వచ్చినా అభ్యర్థుల గెలుపునకు దోహదం చేయాల న్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతం, వారు దిగజారి మాట్లాడే మాటలు పట్టించుకోకుండా ముందుకు పోవలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేద ప్రజలకు అందేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ ప్రజలకు చేరువలో ఉండాలన్నారు. రుద్రాంగి బిడ్డగా ఇక్కడి నుండి గెలిచి అనేక నిధులు తీసుకవచ్చామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య..



**గంభీరావుపేట అక్టోబర్05 (జనం సాక్షి):**
గంభీరావుపేట మండలంలోని మాచర్ల గ్రామంలో జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకుంది, పోలీసుల వివరాల ప్రకారం ముచెర్ల గ్రామానికి చెందిన కొల సతీష్ తండ్రి అంతయ్య వయస్సు(38) ముదిరాజ్ అను నతడు జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశం వెళ్లి తిరిగి నాలుగు సంవత్సరాలు క్రితం ఇంటికి తిరిగి వచ్చినాడు, అప్పటినుండి ఏ పని చేయక తాగుడికి బానిసై ఆర్థిక సమస్యలతో మానసికంగా కృంగిపోయి జీవితం పై విరక్తి చెంది ఈరోజు ఉదయం దాదాపు 6 గంటలకు తన ఇంటిలో ఫ్యాన్ కు చీరతో ఉరివేసుకొని చనిపోయినాడు అని భార్య కోల జ్యోతి ఫిర్యాదు ఇవ్వగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.



# ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల ఎంపికపై ఎంఐఎం కసరత్తు

**ఎడపల్లి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలపై ఆదివారం ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, వార్డు మెంబర్ల పేర్లను ఖరారు చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఫయాజుద్దీన్, ఎడపల్లి మండల అధ్యక్షులు రహీం అలీ, మండల కార్యదర్శి షేక్ ఆసిఫ్, అబ్దుల్, ఇమ్రాన్, షేక్ నజీర్, ఇఫ్తార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి అసదుద్దీన్ ఒవైసీ రానున్నట్లు మండల అధ్యక్షులు రహీం అలీ తెలిపారు.

# బోధన్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం




**బోధన్, అక్టోబర్ 5 ( జనంసాక్షి ) :** బోధన్ మండలంలోని సంగం, మినార్ పల్లి, ఆమ్దాపూర్, బోధన్, పెంటాకలాన్ సహకార సంఘాలలో ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మానిటరింగ్ అధికారి జి అరుణ్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే వరి మద్దతును పొందాలని అరుణ్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శులు హన్మాండ్లు, అశోక్ కుమార్, రాజేశ్వర్, ఉమాకాంత్, బాబా, సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల బాలుడు

- డాక్టర్లు పరీక్షించి స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీ వ్యాధిగా నిర్ధారణ
- రూ.16 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా
- నిరుపేద కుటుంబంలో విచిత్ర పరిణామం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిసార్ ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు




**బొంరాస్ పేట, అక్టోబర్ 5 (జనం సాక్షి):** రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబంలోని ఐదేళ్ల బాలుడు వింత వ్యాధితో బాధపడుతున్న సంఘటన వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం వడిచర్ల పరిధిలోని ఊరేనికితాండలో చోటు చేసుకుంది. తాండాకు చెందిన మూడవత్ గోరీబాయి శ్రీను దంపతులు తాండూరు పట్టణంలోని సాయిపూర్ కాలనీలో నివాసం ఉంటూ శ్రీను సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత నెల రోజుల నుండి కుమారుడు జగన్ కు ఆరోగ్య సమస్య రావడంతో హైదరాబాద్లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అరుదైన ప్రాణాంతక స్పైనల్ మస్కులర్ ఆట్రోపీ వ్యాధి సోకిందని తల్లిదండ్రులకు తెలిపారు. ఈ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పరిస్థితి దయనీయంగా మారి కూర్చోవడం,మింగడం,శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ వ్యాధికి సంబంధించి చికిత్సలో భాగంగా జోల్జన్మా ఇంజక్షన్ కు రూ.16 కోట్లు ఖర్చవుతుందని వైద్యులు తెల్పి చెప్పారు. ఇటువంటి ప్రాణాంతకమైన వ్యాధి గతంలో ఓ అమ్మాయికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాలో సోకిందని గతంలో ఉన్న అప్పటి ప్రభుత్వం వైద్య ఖర్చులను భరించి చికిత్స చేయించిందని,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి మా బిడ్డ చికిత్స చేయించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. దాతలు ముందుకు వచ్చి సహాయం చేసేవారు బాలుడి తండ్రి శ్రీను ఎస్బిఐ బ్యాంకు ఖాతా నెం.43194942778 ద్వారా ఆర్థిక సహాయం అందించాలి. ఫోన్ పే,గూగుల్ పేకు సంబంధించి 8639157327 సహాయం చేయగలరని బాలుడి తండ్రి శ్రీను కోరాడు.

*కొలంబోలో భారత బౌలర్ల ధాటికి పాకిస్థాన్ బ్యాటర్లు జడుసుకుంటున్నారు. పేసర్లు రేణుకా సింగ్, క్రాంతి గౌడ్(1-10)లు బెంబేలెత్తిస్తుండడంతో పరుగులు చేయడంకోసం నానా తంటాలు పడుతున్నారు. ఆరు పరుగులకే ఓపెనర్ మునీబా అలీ(2) రనౌట్ కాగా.. ఆకాసేపటికే సడాఫ్ షమాస్ (6) రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. అనంతరం.. రేణుకా సింగ్ ఓవర్లో సిద్రా అమిన్ (9 నాటౌట్) ఇచ్చిన సులువైన క్యాచ్‌ను రీచా వదిలేసింది. డైవ్ చేయడంతో బంతి ఆమె మణికట్టుకు తగిలి కింద పడింది. లేదంటే పాక్ మూడో వికెట్ పడేది. పది ఓవర్లకు పాక్ స్కోర్..25-2.*

# దొంగ ఓట్లతో దొడ్డి దారిన బీజేపీ అధికారంలోకి వస్తుంది

- సంతకాల సేకరణ ద్వారా ప్రతి డివిజన్ నుండి ప్రజల అభిప్రాయాలు సేకరిస్తాం
- కొత్త 64 వ డివిజన్ ఇందిరా చౌక్ నుండి సంతకాల సేకరణ ప్రారంభించాం
- సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 05 (జనంసాక్షి):**
దేశ వ్యాప్తంగా నమోదు చేసుకున్న దొంగ ఓట్లతో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం కళ్లు తెరవాలని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఇందిరా చౌక్ వద్ద కొత్త 64 వ డివిజన్ నుండి సంతకాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఓటు చోరీని అరికట్టడంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17 తారీఖు లోపల అన్ని డివిజన్లలో డివిజన్ల అధ్యక్షులు, ఇంచార్జులు సంతకాల సేకరణ చేయాలని ఈ సంతకాల సేకరణ కార్యక్రమంలో ముఖ్యనాయకులు పాల్గొంటారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయ్యేంతవరకు ఇలాంటి కుట్రలను తిప్పి కొడుతామని ఓటు చాలా విలువైనదని బీజేపీ ఓట్ల దొంగతనానికి పాల్పడుతోందని నరేందర్ రెడ్డి అన్నారు. డివిజన్ బాధ్యుడు పెద్దిగారి తిరుపతి ఆధ్వర్యంలో 64 డివిజన్ కు సంబంధించిన పి.పద్మ, కోమలత, మనీషా, ఆరిఫ్, వెన్నెల, సోహెల్ శివాని తదితరులు పత్రాల పై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్, కొరివి అరుణ్ కుమార్, బోనాల శ్రీనివాస్, అబ్దుల్ రహేమాన్, అహ్మద్ అలీ, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఎండి చాంద్, దండి రవీందర్, కుర్ర పోచయ్య, నెల్లి నరేష్, యనమల మంజుల, షబానా మహమ్మద్, ముల్కల కవిత, ఊరడి లత, హసీన, జ్యోతి రెడ్డి, వంగల విద్యా సాగర్, సలీం, సుదర్శన్, నాగుల సతీష్, మాదాసు శ్రీనివాస్, బత్తిని చంద్రయ్య, మహమ్మద్ భారీ, షెహెన్న తదితరులు పాల్గొన్నారు.

# దళితులను కించపరిచిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

- గ్రామాలలో దళితులపై ఆగని దాడులు
- దళితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం
- ప్రజాసంఘాల నాయకులు డిమాండ్



**ముత్తారం అక్టోబర్ 05(జనంసాక్షి) :**
దళితులను కించపరిచే విధంగా మాట్లాడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రోజున ముత్తారం మండలం దర్యాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బతుకమ్మ,దసరా పండుగ సందర్భంగా దళితుల కులస్తులు అయినటువంటి మాదిగలు డప్పు కళ ప్రదర్శించడానికి గ్రామంలోకి వెళ్లిన దళితులను అవమానపరిచిన అగ్రవర్ణాలకు చెందిన వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. దళితులపై జరిగిన ఈ అవమాన సంఘటనపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దర్యాపూర్ గ్రామంలోని దళిత సోదరులను కలిసి పూర్తి విషయాలను తెలుసుకోని మద్దతు తెలపడం జరిగిందన్నారు.. అనేక సంవత్సరాల్లో దళితులు ప్రతి గ్రామంలో బతుకమ్మ దసరా పండగల ఉత్సవాలలో మాదిగ కులస్తులు ఆనవాయితీతో డప్పు కళాకారులతో గ్రామంలో బతుకమ్మలను జంబి వంటి కార్యక్రమాలు సజావుగా జరుగుతుంటాయని అన్నారు. కాని మండలంలోని అన్ని గ్రామాల కన్నా ధర్యాపూర్ గ్రామంలో విడ్డూరంగా ఉందని అన్నారు. గ్రామానికి చెందిన కొందరు అగ్రకులస్తులు కూల దురాహంకారంతో డప్పులతో వచ్చిన వారిని నీచమైన మాదిగ కులస్తులారా మిమ్ములి ఎవడు పిలిచాడు రా నాఇంటికి రాకుండా నువ్వు డప్పులు ఎలా కొట్టుకుంటూ ఊరు తిరుగుతావు రా అని అంటూ ఇష్టం వచ్చిన రీతిలో తిట్టడమే కాకుండా పురుష పదజాలంతో దళితుల ఇంట్లో ఉన్నటువంటి మహిళలను కూడా కించపరిచే విధంగా బూతులు తిడుతూ మాదిగలను అవమానపరచడం విడ్డూరంగా ఉందన్నారు. దసరా పండుగ రోజున మాజీ ఉపసర్పంచ్ భర్త ఆహ్వానం మేరకు ఆనవాయితీగా జమ్మి కార్యక్రమానికి డప్పు కళ ప్రదర్శన చేసి వస్తుంగా సదరు వ్యక్తులు వీరిని అడ్డుకొని గొడవ చేయడం జరిగింది ఇట్టి సమయంలోనే స్థానిక ఎస్సైకి సమాచారం తెలియగా అక్కడికి చేరుకొని గొడవను ఆపే ప్రయత్నం చేసినప్పటికీ కూడా సాక్షాత్తు ఎస్సైని కూడా లెక్కచేయకుండా ఇష్టమైన రీతిలో మాదిగ జాతిని కించపరుస్తూ ఇష్టమైన రీతిలో సదరు వ్యక్తులు కుల దురహంకారంతో తిట్టడం ఏమిటి అని అన్నారు. గతంలో కూడా దర్యాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ భర్త మాదిగ కులస్తుడైన రాజశేఖర్ పై కుల దురాహంకారంతో దాడి చేయడం జరిగిందని అన్నారు అదే అదునుగా చూసుకొని బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా మాదిగ జాతిని అవమానపరిచిన కుల దురాహంకారులను కఠినంగా శిక్షించాలని ఇట్టి సంఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్,ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య,గ్రామ దళితులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# అల్ ఐన్ మాస్టర్స్‌లో శ్రీయాంశి వలిశెట్టి అద్భుత విజయం

**మల్కాజిగిరి, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** పుల్లెల గోపిచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారిణి శ్రీయాంశి వలిశెట్టి అద్భుత ప్రదర్శనతో అల్ ఐన్ మాస్టర్స్-2025 మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. అబుదాబి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఖలీఫా బిన్ జాయెద్ స్టేడియంలో జరిగిన ఈ బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్-100 టోర్నమెంట్‌లో ఆమె విజేతగా నిలిచింది. సెమీఫైనల్‌లో ఏడో సీడ్ శ్రీయాంశి, ఇండోనేషియాకు చెందిన చియారా మార్వెల్లా హాందోయోపై 21-11, 21-12తో సూటిగా గెలిచి ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌లో మాజీ ప్రపంచ జూనియర్ నంబర్ 1 తస్నీం మీర్‌ను 15-21, 22-20, 21-7 తేడాతో ఓడించి టైటిల్‌ను దక్కించుకుంది.కేవలం 18 ఏళ్ల వయసులోనే ఈ విజయంతో శ్రీయాంశి తన కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ సూపర్ 100 టైటిల్‌ను సాధించి విశేష గుర్తింపు పొందింది. ఆమె ప్రతిభ, పట్టుదల, ధైర్యం ఈ విజయానికి మూలమని భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ అభినందించి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- స్థానిక సంస్థల ఎన్నికల సన్నహక సమావేశంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్
- కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురు మాజీ సర్పంచ్‌లు



**కోనరావుపేట (జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. ఆదివారం కొనారావుపేట మండల కేంద్రంలో ఆర్యవైశ్య కమ్యూనిటి హాల్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పలు సూచన లను దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి బలమని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిధులు ఖర్చు చేస్తోందన్నారు. కార్యకర్తలు నాయకులు చెప్పే సూచనలు సలహాలు స్వీకరిస్తూ ముందుకు పోతామన్నా రు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడుగా పని చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు.ఈ ఎన్నికల్లో అవకాశం రానివారు ప్రస్తుతం అవకాశం వచ్చినా అభ్యర్థుల గెలుపునకు దోహదం చేయాలన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న రాద్ధాంతం, వారు దిగజారి మాట్లాడే మాటలు పట్టించు కోకుండా ముందుకు పోవలన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేద ప్రజలకు అందేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ ప్రజలకు చేరువలో ఉండాలన్నారు.పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని తెలిపారు..ఎవరి గౌరవానికి భంగం వాటిల్లకుండా చూసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.. కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక మామిడిపల్లి మాజీ సర్పంచ్ కొక్కుల నర్సయ్య-భారత, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు సంకోజి సత్తయ్య,, శివంగలపల్లి మాజీ సర్పంచ్ సురేష్ లు సుమారు 50 మందితో కాంగ్రెస్ పార్టీలో చేరగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వారికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు..

# స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



**కోనరావుపేట (జనంసాక్షి):** స్థానిక సంస్థలు ఎన్నిక దృష్ట్యా ఆదివారం కోనరావుపేట మండలంలోని ధర్మారం గ్రామంలో కోనరావుపేట బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజీ ఆధ్వర్యంలో జడ్పీటీసీ ఎంపీటీసీ అభ్యర్థులకు దిశ నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ నాయకులు కార్యకర్తలు సూచనల మేరకు అభివృద్ధి ఎజెండాగా ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పార్టీ స్టేట్ కౌన్సిల్ నెంబర్ కోల కృష్ణ స్వామి,జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు, డిస్టిక్ కౌన్సిల్ నెంబర్ గొట్టే రామచంద్రం,బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్ గౌడ్, పురుషోత్తం రావు,ఉప అధ్యక్షులు చింతల పరుశు రాం,కార్యదర్శి వేల్పుల తిరుపతి,సోషల్ మీడియా కన్వీనర్ జలంధర్ దుర్గం తిరుపతి,మాజీ వైసిపి తీగల రవీందర్ గౌడ్,మాజీ పల్లి ముక్తా సర్పంచ్ జిన్నా అనిల్ , అసరీ దేవరాజు, చల్ల జితేందర్ రెడ్డి,కదర్ల వికాస్, తల్లపెల్లి సుమన్,యశోద రాజు వెలిశాల రవీందర్, దుర్గం తిరుపతి బూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇన్చార్జులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఇంటి గోడ కూలీ వ్యక్తి గాయాలు

**వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి)**
బషీరాబాద్ మండల కేంద్రంలో శిథిలావస్థి ఇంటి గోడ కూలీ ఓ వ్యక్తి గాయాల పాలయ్యారు. ఎస్.ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం ఆర్ఎంపీ డాక్టర్ జయరాం చారి ఆసుపత్రి పక్కన పర్తాని కుటుంబానికి చెందిన శీతలావస్థితి ఇంటి గోడ కూలి బీహార్ రైల్వే కూలి దేవ తండ్రి రాజేందర్ (26) వ్యక్తికి గాయాలపాలయ్యారని వెంటనే స్థానికులు గమనించి అతని పైన పడ్డరాలను తొలగించి బషీరాబాద్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని మెరుగైన వైద్యం కోసం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శీతలావస్థి ఇళ్లలో ఉండకూడదని ఎస్.ఐ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో పర్తాని కుటుంబానికి చెందిన ఇళ్లలో కొన్ని కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా కూలి పని చేస్తూ అద్దె చెల్లిస్తూ నివసిస్తున్నామని, ఇండ్లను మరమ్మత్తులు చేయమంటే ఉంటే ఉండండి లేదా వెళ్లిపోండి మేము మరమ్మతులు చేయము అని చెప్పారని,ఎటు వెళ్ళాక ఇందులో నివసిస్తున్నామని అన్నారు.ప్రభుత్వం ఈ ఘటన పైన ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# గ్యార్వి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ కొలుకుల జగన్



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 05(జనం సాక్షి) :** గ్యార్వి ఉత్సవాలను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్ లోని దర్గాను సందర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పండుగలు మతసామరస్యానికి ప్రత్యేకంగా నిలవాలని సూచించారు. జగద్గిరిగుట్ట డివిజన్ సర్వ మతాలకు నిలియంగా నిలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కొలుకుల జైహింద్, ఐలయ్య గౌడ్, సాధిక్ మహమ్మద్, సులేమాన్ ,ప్రభు, ఫిరోజ్, యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తన పుట్టిన రోజు సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ ని ఆశీర్వదిస్తూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ సెప్టెంబర్ 5 (జనం సాక్షి)

# రిజర్వేషన్ల కోసం పోరాడిన ఏకైక నేత.. అంబేద్కర్





- 2026 కులగణనకు బహుజనుల సమీకరణకు .. పోరాట పిలుపు
- అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శనకు ఆహ్వానం
- సామాజిక సమానత్వ ఆశయాలు యువతకు ప్రేరణ

**ఘట్కేసర్, అక్టోబర్ 5:**
బీసీల రిజర్వేషన్లు, మహిళలు-పురుషుల సమాన హక్కుల కోసం కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన ఏకైక వ్యక్తి డా.బాబాసాహెబ్ అంబేద్కరని కోలి సంఘం తెలంగాణ ప్రధాన కార్యదర్శి వి.బి.వెంకట్ నారాయణ ప్రశంసించారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలకు వ్యాప్తి చేయడానికి 234వ వారం నిత్య పూల మాల కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా వెంకట్ నారాయణ, కోలి సంఘం వైస్ ప్రెసిడెంట్లు బర్ల దేవేందర్, కె.విజయ్ కుమార్, కార్యనిర్వాహక సభ్యుడు ఉదారి సుదర్శన్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మాట్లాడిన వెంకట్ నారాయణ, స్వాతంత్ర్యం తర్వాత భారతదేశానికి దిశ చూపిన మహానేత అంబేద్కరని, 60 దేశాల రాజ్యాంగాలను చదివి కుల, మత, ప్రాంతాలకు అతీతంగా మన రాజ్యాంగాన్ని రూపొందించారని గుర్తుచేశారు. 2026లో కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే కులగణనలో అందరూ పాల్గొని, మేము ఎంతో, మాకు అంత రిజర్వేషన్ అని చట్టసభలో సాధించేలా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతి వారం ఇలా బహుజనులను సమీకరించి మహనీయుల చరిత్ర తెలియజేయడం బహుజన రాజ్యాధికారానికి పునాది అని చెప్పారు. యువత అంబేద్కర్‌తో పాటు మహనీయుల జీవిత చరిత్రలు తెలుసుకొని ఆశయ సాధన కోసం ముందుకు సాగాలని సూచించారు. ప్రబుద్ధ భారత్ ప్రతినిధులను అభినందించిన వెంకట్ నారాయణ, ప్రజలను చైతన్యపరుస్తున్న వై.అరుణ్ కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరోవైపు, షేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సందర్భంగా డా.బీ.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రపై 'సంఘం చరణం గచ్ఛామి' నాటక ప్రదర్శన ఏర్పాటు చేసింది. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ చేత రూపొందించబడిన ఈ పూర్తి చరిత్ర నాటకం అక్టోబర్ 12న సాయంత్రం 7 గంటలకు పాత మున్సిపల్ కార్యాలయంలో జరుగుతుంది. సంస్థ అధ్యక్షుడు కడప ఈశ్వర్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి అంబేద్కర్ సామాజిక సమానత్వ కలలు, మహిళల రక్షణ బిల్లు, కుల వ్యవస్థకు వ్యతిరేక పోరాటం, అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులు, దళితులు-మైనారిటీలు-స్త్రీల ఆర్థిక-రాజకీయ హక్కులు, రిజర్వ్ బ్యాంక్, కార్మికుల చట్టాలు వంటి అంబేద్కర్ కృషి దేశ అభివృద్ధికి మూలాలని గుర్తుచేశారు. బాబాసాహెబ్ కొందరి వాడు కాదు, అందరి వాడని, ఆయన సేవలు తెలుసుకోవడానికి ప్రజలు అందరూ తప్పక చూడాలని కోరారు. మీసాల అరుణ్ కుమార్ కరపత్రం ఆవిష్కరణ చేశారు. అందరూ ఆహ్వానితులు. షేడ్ స్వచ్ఛంద సేవా సంస్థ, అంబేద్కర్ యువజన సంఘం, ఘట్కేసర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పూల మాల కార్యక్రమంలో రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి రాంరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మేకల దాస్, ఈడబ్ల్యూఎస్ కాలనీ అధ్యక్షుడు బండారి రాందాస్, కడపోళ్ల మల్లేష్, కె.నర్సింగరావు, కడపోళ్ల ఈశ్వర్, అంకం సురేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పి.దామోదర్ రెడ్డి, వెంకటాచారి, ఎం.వెంకటేష్, శంకర్, టి.శ్రీరామ్, బి.గణేష్ గౌడ్, ఎస్.కృష్ణం రాజు, సి.ఉపేందర్, ఈ.విష్ణు, డి.భరత్, లలిత్ తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

## 99 బజార్ ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**అల్వాల్, అక్టోబర్ 5(జనంసాక్షి):**
యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. అల్వాల్‌లో ఏర్పాటు చేసిన '99 బజార్'ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్న స్థాయిలో ప్రారంభించిన వ్యాపారాలు కూడా పట్టుదలతో నడిపితే పెద్ద స్థాయికి ఎదగవచ్చని సూచించారు. యువత తమ సొంత ప్రతిభ, కృషితో ఎదగాలని, ప్రభుత్వం కూడా ఈ దిశగా పలు ప్రోత్సాహక కార్యక్రమాలు అందుబాటులో ఉంచిందని తెలిపారు. నిర్వాహకురాలు షాలిని భగత్ మాట్లాడుతూ, 99 బజార్‌లో ప్రతి వస్తువు కేవలం 99కే లభిస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, సురేష్, జార్జ్, ప్రేమ్‌కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సమావేశాలకు బయలుదేరిన తపస్ బృందం



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 5(జనం సాక్షి) :** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ( తపస్ ) రంగారెడ్డి ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ మరియు తపస్ నారాయణ పేట్ బృందంతో కలిసి అక్టోబర్ 05.06.07 తేదీలలో రాజస్థాన్ రాజధాని జైపూర్ లో జరిగే అఖిల భారతీయ శైక్షిక్ మహా సంఘ్ జాతీయ సమావేశాలకు ఆదివారం శంషాబాద్ విమానాశ్రయం నుండి బయలు దేరి వెళ్ళడం జరిగింది. ఈ సందర్భంగా తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు, జాతీయ భావాల పెంపు ఆవశ్యకత మరియు దేశాన్ని ఉన్నత స్థాయిలో నిలపడం కోసం టీచర్లు నిర్వహించాల్సిన కార్యక్రమాలు, చెయ్యాల్సిన కృషి మరియు తదితర అంశాల పై దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే ఉపాధ్యాయులు మరియు అధ్యాపకులచే సంఘ ప్రతినిధులు ఈ సమావేశాల్లో చర్చిస్తారని అన్నారు. ఇప్పటికే ఈ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుండి తపస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కానుగంటి హనుమంతరావు, నవాత్ సురేష్, రంగారెడ్డి జిల్లా బాధ్యులు విష్ణు వర్ధన్ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజరి రమేశ, నారాయణ పేట్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శేర్ కృష్ణ రెడ్డి, నరసింహ, జిల్లా బృందం రవీందర్, కిషోర్ కుమార్, మల్లికార్జున్ లతో పాటు దాదాపు 170 మందికి పైగా తపస్ రాష్ట్ర, జిల్లా, ముఖ్యమైన మండల బాధ్యులు మరియు మహిళా కార్యకర్తలు జైపూర్ కు చేరుకున్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన 150 మందికి హరీష్‌రావు స్వాగతం

- బీజేపీ దోచుకున్న ప్రభుత్వానికి ప్రజలు తిరుగుబాటు
- కేంద్రం తెలంగాణతో చేస్తున్న అన్యాయాలు హరీష్‌రావు ఎండగట్టు
- కేసీఆర్ పథకాలు ఆపిన కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శ
- మళ్లీ అధికారంలోకి వస్తుంది బీఆర్ఎస్.. హరీష్‌రావు ధీమా



**సదాశివనగర్, అక్టోబర్ 5 (జనం సాక్షి):** ఎల్లారెడ్డి నియోజకవర్గం గాంధారి మండలంలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మాజీ మంత్రి టి.హరీష్‌రావు హాజరయ్యారు. పెద్ద ఎత్తున బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరిన నాయకులు, కార్యకర్తలకు హరీష్‌రావు స్వాగతం పలికారు. ఉద్యమకారుడు తానాజీ గారు బీజేపీలో చేరి తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చినందుకు సాదరంగా ఆహ్వానం పలికారు. వారితో పాటు 150 మంది మాజీ సర్పంచులు, ఎంపీటీసీలకు బీఆర్ఎస్ తరపున హర్షవ్యక్తం చేశారు. సమావేశంలో మాట్లాడిన హరీష్‌రావు, రాష్ట్ర ప్రజలకు స్పష్టత వచ్చేసిందని, మల్లొచ్చే ప్రభుత్వం ఏదని ఎవరినీ అడిగినా బీఆర్ఎస్ట్ అని చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. రెండేళ్లు గడిచిపోయాయి, ఇంకా రెండేళ్లు ఉన్నాయి. మనం కలిసికట్టుగా పనిచేస్తే మళ్లీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని అమితవిశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ దేశం కోసం, ధర్మం కోసం అంటూ డైలాగులు కొట్టుకుందని, మోడీ 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' అంటున్నారు కానీ వాస్తవంగా జరిగింది 'సబ్‌కా వికాస్' కాదు, 'సబ్‌కా బక్వాస్' అని విమర్శించారు. బీజేపీ పేదలు, రైతులు, దళితుల పక్షాన లేదని, కేవలం నార్త్ ఇండియాకు మాత్రమే పక్షపాతం చూపుతోందని ఆరోపించారు. తెలంగాణ దేశంలో లేదా? ఎందుకు తెలంగాణకు నిధులు ఇవ్వరు అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణకు శ్రీరామరక్ష అని, జాతీయ పార్టీలు అన్ని విధాల అన్యాయాలు చేస్తాయని స్పష్టం చేశారు. నిజాంబాద్ జిల్లా కందకుర్తి దగ్గర గోదావరి నది తెలంగాణలోకి ప్రవేశించి, గుండా ప్రవహించి ఆంధ్రలో కలుస్తుందని గుర్తుచేశారు. 2027 గోదావరి పుష్కరాలకు బీజేపీ ఆంధ్రకు 100 కోట్లు ఇచ్చింది కానీ, 8 ఎంపీలను గెలిపించిన తెలంగాణకు గుండు సున్నా ఇచ్చిందని ఆక్షేపించారు. తెలంగాణలో గోదావరి నది లేదా? ఎందుకు పుష్కరాలకు నిధులు ఇవ్వడం లేదని ప్రశ్నారు. ఆంధ్రలో తెలుగుదేశం గెలిచింది కాబట్టి ప్రాంతీయ పార్టీ అయినా ఢిల్లీ మెడలు వంచిందని, అదే తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉంటే బీజేపీ మెడలు వంచి నిధులు తీసుకువచ్చేదని చెప్పారు. కేంద్రం 157 మెడికల్ కాలేజీలు ప్రకటించినా తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. 10 ఏళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశానికే ధాన్యాగారంగా ఎదిగిందని, 24 గంటల కరెంట్, రైతుబంధు పథకం, మిషన్ కాకతీయలో చెరువులు బాగు చేయడం, ప్రాజెక్టులు పూర్తి చేయడం, పండించిన ప్రతి గింజను కొనడం వంటివి కేసీఆర్ చేసినవని పేర్కొన్నారు. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు గోధుమలకు మద్దతు ధర 1400 రూపాయలు ఉండగా, ఇప్పుడు 2585 రూపాయలు అయిందని చెప్పారు. వరికి 2369 రూపాయలు మాత్రమే ఇచ్చి, గోధుమలకు 216 రూపాయలు ఎక్కువ ఇచ్చారని, తెలంగాణ రైతు ఎకరానికి 4 వేల రూపాయలు నష్టపోతున్నారని విమర్శించారు. ఇదేనా బీజేపీ 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' అని ప్రశ్నించారు. 8 మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు బీజేపీ అధిష్టానానికి ఎదురు మాట్లాడలేరని, అదే బీఆర్ఎస్ ఉంటే మన హక్కులు, నిధులు తెలంగాణకు తీసుకువచ్చేదని అన్నారు. ఆంధ్రకు స్పెషల్ ప్యాకేజ్ ఇచ్చినప్పుడు తెలంగాణకు ఎందుకు ఇవ్వరు, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుండు సున్నా, మెడికల్ కాలేజీలు గుండు సున్నా, నవోదయ విద్యాలయాలు గుండు సున్నా అని ఆరోపించారు. బీజేపీకి ఓటు వేసినందుకు రైతు ఎకరానికి 7 వేల రూపాయలు నష్టపోతున్నారని, పెట్టుబడులు, పరిశ్రమలు, రైల్వేలు, హైవేలు, రీజినల్ రింగ్ రోడ్‌కు నిధులు ఇవ్వడం లేదని చెప్పారు. తెలంగాణ ప్రజలు ఆలోచించాలని, రేపు వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని హర్షవ్యక్తం చేశారు. తెలంగాణకు నిధులు, మన వాటా రావాలంటే ఎంపీలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పన్ను లేసుకున్నారు మాత్రమే, కొత్త పథకాలు ఇవ్వలేదని ఆరోపించారు. భూముల ధరలు పడిపోయాయి, బీరు, విస్కీ ధరలు పెంచారు. మహిళలకు ఫ్రీ బస్సులు అంటూ మొగుళ్లకు డబుల్ టికెట్ వసూలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ తెచ్చిన పథకాలు ఆపేశారు, న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు బంద్ చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి దోచుకునే ప్రభుత్వమేనని, మల్లెటు చూసినా కేసీఆర్ రావాలనే గాలి మొదలైందని పేర్కొన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ప్యాకేజీ తెస్తానన్నారు, రేవంత్ రెడ్డి ప్యాకేజీ ఇస్తానన్నారు కానీ వరదలు వచ్చి రోజులు దాటినా ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 10 వేల ఇస్తామన్నారు కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని చెప్పారు. బాకీ కార్డులు, మహాలక్ష్మి పథకం, పెన్షన్లు, రైతుబంధు, ఉద్యోగాలు వంటి అంశాల్లో కాంగ్రెస్ బాకీలు చేసిందని, 22 నెలల్లో మహిళలకు 55 వేల రూపాయలు, వృద్ధులకు 44 వేల రూపాయలు బాకీ పడ్డాయని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఊర్లకు వస్తే 55 వేల రూపాయలు ఇచ్చి మాట్లాడమని గల్లపట్టి నిలదీయాలని సూచించారు. కేసీఆర్ 200 పెన్షన్‌ను 2 వేలకు పెంచారు, రేవంత్ 4 వేలకు పెంచుతానన్నారు కానీ ఇవ్వలేదని, రైతుబంధు 15 వేల ఇస్తామన్నారు కానీ 3 ఎకరాలకు మాత్రమే ఇచ్చి మిగిలినవి ఎగ్గొట్టారని విమర్శించారు. కౌలు రైతులకు, రైతులకు ఇస్తామన్నారు కానీ ఇచ్చలేదని, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు కానీ 5 వేల కూడా ఇవ్వలేదని అన్నారు. రేవంత్ రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు, కట్టింగ్ మాస్టర్ అని, పథకాలు కటింగ్ పెడుతాడని, కేసీఆర్ కట్టిన బిల్డింగ్‌లకు రిబ్బన్ కత్తిరిస్తాడని ఎగతాళి చేశారు. ప్రజలకు పాలేందో నీలేవో తెలిసిపోయిందని, తెలంగాణలో ఎప్పుడైనా ఎన్నికలు వచ్చినా 100 సీట్లు బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారులు, పోలీసులు ఇబ్బంది పెట్టితే సంగతి చెప్తామని హెచ్చరించారు. పోలీసులు, అధికారులు జాగ్రత్తగా ఉండాలని, పోయిన 10 ఏళ్లు ఊకున్నాము, ఈసారి అట్లుండదు, అభివృద్ధి చేస్తామని, ఎక్స్‌ట్రాలు చేసిన అధికారులకు వడ్డీతో చెల్లిస్తామని చెప్పారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినవారిని అరెస్టు చేస్తున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలా జాగ్రత్త అని, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు వెళ్లమని పిలుపునిచ్చారు. వచ్చేది బీఆర్ఎస్ పార్టీనేనని నొక్కి చెప్పారు. వివిధ మండలాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం వలన మురికి కూపంగా మారిన మనసురాబాద్ పెద్ద చెరువు

**కొప్పుల నర్సింహ్మా రెడ్డి**
**హయత్ నగర్, అక్టోబర్ 05 (జనం సాక్షి):**



మన్సూరాబాద్ పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో తలెత్తిన తీవ్రమైన సమస్యలను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భం గా కార్పొరేటర్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి, ఇరిగేషన్, హైడ్రా, హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్ బి శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వలన మురుగు నీరు చెరువు లోకి చేరి పరిసర ప్రాంత ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల పై వారు మండిపడ్డారు. పైన ఉన్న వనస్థలిపురం పరిసర కాలనీలో నుండి వచ్చే వర్షపు నీరు పెద్ద చెరువును నింపుతున్నప్పటికీ, అసంపూర్తిగా నిలిచి పోయిన బాక్స్ నాలా పనులు, ఎఫ్ టీ ఎల్ స్థలం పై కోర్టు కేసు క్లియరెన్స్ లేకపోవడం వలన చెరువులో మురుగునీరు కలిసిపోతూ పర్యావరణానికి హాని కలిగిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా తప్పుబడుతూ, ప్రజల ప్రాథమిక అవసరాలకు సంబంధించిన ఇలాంటి చెరువుల అభివృద్ధి పనులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండడం అశోభనీయమైన విషయం అని వారు వ్యాఖ్యానించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, కోర్టు క్లియరెన్స్ ప్రక్రియను వేగవంతం చేసి, నిలిచిపోయిన బాక్స్ నాలా పనులు వెంటనే ప్రారంభించాలి అని వారు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ పనులు ప్రాధాన్యంగా తీసుకోవాలని పలు శాఖల అధికారులకు వారు సూచించారు. వివిధ శాఖలు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని, చెరువులు మన జీవనాధారాలని వాటి పరిరక్షణలో ఆలస్యం అంటే ప్రజల జీవనంపై ముప్పని వారు పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
6 అక్టోబర్ 2025



## రాంరెడ్డి దామోదర్ రెడ్డి అస్థికలు నిమజ్జనం

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** మాజీమంత్రి వర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అస్థికలను వాడపల్లిలోని కృష్ణ,తుంగభద్ర, మూసి సంగమం నదిలో కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి నిమజ్జనం చేశారు. ఆదివారం వాడపల్లి క్షేత్రంలో కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారితో పాటు కుటుంబ సభ్యులు అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో దామోదర్ రెడ్డి సోదరులు గోపాల్ రెడ్డి , క్రిష్ణా రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, మేనల్లుడు జెన్నారెడ్డి ప్రతాప్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, తదితరులు అర్చకులు శ్రీరామ కవచం నాగయ్య శాస్త్రీ, కాశీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఉత్సాహంగా 3కే రన్

- **ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో ఆదివారం 'రన్ ఫర్ ఎ కాజ్: స్టాప్ సబ్‌స్టాన్స్ అబ్యూస్ 3కే రన్' కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం మత్తు పదార్థాల నిర్మూలనకు యువతలో అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించినది. అపోలో హాస్పిటల్స్‌తో కలిసి ఈ ఈవెంట్‌ను ఏర్పాటు చేశారు అధికారులు. ఇందులో విద్యార్థులు, యువత, స్థానిక పౌరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి ప్రభాకర్ ప్రసంగంలో యువత భవిష్యత్తును కాపాడుకోవడానికి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ రన్... తెలంగాణలో డ్రగ్స్‌ని అరికట్టే ప్రభుత్వ చర్యలకు మద్దతుగా, ఒక మైలురాయిగా మారింది. 3కే రన్‌లో విద్యార్థులు, యువత భారీగా పాల్గొని, డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్లపై రంగుల రంగుల టీ-షర్టుల్లో భాగస్వాములు పరిగెత్తారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభ జెండాను ఊపుతూ, ఈ కార్యక్రమం యువతలో శక్తిని, బాధ్యతను నింపుతుందని అన్నారు. స్కూల్స్, కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ రన్‌ను ఉత్సవంలా చేసుకున్నారు. అపోలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది కూడా పాల్గొని, మెడికల్ అవగాహనా సెషన్లు నిర్వహించారు. 3కే రన్‌లో విద్యార్థులు, యువత భారీగా పాల్గొని, డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్లపై రంగుల టీ-షర్టుల్లో భాగస్వాములు పరిగెత్తారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభ జెండాను ఊపుతూ, ఈ కార్యక్రమం యువతలో శక్తిని, బాధ్యతను నింపుతుందని అన్నారు. స్కూల్స్, కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ రన్‌ను ఉత్సవంలా చేసుకున్నారు. అపోలో ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది కూడా పాల్గొని, మెడికల్ అవగాహనా సెషన్లు నిర్వహించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. యువత రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడాలనీ, మత్తుకు లోనుకాకుండా ఉండాలని ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చింది. ఈ చట్టాలు డ్రగ్స్, గంజాయి వంటి నార్కోటిక్స్‌పై కఠిన శిక్షలు విధిస్తాయి. మంత్రి ప్రభాకర్ ప్రసంగంలో, ఈ చట్టాలు యువతను రక్షించడానికి.. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతాయని చెప్పారు. పోలీస్ శాఖలో స్పెషల్ విభాగాలు ఏర్పాటు చేసి, డ్రగ్ మాఫియాను ఎదుర్కొంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ చర్యలు యువతకు మద్దతుగా ఉన్నాయని స్పష్టం చేశారు.

భారత ప్రధాని నరేంద్ర మోదీ 'నషా ముక్త్ భారత్' అభియాన్‌ను ప్రకటించారు. తెలంగాణలో కూడా ఈ దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. అవగాహనా కార్యక్రమాలు, సెమినార్లు, ర్యాలీల ద్వారా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రచారం చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఈ అభియాన్‌కు తెలంగాణ పూర్తి మద్దతును ఇస్తామని అన్నారు. స్కూల్స్, కాలేజీలలో డ్రగ్ ప్రివెన్షన్ కమిటీలు ఏర్పాటు చేసి, కౌన్సెలింగ్ సెషన్లు నిర్వహిస్తున్నారు. ఈ 3కే రన్ ఈ అభియాన్‌కు భాగమై, రాష్ట్రవ్యాప్తంగా వ్యాప్తి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థి దశలో చెడుకు త్వరగా ఆకర్షితులు అవుతారు. డ్రగ్స్ మొదట బాగా అనిపించినా, మన జీవితాలను పూర్తిగా నాశనం చేస్తాయి. మంత్రి ప్రభాకర్ ప్రసంగంలో, డ్రగ్స్ వల్ల ఆరోగ్యం, విద్య, కెరీర్ అంతా కోల్పోతామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాల వల్ల మానసిక సమస్యలు, కుటుంబ విషాదాలు ఎదుర్కొంటుందని చెప్పారు. ఈ రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, డ్రగ్స్ హానుల గురించి వ్యక్తిగత కథలు పంచుకున్నారు. ప్రభుత్వం రీహ్యాబ్ సెంటర్లను పెంచి, చికిత్సకు సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. మత్తు పదార్థాలు మన జీవితాలను మనమే కోల్పోయేలా చేస్తాయి. డ్రగ్స్ నిర్మూలనకు అందరూ అవగాహన కల్పించాలి. మంత్రి పొన్నం ప్రభాకర్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి యువతను కాపాడాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా, పబ్లిక్ ఫోరమ్‌ల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.

## పోలే చంద్రశేఖర్ కుటుంబానికి మంత్రి అడ్లూరి పరామర్శ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బి.ఎన్.రెడ్డి డివిజన్, టీచర్స్ కాలనీకి చెందిన యువకుడు పోలే చంద్రశేఖర్ అమెరికా టెక్సాస్ నగరంలో గుర్తు తెలియని దుండగుల కాల్పులకు బలై మృతి చెందిన ఘటనపై తెలంగాణ రాష్ట్రం ఈ విషాద ఘటనపై కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం రాత్రి 7 గంటలకు బి.యన్.రెడ్డి నగర్ లో మృతుని నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను ఓదారుస్తూ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వచ్చాను. మీకు అన్ని విధాలా న్యాయం జరుగుతుంది. పార్థివ దేహాన్ని, హైదరాబాద్‌కు తేవడానికి ఇప్పటికే చర్యలు వేగవంతంగా జరుగుతున్నాయి" అని భరోసా ఇచ్చారు. రోడ్లు, భవనాల, శాఖ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజా శేఖర్ రెడ్డి, మాట్లాడుతూ, టీపీసీసీ ప్రచార కమిటీ ప్రతినిధి మదియాస్కి గౌడ్, అమెరికాలో ఉండి, విదేశాంగ శాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. "ఎంత త్వరగా సాధ్యమవుతుందో అంత త్వరగా చంద్రశేఖర్ మృతదేహాన్ని హైదరాబాద్‌కు రప్పించేలా కృషి చేస్తున్నారు" అని వారు చెప్పారు. కుటుంబసభ్యులను ధైర్యం చెబుతూ "మీరు అధైర్యపడవద్దు. ప్రభుత్వం మీకు అండగా నిలుస్తుంది. మీ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలా కృషి చేస్తాము" అని మంత్రి హామీ ఇచ్చారు. మృతుడు చంద్రశేఖర్ మేనమామ గుంటి రాజు, మాట్లాడుతూ మాది దళిత కుటుంబం అయినందున ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టడం లేదని ఘటన జరిగి 36 గంటలు, గడుస్తున్న అక్కడ ఎలా జరిగింది? ఏం జరిగింది అనే విషయాన్ని మాకు మీరు తెలియజేయడం లేదని ఒకందుకు నిస్సహిత, ఆగ్రహాన్ని , వ్యక్తం చేశారు. ఇట్టి పరామర్శలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, శశిధర్ రెడ్డి, గణేష్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంట్ కొత్త శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుదాం

**బీసీ అఖిలపక్ష నాయకులు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీసీలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడుదామంటూ పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. అశోకా హొటల్‌లో ఆదివారం జరిగిన అఖిలపక్ష పార్టీల నాయకులు సమావేశమై బీసీ రిజర్వేషన్లపై నమోదైన కేసులపై చర్చించారు. తెలంగాణ బీసీ సంక్షేమ అధ్యక్షులు, ఎంపీ ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్, నేరెళ్ళ ఆంజనేయులు, మండల ప్రతి పక్ష పార్టీ నాయకుడు మాజీ స్పీకర్ మధుసూదన్ చారి, పార్లమెంట్ సభ్యులు రవిచంద్ర, శాసనమండలి సభ్యులు కొమరయ్య, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు వి. హనుమంత రావు, మాజీ శాసనసభ్యులు పుట్ట మధు, బొల్లా మల్లయ్య, ఆనంద భాస్కర్, పన్నాల శ్రీరాములు, చెరుకు సుధాకర్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు సుప్రీంకోర్టు , హైకోర్టుల్లో వేసిన కేసులను ఎదుర్కోవడానికి ప్రముఖ అడ్వకేట్లను నియమించాలని చెప్పారు. హైకోర్టులో వెంటనే కేసులు వేయాలని, సుప్రీంకోర్టులో వేసిన కేసుల్లో అన్ని రాజకీయ పార్టీలు ఇంప్లీడు కేసులు వేయాలన్నారు. "ఎన్నో పోరాటాలు, ఉద్యమాల తర్వాత 42 శాతం రిజర్వేషన్లు సాధించాం. 50 శాతం సీలింగ్ ఉందని రిజర్వేషన్లు గిట్టని కొందరు ప్రజల్లో దుష్ప్రచారం చేస్తున్నారు. బీసీ ప్రజలకు న్యాయమైన వాటా వస్తుందంటే కొందరు కోర్టుకు పోయి అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నారు. అగ్రకులాలకు లేని 50 శాతం సీలింగ్, బీసీలకు ఎందుకు?. బీసీలు పోరాడి సాధించుకున్న రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తే తగిన గుణపాఠం నేర్పుతాం. అనవసరంగా రిజర్వేషన్లను వ్యతిరేకించి గ్రామాల్లో శాంతియుత వాతావరణం చెడగొట్టొద్దు. అగ్రకులాల జనాభా 6 శాతం ఉంటే 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. బీసీలకు ఇంకా అన్యాయం జరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. దీనిని కూడా ఓర్వకపోతే సహించం." అని హెచ్చరించారు.

## అడ్లూరిని ఏం అనలే..!

- **నా మాటల్ని వక్రీకరించారు**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో మంత్రులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆలస్యంగా వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ "దున్నపోతు" అని సంబోధించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ప్రెస్‌మీట్‌కు ముందు లైవ్‌లో పొన్నం ప్రభాకర్ మంత్రి వివేక్ చెవిలో గుసగుసలు ఆడారు. అక్కడే ఉన్న మీడియా మైక్‌ల ముందు ఆయన చేసిన వ్యాఖ్యలు అస్పష్టంగా వినిపించాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ అంశంపై తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. 'సహచర మంత్రి అడ్లూరిపై నేను అనని మాటల్ని అన్నట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అడ్లూరి లక్ష్మణ్ అంటే మాకెంతో గౌరవం. ఢిల్లీ వెళ్లేందుకు టికెట్స్ ఇంకా కన్ఫార్మ్ కాకపోవడంతో నా సిబ్బందిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ ఇచ్చారు.

# హైదరాబాద్ సిటీ బస్సు ఛార్జీల పెంపు

**నేటి నుండి అమలు**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం సిటీ బస్సు సర్వీసుల్లో రూ.5 నుండి రూ.10 వరకు ఛార్జీల పెంపును ప్రకటించింది. ఈ పెంపు అక్టోబర్ 6 నుండి అమలులోకి వస్తుంది. ప్రస్తుతం మొదటి మూడు స్టాప్‌ల వరకు కనీస ఛార్జీ రూ.10 చెల్లిస్తున్న ప్రయాణికులు.. ఇకపై రూ.15 చెల్లించాల్సి ఉంటుంది. నాలుగో బస్ స్టాప్ నుండి కనీస ఛార్జీ సుమారు రూ.20 ఉండవచ్చని తెలుస్తోంది. ఈ ఛార్జీల పెంపు ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో 2027 నాటికి డీజిల్ బస్సుల స్థానంలో 2,800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే ప్రణాళికలో భాగమని అధికారులు తెలిపారు. నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించడం, ట్రాఫిక్ రద్దీని సులభతరం చేయడం, పరిశుభ్రమైన ఆకుపచ్చ ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు ఈ చర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

### పెరిగిన ఛార్జీల వివరాలు, ఈ-బస్సుల ప్రణాళిక

ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-బస్సులలో మొదటి మూడు స్టేజీలకు రూ.5 అదనంగా వసూలు చేస్తారు. ఆ తర్వాత స్టేజీల నుండి రూ.10 పెరుగుతుంది. అదేవిధంగా, మెట్రో డీలక్స్ ఈ-మెట్రో ఏసీ సర్వీసులలో మొదటి స్టేజీకి రూ.5, రెండవ స్టేజీ నుండి రూ.10 చొప్పున ఛార్జీలు పెంచారు. కాలుష్యాన్ని తగ్గించి, నగరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఈ చర్య దోహదపడుతుందని టీజీఎస్ఆర్టీసీ పౌరులకు విజ్ఞప్తి చేసింది.

### ఈ-బస్సుల సంఖ్య, మౌలిక సదుపాయాల అభివృద్ధి

ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆరు డిపోలలో 265 ఈ-బస్సులు నడుస్తున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి మరో 275 బస్సులు అదనంగా ఈ సేవల్లో చేరనున్నాయి. దీంతోపాటు టీజీఎస్ఆర్టీసీ రూ.392 కోట్ల అంచనా వ్యయంతో 19 డిపోలలో ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తోంది. అలాగే, 10 కొత్త డిపోలు, ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ చారిత్రక కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని పౌరులను ఆర్టీసీ కోరింది. ఈ చర్య పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, పర్యావరణ అనుకూలమైన హైదరాబాద్ దిశగా ఒక ముందడుగు అని సంస్థ పేర్కొంది. డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సుల రాక పర్యావరణ పరిరక్షణకు, మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థకు తోడ్పడుతుంది.

### రేట్ల పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాల్సిందే..

**సర్కార్‌కు తెలంగాణ జాగృతి హెచ్చరిక**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సిటీ బస్సు చార్జీల పెంపు నిర్ణయాన్ని విరమించుకోవాలని తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.రూప్‌సింగ్‌నాయక్ డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. బస్సుల సంఖ్యను గణనీయంగా తగ్గించి.. బస్సు ప్రయాణాన్ని ఇబ్బందికరంగా మార్చేసిందని ఆరోపించారు. బస్సుల సంఖ్యను పెంచడాన్ని పక్కన పెట్టి చార్జీల భారాన్ని మోపిందని పేర్కొన్నారు. పండుగల పేరుతో ప్రజలపై అదనపు చార్జీల భారాన్ని మోపిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. పండుగ ముగియగానే సిటీలో చార్జీలను భారీగా పెంచిందని అన్నారు. ఒక్క స్టేజీ దాటితే రూ.10 అదనపు చార్జీ అంటే సామాన్యులు, నిత్యం పని చేసుకుంటేనే బతికేవారి పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిన తర్వాత అన్ని చార్జీలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. రేవంత్ తప్పుడు విధానాలతో రాష్ట్రం అతలాకుతలం అవుతున్నదని అన్నారు. చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ప్రజలతో కలిసి తెలంగాణ జాగృతి పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, యువ జాగృతి అధ్యక్షుడు శివారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కంటైనర్**

**ఆదిలాబాద్ (జనంసాక్షి) :** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన ఓ కంటైనర్ వెనుక నుంచి లారీని బలంగా ఢీకొట్టింది. గుడిహత్నూర్ మండలం సీతగొంది గ్రామం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. మంటల్లో లారీ, కంటైనర్ రెండూ కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఫైర్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చి మంటలు ఆర్పుతున్నారు. రోడ్డు ప్రమాదం కారణంగా దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. డ్రైవర్లు, క్లీనర్లు వెంటనే అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హిమాలయాల్లో రజినీకాంత్..

- **మానసిక ప్రశాంతత కోసం ఆధ్యాత్మిక యాత్ర**



**సిమ్లా (జనంసాక్షి) :** సూపర్‌స్టార్ రజనీకాంత్ హిమాలయాల్లో పర్యటిస్తున్నారు. ఒక భారీ చిత్రం షూటింగ్ పూర్తిచేసిన తర్వాత, మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును మొదలుపెట్టడానికి ముందు మానసిక ప్రశాంతత కోసం రజనీకాంత్ ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకుంటారు. ఆ ఆనవాయతీని కొనసాగిస్తూ ఆయన హిమాలయ యాత్ర చేపట్టారు. 'కూలీ' చిత్రం చిత్రీకరణను ఇటీవలే ముగించుకున్న రజినీకాంత్.. 'జైలర్ 2' షూటింగ్ ప్రారంభానికి ముందు వారం రోజులపాటు హిమాలయాల్లో గడపనున్నారు. ఈ యాత్రలో భాగంగా రజినీకాంత్ రిషికేశ్‌లోని ఆశ్రమంలో బసచేస్తూ బద్రీనాథ్, మహావతార్ బాబాజీ గుహ తదితర పవిత్ర స్థలాలను దర్శించుకున్నారు. హిమాలయాల ప్రకృతి సౌందర్యం నడుమ ధ్యానం చేశారు. ఒక ఫొటోలో రజినీ ఎంతో సింపుల్‌గా రోడ్డు పక్కన అల్పాహారం తింటూ కనిపించారు. రజినీకాంత్ యాత్రకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. యాత్రలో రజినీకాంత్ మాట్లాడుతూ.. 'ప్రతి సంవత్సరం ఇక్కడికి రావడంవల్ల ఒక కొత్త అనుభవం లభిస్తుంది. ప్రపంచమంతటికీ ఆధ్యాత్మికత చాలా అవసరం. అదే మనిషికి తృప్తిని, ప్రశాంతతను ఇస్తుంది' అని అన్నారు. భగవంతుడిపై విశ్వాసం జీవితంలో సమతుల్యతను అందిస్తుందని చెప్పారు.

# బైక్ దొంగలనుకుని నిప్పంటించారు

- **ముగ్గురు నిందితుల అరెస్టు**



**చేగుంట, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** బైకు దొంగతనానికి వచ్చిన దొంగలపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ తెలిపారు. ఆదివారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన బండెల మోహన్ అలియాస్ యోహన్, ఎర్రోల్ల మహిపాల్ ఇద్దరు వడియారం గ్రామంలో గల మహిపాల్ అత్తగారి ఇంటికి వచ్చారు. తిరిగి వెళ్తున్న సమయంలో గుండ్ల రమేశ్ బైక్‌పై వెళ్తుండటాన్ని స్థానికులు గమనించారు. దీంతో వారిని దొంగలుగా భావించి, వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ క్రమంలో దొంతి రామకృష్ణ, గుండ్ల రమేశ్, మరికుక్కల అనిల్‌లు మోహన్ జేబులో పెట్రోలుతో ఉన్న బాటిల్‌ను గమనించారు. ఆ బాటిల్ లాక్కుని వారిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. మరికొందరు అప్రమత్తమై, దొంగకు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు గాయపడిన దొంగను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మోహన్ స్టేట్‌మెంట్ ఆధారంగా దొంతి రామకృష్ణ, గుండ్ల రమేశ్, మరికుక్కల అనిల్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనతో ఇంకా ఎవరికైనా సంబంధం ఉంటే వారిని కూడా అరెస్టు చేయడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370